ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
బుధవారం 6, ఆగస్టు 2025

ఉచిత ప్రయాణానికి సన్నద్ధం!

ప్రజా ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో మరో ముఖ్యమైన పథకం ఈనెల 15 నుంచి అమలు కానుంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు ప్రకాశం రీజియన్ ఆర్టీసీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. 350 బస్సులను సిద్ధం చేశారు. వాటిలో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి. వీటిలో ప్రయాణించే మహిళలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన గుర్తింపు కార్డులతో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఆ దిశగా జిల్లాలోని ఆర్టీసీ అధికారులు అవసరమైన చర్యలను వేగవంతం చేశారు.

- ఒంగోలు కార్పొరేషన్, ఆంధ్రజ్యోతి



- 350 బస్సులను సిద్ధం చేసిన ఆర్టీసీ
- జిల్లాలో 250 పల్లె వెలుగులు, 4 అల్ట్రా పల్లె వెలుగులు, 96 ఎక్స్‌ప్రెస్‌లు
- బస్‌స్టేషన్‌లలో తాగునీరు, సోఫా సెట్లు, మరుగుదొడ్లు ఏర్పాటు
- 13 లక్షల మంది మహిళలకు లబ్ధి
- ఈనెల 15నుంచి అమలు

మహిళల కోసం 350 బస్సులు రెడీ..

ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం జిల్లా జనాభాలో 60 శాతం ఉన్న మహిళలందరికీ లభించనుంది. ప్రకాశం రీజియన్ పరిధిలో 485 బస్సులు నడుస్తుండగా, మహిళల ఉచిత ప్రయాణం కోసం 350 సిద్ధం చేశారు. వాటిలో 250 పల్లె వెలుగు, 4 అల్ట్రా బస్సులు, 96 ఎక్స్‌ప్రెస్ బస్సులను అందుబాటులోకి తీసుకు

మిగతా 6లో...



తగ్గని నోబిడ్‌లు

- నాలుగు కేంద్రాల్లో 40శాతంపైనే పొగాకు బేళ్ల తిరస్కరణ
- సగటున 33.75శాతం వెనక్కి



ఒంగోలు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు మార్కెట్లో నోబిడ్ బేళ్లు ఏమాత్రం తగ్గడం లేదు. మంగళవారం ఈ ప్రాంతంలోని 11 వేలం కేంద్రాల్లో ఏకంగా నాలుగు చోట్ల 40శాతంకన్నా అధికంగా బేళ్లు తిరస్కరణ (నోబిడ్)కు గురయ్యాయి. సగటున 33.75శాతం నోబిడ్‌లు ఉండగా అత్యధికంగా టంగుటూరు కేంద్రంలో 43.08శాతం ఉన్నాయి. తర్వాత కనిగిరిలో 42.31శాతం, పొదిలిలో 41.42శాతం, ఒంగోలు-1 కేంద్రంలో 40.31శాతం నోబిడ్ అయ్యాయి. కందుకూరు-2 కేంద్రంలో 39.68శాతం నోబిడ్ కాగా.. ఆ సంఖ్య వెల్లంపల్లి, ఒంగోలు-2, కందుకూరు-1, కలిగిరి కేంద్రాల్లో 25నుంచి 30శాతం ఉంది. లోగ్రేడ్ బేళ్లు అధికంగా అమ్మకాలకు రైతులు తెస్తుండగా వాటిని కొనేందుకు వ్యాపారులు ఏమాత్రం ఆసక్తి చూపకపోతుండటంతో ఈ పరిస్థితి నెలకొంది. దక్షిణాదిలోని 11 వేలం కేంద్రాలలో మంగళవారం 8,755 బేళ్లను రైతులు అమ్మకాలకు తీసుకొని రాగా 5,070 బేళ్లను మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేశారు. 3,685 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. అందులో ఏకంగా 2,948 బేళ్లను అధికారులు సూచించిన ధరకు వ్యాపారులు కొనుగోలు చేయక నోబిడ్ అయ్యాయి. గరిష్ఠ ధర కిలో రూ.281 మీద కొనసాగుతుండగా, కనిష్ఠ ధర కిలో రూ.150గా ఉంది.

యువ కౌలు రైతు ఆత్మహత్య

- అప్పుల బాధే కారణం

గిద్దలూరు టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో యువ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన గిద్దలూరు మండలం ఓబులాపురం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఓబులాపురంనకు చెందిన టి.దిలీప్‌కుమార్ (30) ఎకరా రూ.10వేల చొప్పున ఐదు ఎకరాలు కౌలుకు తీసుకున్నారు. అందులో మూడెకరాల్లో బర్లీ పొగాకు సాగు చేశారు. గిట్టుబాటు ధర రాకపోవడంతో నష్టపోయారు. మిగిలిన పొలంలో చిక్కుడు, ఆముదం సాగు చేయగా అందులోనూ నష్టాలు వచ్చాయి. సాగుకు, కుటుంబ అవసరాల కోసం సుమారు రూ.8లక్షల మేర అప్పు చేశారు. దీనికితోడు కుటుంబ సమస్యలు కూడా పెరగడంతో కొద్దిరోజులుగా తీవ్ర మనోవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. మంగళవారం గ్రామ సమీపంలోని శ్మశాన వాటిక వద్ద చెట్టుకు ఉరేసుకొని వేలాడుతూ కన్పించాడు. దిలీప్‌కుమార్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇక రైరై మంటూ..

- శరవేగంగా హైవేల నిర్మాణంతో ప్రయాణం సులువు
- ఎర్రగొండపాలెం - మాచర్ల రోడ్డుకు మహర్దశ
- కుంట నుంచి దోర్నాల వైపు రహదారికి తుది మెరుగులు
- ప్రజా ప్రభుత్వ పాలనలో చకచకా పనులు



కుంట - దోర్నాల మధ్య కొండలను కోసి నిర్మించిన రోడ్డు ఇలా..

ఘాట్‌రోడ్డు సమస్యలు ఇక తొలగిపోనున్నాయి. ఇరుకు రహదారి విశాలమవనుంది. నల్లమల అడవిలో రోడ్ల రూపురేఖలు మారిపోనున్నాయి. మార్కాపురం, ఎర్రగొండపాలెం వైపు నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణం సుఖవంతంగా మారబోతోంది. ప్రజా ప్రభుత్వ పాలనలో పశ్చిమ ప్రాంతంలో హైవేల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. దోర్నాల వైపు వెళ్లే రోడ్డు... కుంట నుంచి సుందరంగా రూపుదిద్దుకుంటోంది. అవసరమైన చోట కొండలను కోసి, గుట్టలను చదును చేసి కొత్త రోడ్లను నిర్మిస్తున్నారు. నల్లమలలో కూడా కల్వర్టులు, వంతెనల నిర్మాణంతో రోడ్డు విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి.



మాచర్ల రోడ్డులో ఘాట్ సమస్య నివారణకు కొత్తగా రోడ్డు మార్గం

త్రిపురాంతకం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం నుంచి మాచర్ల వైపు ప్రయాణం గతంలో ఇబ్బందికరంగా ఉండేది. నల్లమల అడవిలో ఘాట్‌రోడ్డు అక్కడక్కడా మలుపులతో కనీస మరమ్మతులు కూడా లేని కారణంగా గోతులుగా మారి ప్రయాణం ఇబ్బందికరంగా ఉండేది. కానీ ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో ఈ ఎన్‌హెచ్-565 రోడ్డును దాదాపు రూ.230కోట్లతో నిర్మించడానికి పనులు చేపట్టారు. అందులో భాగంగా రోడ్డు విస్తరణతోపాటు కొండలను కోసి గుట్టలను చదునుచేసి కొత్తగా అవసరమైనచోట వంతెనలు, కల్వర్టులు నిర్మిస్తూ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. కొన్నిచోట్ల మలుపులు కూడా తొలగిస్తూ నల్లమల అటవీ ప్రాంతంలో ఘాట్ ఉన్నచోట కూడా వేరే మార్గం వైపు తప్పిస్తూ రోడ్డు రూపురేఖలను పూర్తిగా మారుస్తున్నారు. దీనివల్ల ప్రయాణం సుఖంగా జరగడమే కాకుండా సమయం కూడా ఆదా అవుతుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ ప్రయాణికుల అవస్థలు ఈ రోడ్డుతో పూర్తిగా తొలగిపోయినట్టేనని అంటున్నారు. ఇదే తరహాలో కుంట నుంచి దోర్నాల వైపు ఎన్‌హెచ్-765 జాతీయ రహదారి పనులు కూడా

మిగతా 6లో...

పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగోన్నతులకు కసరత్తు

- జాబితాలు సిద్ధం చేస్తున్న అధికారులు
- సీనియారిటీలో జిల్లా నుంచి 200 మంది

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శులకు త్వరలో ఉద్యోగోన్నతులు లభించనున్నాయి. అందుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో ఆశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. అవసరమైన జాబితాలను సిద్ధం చేస్తున్నారు. తాత్కాలిక జాబితాలను ఈనెల 7వతేదీ లోపు పూర్తి చేయనున్నారు. వాటిపై అభ్యంతరాలు వస్తే ఈనెల 24న పరిష్కరిస్తారు. 27వ తేదీన తుది జాబితాను ప్రకటిస్తారు. 29న ప్యానల్‌ను సిద్ధం చేసి 31వ తేదీలోపు ఉద్యోగోన్నతులు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గ్రేడ్-1, గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగోన్నతులు ఆశాఖ కమిషనర్ కార్యాలయంలో జరగనున్నాయి. గ్రేడ్-3 కార్యదర్శుల విషయం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. దీంతో గ్రేడ్-4 నుంచి గ్రేడ్ 6 వరకు ఉద్యోగోన్నతులు కల్పించేందుకు ఆశాఖ అధికారులు సీనియారిటీ జాబితాలను సిద్ధం చేస్తున్నారు. అందులో కేడర్ల వారీగా జిల్లాలో 200 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. గత వైసీపీ హయాంలో సచివాలయాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు ఎలాంటి ఉద్యోగోన్నతులు కల్పించలేదు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవో జారీ చేయడంతో వారిలో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. గత ఐదేళ్లుగా ఎలాంటి ఉద్యోన్నతులు లేకుండా పనిచేస్తున్న వీరంతా ఒకేసారి ఉద్యోగంలో చేరారు. దీంతో ఏ ఉద్యోగి ముందు చేరి ఉంటారో వారు సీనియారిటీ జాబితాలో ముందుండే అవకాశం ఉంది.

ఐదు రోజుల్లో.. 69.44శాతం మందికి..

- వేగంగా సాగుతున్న రేషన్ పంపిణీ



ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రేషన్ పంపిణీ ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఐదు రోజుల్లో 69.44 శాతం మంది కార్డుదారులు సరుకులు అందుకున్నారు. జిల్లాలో 1,392 దుకాణాల పరిధిలో 6,61,141 రేషన్ కార్డులు ఉన్నాయి. వీరిలో మంగళవారం సాయంత్రానికి 4,59,120 కార్డుదారులు రేషన్ తీసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మొబైల్ వాహనాల ద్వారా పంపిణీకి రోజుల తరబడి సమయం పట్టేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్‌షాపుల ద్వారానే పంపిణీకి శ్రీకారం చుట్టింది. రెండు పూటలా బియ్యం, పంచదార ఇస్తుండటంతో కార్డుదారులు సమయానుకూలంగా వెళ్లి తెచ్చుకుంటున్నారు. దోర్నాల మండలంలో 13,456 కార్డులు ఉండగా జిల్లాలోనే అత్యధికంగా 11,124 కార్డుదారులు సరుకులు తీసుకున్నారు. దివ్యాంగులు, వృద్ధులకు వారి నివాసాల వద్దనే రేషన్ పంపిణీ చేస్తుండగా ఇప్పటి వరకూ 79.77శాతం మందికి సరుకులు అందాయి.



కమ్మవారి పల్లెలో గరళకంఠులు

- దశాబ్దాలుగా ఫ్లోరైడ్ నీటినే సేవిస్తున్న దళితులు, గిరిజనులు
- కలుషిత నీటి కాటుతో సగం జీవితానికే నేలచూపులు
- అరకొర పరిష్కార మార్గాలకే గత పాలకులు పరిమితం
- పరాయి ప్రాంతాలకు వలసలు పోతున్న గ్రామస్థులు
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చొరవతో సమస్యకు పరిష్కార మార్గం
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరాశాఖ బృందం పర్యటనతో చిగురించిన ఆశలు

7

ఉత్తమ అవార్డుల ఎంపికకు కొత్త విధానం

- ఉపాధ్యాయుల నుంచి 3 రకాల దరఖాస్తులు
- పరిగణనలోకి 17 అంశాలు
- 21నుంచి 23 వరకు ఇంటర్వ్యూలు

7

ఆక్వా చెరువుల వద్ద వెట్టిచాకిరీ

- మధ్యవర్తుల ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు..
- నెల రోజులుగా డబ్బులు ఇవ్వని యజమానులు
- కనీస వసతులు, భోజనం కూడా కల్పించని దైన్యం
- అల్లాడిపోయిన ఒడిశా, చత్తీస్‌ఘడ్ కార్మికులు
- ఒకరు తప్పించుకుని సొంత రాష్ట్రానికి వెళ్లిన వైనం
- అక్కడి కలెక్టర్‌కు ఫిర్యాదు
- ఆయన ఫోన్‌తో కదిలిన ఇక్కడి అధికారులు
- రెండు రాష్ట్రాలకు చెందిన 40 మందికి విముక్తి

వివరాలు మెయిన్‌లో

ఎరువుల కొరత లేకుండా చూడాలి

- అధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశం



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైతులకు ఎరువుల కొరత లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ, మార్క్‌ఫెడ్, సహకారశాఖ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలుసూచనలు చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 54,468 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ఏప్రిల్ 1నాటికి 27,111 మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు కలెక్టర్‌కు వివరించారు. ఈనెల 5వతేదీ నాటికి 27,861 మెట్రిక్ టన్నులు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు రైతులు 24,471 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించారని వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అంతకు ముందు మంత్రి అచ్చెన్నాయుడు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

కొండపి పంచాయతీ ఎన్నిక ఏకగ్రీవం

సర్పంచ్‌గా సుశీల, ఉపసర్పంచ్‌గా వాసంతి

- రెండు పదవులూ టీడీపీ మద్దతుదారులే కైవసం
- 14 వార్డుల్లో 9 టీడీపీకి, ఐదు వైసీపీకి
- ఒప్పందం ప్రకారం నామినేషన్లు ఉపసంహరించుకున్న ఇతరులు
- పర్యవేక్షించిన మంత్రి స్వామి, సత్య

కొండపి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కొండపి పంచాయతీ ఎన్నిక ఏకగ్రీవమైంది. టీడీపీ మద్దతుదారైన కొమ్ము సుశీల సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. మొత్తం 14 వార్డుల్లో టీడీపీకి 9, వైసీపీకి 5 ఏకగ్రీవమయ్యాయి. ప్రధాన పార్టీలు ఒక ఒప్పందానికి రావడంతో పోలింగ్ లేకుండానే ప్రక్రియ ముగిసింది. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణల అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన వారికి ఆర్వో జె.రవికుమార్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సాయంత్రం గ్రామ సచివాలయంలో టీడీపీ మద్దుతుదారులైన 9 మంది వార్డు సభ్యులు సమావేశమై ఉపసర్పంచ్‌గా కూనంనేని వాసంతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, పంచాయతీలోని టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డు సభ్యులు వీరే..

1వ వార్డు సభ్యుడిగా ముక్కు ప్రసాద్ (టీడీపీ), 2వ వార్డు నుంచి కడియం నరసింహారావు (వైసీపీ), 3వ వార్డు నుంచి నేతి రవికుమార్ (టీడీపీ), 4వ వార్డు నుంచి నలమళ్ల శివకుమారి (టీడీపీ), 5వ వార్డు నుంచి బాలిశెట్టి సువార్తమ్మ (వైసీపీ), 6వ వార్డు నుంచి మునగాల కృపమ్మ (టీడీపీ), 7వ వార్డు సభ్యుడిగా యనమద్ని వెంకటేశ్వర్లు (టీడీపీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 8వ వార్డు సభ్యురాలిగా దేపూరి



కొమ్ము సుశీల



కూనంనేని వాసంతి



సమావేశమైన వార్డు సభ్యులు

మిగతా 6లో...

పీ4 లో చురుకైన పాత్ర పోషించాలి

నేను 250 కుటుంబాలను దత్తత తీసుకున్నా

కలెక్టర్, ఎమ్మెల్యేల వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ 4 పథకంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చురుకైన పాత్ర పోషించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లు, శాసనసభ్యులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఈ విషయంలో ప్రతి మండలానికి, వారాంతపు రేటింగ్ ఇస్తానన్నారు. ఈ పథకం అమలు ద్వారా సమాజంలో వస్తున్న మార్పును ప్రతి మూడు నెలలకు ఒకసారి మదింపు చేయిస్తానని తెలిపారు. తాను కూడా 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక హ్యాండ్‌బుక్‌ను ముద్రించిందన్నారు. మార్గదర్శకులకు ఉన్న అపోహలను తొలగించేలా సమగ్ర వివరాలు ఇందులో పొందుపర్చినట్లు తెలిపారు. సేవా దృక్పథంతో ముందుకు వచ్చేలా మార్గదర్శకులలో ప్రేరణ నింపాలన్నారు. ఈనెల 15వ తేదీ నాటికి మార్గదర్శకులను పూర్తి స్థాయిలో గుర్తించి 19వ తేదీన ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు సీఎం తెలిపారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఈ సందర్భంగా ఆయా అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో 74,911 బంగారు కుటుంబాలకు గుర్తించగా 6,350 మార్గదర్శకులను 37,389 కుటుంబాలకు అనుసంధానం చేశామన్నారు. మిగతా బంగారు కుటుంబాల కోసం మార్గదర్శకులను త్వరగా గుర్తిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, డీఆర్వో చిన ఓబులేషు, జడ్పీ సీఈవో చిరంజీవి, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, కొండపి నియోజకవర్గ స్పెషల్‌ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి, సీపీవో స్వరూపరాణి ఇతర అధికారులు ఉన్నారు.


సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా, అధికారులు

స్కూల్ గేమ్స్ సెక్రటరీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు విద్య, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూలు గేమ్స్ సెక్రటరీ పోస్టు నియామకానికి అర్హులైన స్కూలు అసిస్టెంట్ వ్యాయామ విద్య/పీఈటీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగత వారు ఈనెల 8లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పోస్టు కాలపరిమితి రెండు సంవత్సరాలు ఉంటుందని, అందుకు సంబంధించిన సమాచారాన్ని నోటీసుబోర్డులో ఉంచామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

జిల్లా వ్యాప్తంగా రండి టీతాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని యూనిట్ల సంఘ బాధ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక రామనగర్‌లోని ఫుడ్ సేఫ్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి కిరణ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై ఉద్యోగులు చర్చించారు. ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు రావాల్సిన నాలుగు డీఏలను ఇవ్వాలని, పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి ఐఆర్(మధ్యంతర భృతి) ప్రకటించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, వివిధ వర్గాల నుంచి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కారం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వరకుమార్, సంఘం నాయకులు వెంకటేశ్వరరెడ్డి, గోపికృష్ణ, రంగారెడ్డి, ఎం. శ్రీనివాసరావు, ఏసురత్నం, సునీల్, జవహర్‌వలి, సురేష్‌బాబు, శ్రీదేవి, చంద్రశేఖర్, శ్రీనివాసులు, మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మానస, వనజ,సుమతి, గౌరీ పాల్గొన్నారు.


ఒంగోలులో టీ తాగుతూ సమావేశమైన ఉద్యోగులు

రెండు రోజులుగా పోస్టల్ సర్వర్ డౌన్

- ఇబ్బందులు పడిన ప్రజలు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సేవలకు అంతరాయం ఏర్పడింది. సోమ, మంగళవారంలో సర్వర్ రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయవాడ రీజియన్ పరిధిలోని ఈసమస్య తలెత్తినట్లు తపాలా శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. గత నెలలో తపాల శాఖ సాఫ్ట్‌వేర్‌ను 2.0గా అప్‌డేట్ చేయడంతో సాంకేతిక సమస్యలు ఎదురైనట్లుగా అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా 427 పోస్టాఫీస్‌ల ద్వారా అందించే బ్యాంకింగ్, కొరియర్, రిజిస్టర్ పోస్టులు, పీఎల్‌ఐ, ఇతరత్రా వివిధ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం మధ్యాహ్నం 3గంటల నుంచి సర్వర్ కొంతమేర పనిచేయడంతో సేవలను కొనసాగించారు. రెండు రోజులుగా తలెత్తిన సర్వర్ సమస్యతో ప్రజలు తమ కవర్లను ఇతర ప్రాంతాలకు పంపేందుకు ప్రవేటు కొరియర్లను ఆశ్రయించారు.


ఒంగోలులో బోసిపోయిన పోస్టాఫీస్

హోంగార్డుల నుంచి కానిస్టేబుళ్లుగా...

- జిల్లాలో 9 మంది ఎంపిక

-అభినందించిన ఎస్పీ

ఒంగోలు క్రైం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి) : ఆత్మ విశ్వాసం.. పట్టుదల.. క్రమశిక్షణ వారి విజయానికి సోపానంగా మారాయి. పోలీసుశాఖలో అంతర్ భాగంగా ఉన్న హోంగార్డు విభాగంలో ఏళ్ల తరబడి కష్టపడి ప్రజలకు సేవలు అందించిన 9 మంది హోంగార్డులు ఇటీవల జరిగిన కానిస్టేబుల్ పరీక్షలో విజయం సాధించి తమ సత్తా చాటారు. అంతేకాదు యువతకు ఆదర్శంగా నిలబడ్డారు. జిల్లాలో హోంగార్డులుగా పనిచేస్తున్న 9 మంది హోంగార్డులు తమ విధులు నిర్వహిస్తూనే శరీరక ధారుడ్య పరీక్షలతో పాటు రాత పరీక్షలకు అహర్నిశలు కష్టపడి విజయం తమ సొంతం అని నిరూపించుకున్నారు. వీరిలో 8 మంది సివిల్ కానిస్టేబుళ్లుగా, మరొకరు ఏపీఎస్పీ కానిస్టేబులుగా నెగ్గి శిక్షణకు వెళుతున్నారు.

ఎంపికైన వారు

హోంగార్డులుగా పనిచేస్తూ కానిస్టేబుళ్లుగా ఎంపికైన సిహెచ్.ఆవులయ్య, వైవిబి. గాంధీ, బాలకోటేశ్వరరావు, ఎం.శివప్రసాద్, పి.అమర్‌నాథ్, వి.సత్యనారాయణ రెడ్డి, ఏడుకొండలు, దాసరి ఆశీర్వాదం, ఎస్.కె. అన్వర్ బాషాలు ఉన్నారు.

అభినందించిన ఎస్పీ

కానిస్టేబుళ్ల ఎంపిక పరీక్షలో నెగ్గి ఉద్యోగం సాధించిన 9 మంది హోగార్డులను ఎస్పీ ఏఆర్.దామోదర్ మంగళవారం అభినందించారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హోంగార్డులు కష్టపడి కానిస్టేబుళ్లగా ఉద్యోగం సాధించడం స్ఫూర్తిదాయకం అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, ఆర్‌ఐ.సీతారామిరెడ్డి పాల్గొన్నారు.


కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారిని అభినందిస్తున్న ఎస్పీ దామోదర్

ఏబీసీలో సాగుకు వంతెన అవాంతరాలు

- ఆలస్యంగా ప్రారంభమైన పనులు
- కొట్టుకుపోయిన డైవర్షన్
- నీటి కట్టడిలో అధికారులు విఫలం

అద్దంకి,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ, ఎన్‌ఎస్‌పీ అధికారుల మధ్య సమన్వయ లోపం రైతులకు శాపంగా మారింది. అద్దంకి-బల్లికురవ-సంతమాగులూరు రోడ్డు లో ఏబీసీపై వల్లాపల్లి సమీపంలో సుమారు రూ.2 కోట్లతో వంతన నిర్మాణానికి మంత్రి రవికుమార్ నిధులు మంజూరు చేయించారు. అయితే వేసవిలోనే పనులు మొదలు పెట్టాల్సిన కాంట్రాక్టర్, ఆర్‌అండ్‌బీ అధికారులు తీరిగ్గా పక్షంరోజుల క్రితం పనులు ప్రారంభించారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా జూలై నెల చివరలోనే కృష్ణా నది ఎగువ ప్రాంతంలో వరదలతో సాగర్ డ్యామ్ పూర్తిస్థాయిలో నిండింది. దీంతో నీటిని దిగువకు విడుదల చేశారు. అయితే తొలుత అద్దంకి బ్రాంచి కెనాల్‌కు నీటి విడుదల చేయలేదు. ప్రధాన కాలువలో నీటి సామర్థ్యం ఎక్కువగా ఉండడంతో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఏబీసీకి నీటి విడుదల చేశారు. ఈ క్రమంలో 31వ మైలు వద్ద భవనాసి ఎస్కేప్ ఛానల్‌కు నీటి మళ్లించే విధంగా వేసిన అడ్డుకట్ట అంతంత మాత్రంగా ఉండడంతో కొట్టుకుపోయింది. అనంతరం ఏబీసీలో దిగువకు నీటి ప్రవాహం వచ్చింది. దీంతో 33వ మైలు వద్ద బ్రిడ్జి నిర్మిస్తున్న స్థలానికి ఏర్పాటు చేసిన డైవర్షన్ కోతకు గురైంది. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం వంతెన నిర్మాణ పనులకు ఆటకం ఏర్పడింది. దీంతో మరలా వంతెన నిర్మాణ పనులు చేపట్టాలన్న ఉద్దేశ్యంతో మంగళవారం నుంచి ఏబీసీకి నీటి విడుదల పూర్తిగా తగ్గించారు. 500 క్యూసెక్కులు మాత్రమే వదలడంతో పల్నాడు జిల్లా ఆయకట్టు వరకే పరిమితం చేశారు. దీంతో బాపట్ల జిల్లా పరిధిలో ఉన్న ఏబీసీ ఆయకట్టు రైతులు కనీసం మరో నెల రోజుల పాటు సాగుకు ఆగాల్సిన పరిస్థితి నెలకొంది. అకాస్మాత్తుగా నీటి విడుదల చేయడంతో వంతన నిర్మాణ పనులు మొదటికి రాగా, సాగుకు మరో 15 రోజులు పనులు ఆలస్యం అయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పలువురు రైతులు బోరు బావుల కింద వరి నారు మడులు పోశారు. సాగునీరు విడుదలైతే వెంటనే నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. నీటి విడుదల ఆలస్యం కావడంతో నారు ముదిరిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు ఈ ఏడాది ముందస్తుగానే సాగునీరు ముందస్తుగానే విడుదల చేస్తుండడంతో వరినాట్లు వేసుకోవచ్చు అనుకున్న రైతులకు నిరాశే మిగిలింది. ఇలా రెండు శాఖల అధికారులు, కాంట్రాక్టర్ ల మధ్య సమన్వయ లోపంతో రైతులకు ఇబ్బందులను తెచ్చిపెట్టింది. ఉన్నతాధికారులు స్పందించి పనులు వేగవంతంగా పూర్తి చేసి సాగు నీటి విడుదల జరిగేలా చర్యలు చేపట్టాలని, డైవర్షన్ పునర్నిర్మించి చేసి రాకపోకలకు వీలు కల్పించాలని కోరుతున్నారు.


అద్దంకి బ్రాంచికెనాల్ లో నీరు, పగలగొట్టిన పాత వంతెనలో కొంతభాగం

కుమారుడిపై తండ్రి గొడ్డలితో దాడి

అవీఇవీ


వైద్యశాలలో చికిత్స చేస్తున్న వైద్యులు

పెద్దదోర్నాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో గొడవ చేస్తున్న తండ్రిని మందలించిన కుమారుడిపై గొడ్డలి, విల్లంబులతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన మండలంలోని పోతన్న గూడెంలో సోమవారం రాత్రి జరిగింది. ఈ ఘటనలో కుడుముల బయన్నకు తలపై గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పోతన్నగూడేనికి చెందిన కుడుముల వెంకటేశం మద్యం సేవించి భార్యపై చేయిచేసుకుంటుండగా కుమారుడు బయన్న అడ్డుకున్నాడు. దీంతో ఆవేశంతో వెంకటేశం గొడ్డలితో కుమారుడి తలపై దాడి చేసి, అనంతరం విల్లంబుతో కూడా గాయపరిచి పరారయ్యాడు. గమనించిన బంధువులు క్షతగాత్రున్ని దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత ప్రయాణానికి సన్నద్ధం!

(5వపేజీ తరువాయి)

రానున్నారు. ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, పొదిలి డిపోలతోపాటు 650 గ్రామాలకు అనుసంధానమైన 20 డిపోలలో అవసరమైన సౌకర్యాలు కల్పించనున్నారు ఆయా బస్‌స్టేషన్‌లలో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం, బస్సుల కోసం వేచి ఉండేందుకు సోఫాసెట్లు అందుబాటులోకి తీసుకురానుండటంతో మహిళలు మరింత దర్జాగా ఆర్టీసీలో ప్రయాణించనున్నారు.

ఈ బస్సుల్లోనే ఉచితం

మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ ఐదు రకాల బస్సుల్లో ప్రయాణించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, రేషన్ కార్డులలో ఏదైనా చూపించి ప్రయాణించవచ్చు.

ఈ బస్సులలో అవకాశం లేదు

కొన్ని బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం లేదని ఆర్టీసీ అధికారులు వెల్లడిస్తున్నారు. సూపర్ లగ్జరీ, ఏసీ, గరుడ, అమరావతి వంటి ప్రీమియం బస్సుల్లో ఈ పథకం వర్తించదు. దీంతోపాటుగా ఇతర రాష్ట్రాల సర్వీసుల్లో కూడా ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండదని ఆర్టీసీ అధికారులు వెల్లడిస్తున్నారు.

● ఆర్థిక భారమైనా.. అమలుకు ముందడుగు

ప్రకాశం రీజియన్ పరిధిలో ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, పొదిలి, ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. వాటి పరిధిలోని 866 గ్రామాలకు అనుసంధానంగా 20 బస్‌స్టేషన్లు ఉన్నాయి. 485 ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. వాటిలో 95 అద్దె ప్రాతిపదికన (హయ్యర్) బస్సులు నడుస్తున్నాయి. ఈ బస్సులన్నీ రోజుకు సుమారు 2 లక్షల కిలోమీటర్లు ప్రయాణికుల కోసం రాకపోకలు సాగిస్తుండగా, అందులో 1.5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. దీంతో రోజుకు ప్రకాశం రీజియన్‌కు రూ.77.51 లక్షల ఆదాయం వస్తోంది. అందులో సగం మంది మహిళలు కావడంతో వారికి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందించనుండటంతో రోజువారీగా రూ.38.5 లక్షల భారం ప్రభుత్వంపై పడనుంది.

60 శాతం మహిళలే..

జిల్లాలో సుమారు 26 లక్షల మంది వరకు జనాభా ఉంది. అందులో సగానికిపైగా మహిళలే ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అందులోనూ పేద, మధ్య తరగతి కుటుంబాల వారే ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారుల లెక్కల ప్రకారం ప్రకాశం రీజియన్ నుంచి ప్రతిరోజూ సుమారు 60 శాతం మంది మహిళలు ప్రయాణిస్తున్నట్లు సమాచారం. ఇప్పటివరకు ఆర్టీసీలో ప్రయాణించడం ద్వారా ఆ సంస్థకు రోజూ రూ.77.51 లక్షల ఆదాయం లభిస్తోంది. ఇకపై ఉచిత బస్ ప్రయాణంతో ఆర్టీసీలో ప్రయాణించే మహిళల సంఖ్య పెరగనుంది. దీంతో రోజువారీ ఆ ఆదాయం రూ.38.5 తగ్గనుంది. ఇందుకు సంబంధించి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైనప్పటికీ జిల్లాలోని 13 లక్షల మంది మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ యోగం లభించనుంది.

రీజియన్ పరిధిలో సర్వం సిద్ధం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి తీసుకొస్తున్న మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని విజయవంతం చేసేందుకు ప్రకాశం రీజియన్ పరిధిలో అవసరమైన చర్యలు చేపట్టాం. నెల రోజులుగా జిల్లాలోని ఐదు డిపోలు, ఇరవై బస్ స్టేషన్‌లలో తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి సీట్లఏర్పాటు వంటి మౌలిక సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాం. ఉచిత ప్రయాణం ద్వారా ప్రయాణికుల సంఖ్య 90 శాతం పెరిగే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా వాహనాల ఇంజన్ కండిషన్, టైర్లు, బస్ స్ప్రింగ్‌లు, బస్సులలోని కిటికీలకు షట్టర్ గ్లాస్‌లు ఏర్పాటు చేస్తున్నాం. శానిటరీ సిబ్బంది 51 మంది ఉండగా 60కి పెంచాం. ఓడీలో ఉన్న సిబ్బందినీ విధుల్లోకి తీసుకొని పూర్తిస్థాయి సేవలు అందించడానికి అవసరమైన చర్యలు చేపట్టాం.

- జి.సత్యనారాయణ, రీజనల్ మేనేజర్, ప్రకాశం

ఇక రైరైమంటూ..

(5వపేజీ తరువాయి)

చాలావరకు పూర్తి కావచ్చాయి. ఈ రోడ్డు నిర్మాణం కోసం కూడా ప్రభుత్వం రూ.115కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ రోడ్డు నిర్మాణంలో కూడా కుంట వద్ద ఉన్న కొండను సగంగా విభజించి రోడ్డు నిర్మించిన తీరు ప్రయాణానికే కాదు చూడటానికి కూడా ఆసక్తిగా ఉంది. గతంలో ఇదే దారిలో రోడ్డు ఉన్నప్పటికీ విస్తరణలో భాగంగా ఇంకా కొండను తొలచి రోడ్డు నిర్మించారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నిర్మిస్తున్న రోడ్డు పనులు పూర్తయితే ప్రయాణ ఇబ్బందులు తొలగిపోతాయని ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

కొండపి పంచాయతీ ఎన్నిక ఏకగ్రీవం

(5వపేజీ తరువాయి)

రోజా (టీడీపీ), 9వ వార్డు నుంచి కూనంనేని వాసంతి (టీడీపీ), 10 వార్డు నుంచి పల్లె శివరావు (వైసీపీ), 11వ వార్డు నుంచి కొమ్ము నాగలక్ష్మి (వైసీపీ), 12వ వార్డు నుంచి తన్నీరు సుబ్బులు (టీడీపీ), 13వ వార్డు నుంచి మామిళ్లపల్లి గోవిందమ్మ (వైసీపీ), 14వ వార్డు సభ్యురాలుగా చింతల సుజాత (టీడీపీ) ఎన్నికయ్యారు.

మంత్రి స్వామి, సత్యల పర్యవేక్షణ

నామినేషన్ల ముగింపు రోజైన మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య కొండపిలోని టీడీపీ కార్యాలయంలోనే ఉన్నారు. మండలం, గ్రామ పంచాయతీలోని పార్టీ నాయకులను సమన్వయం చేసుకుని సర్పంచ్‌గా మాదిగ సామాజిక వర్గానికి చెందిన కొమ్ము సుశీలను, ఉపసర్పంచ్‌గా కూనంనేని వాసంతిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మొట్టమొదటి సారిగి కొండపి సర్పంచ్ పదవిని మాదిగ సామాజికవర్గానికి కేటాయించారు. ఉపసంహరణల విషయంలో కూడా అభ్యర్థులను ఒప్పించడంలో కీలకపాత్ర పోషించారు. ఒప్పందం ప్రకారం వైసీపీకి ఐదు వార్డులు కేటాయిచడంలో చొరవ తీసుకున్నారు. గ్రామస్థుల ఏకాభిప్రాయం సాధించడంలో కృతకృత్యులయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కొండపి సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో సర్కిల్‌లోని ఎస్సైలు, పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు.



మోకాళ్లు ఒంగిపోయి నడుస్తున్న ఆటోడ్రైవర్ సామేలు

కమ్మ వారి పల్లెలో



ఫ్లోరైడ్ బారినపడిన కమ్మ వారిపల్లి ఎస్సీ కాలనీ

- వారి గోడు పట్టని పాలకులు
- ఫ్లోరైడ్ రక్కసి కాటుతో సగం జీవితానికే నేల చూపులు
- అరకొర పరిష్కార మార్గాలకే పరిమితమైన గత వైసీపీ పాలకులు
- పరాయి ప్రాంతాలకు వలసలు పోతున్న గ్రామస్థులు
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చొరవతో ఫ్లోరైడ్ సమస్యకు పరిష్కార మార్గం
- డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ద్వారా నిధుల అభ్యర్థన
- ఇటీవల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణనీటిసరఫరాశాఖ బృందం పర్యటన
- బృందం పర్యటనతో మంచి రోజులొస్తున్నాయని ప్రజల్లో చిగురించిన ఆశలు

గరళకంఠులు

దశాబ్దాలుగా ఫ్లోరైడ్ నీటినే సేవిస్తున్న దళితులు, గిరిజనులు

కనిగిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి మండలంలోని దిరిశవంచ పంచాయతీ పరిధిలో 250 గృహాలు ఉన్నాయి. వాటిలో కమ్మవారిపల్లి గ్రామంలో 115 గృహాలు ఉండగా 546 మంది జీవిస్తున్నారు. వీరు కొన్ని దశాబ్దాలుగా ఫ్లోరోసిస్ సమస్యతో బాధపడుతున్నారు. గారపట్టిన పళ్లు, వంకర్లు పోయిన కాళ్లు, చేతులు. వెన్నెముక సమస్యలు.. కిడ్నీ వ్యాధులు.. అనేక రుగ్మతలలో అల్లాడుతున్నారు. ముఖ్యంగా కమ్మవారిపల్లి ఎస్సీ కాలనీ, పునుగోడు గ్రామ ఎస్టీ కాలనీ ప్రజలు ఫ్లోరైడ్ బారినపడి ఇంటికొకరు మంచానికే పరిమితమై కాలం వెళ్లదీస్తున్నారు. గత పాలకులు తీసుకున్న అరకొర చర్యలు మినహా సమస్య శాశ్వత పరిష్కారం దిశగా అడుగులేసింది లేదు. దీంతో చాలామంది పరాయి ప్రాంతాలకు వలస వెళ్లి వివిధ పనులు చేసుకుని జీవిస్తున్నారు. కొంతమంది మాత్రం పుట్టిన గ్రామాన్ని వదిలి వెళ్లలేక ఫ్లోరైడ్‌తోనే సహవాసం చేస్తూ బతుకు లీడుస్తున్నారు. ఇటీవల అక్కడ పర్యటించిన ప్రత్యేక బృందం అక్కడి నీటిని పరీక్షించగా 6.5శాతం ఫ్లోరైడ్ శాతం ఉండటం మరింత ఆందోళనకు గురి చేస్తోంది.



లేవలేని స్థితిలో వాకర్ సాయంతో ఉన్న బలసాని కాంతమ్మ

బోరు నీటినే తాగుతున్న దళిత కుటుంబాలు

కమ్మవారిపల్లిలో ఉన్న దళిత కాలనీలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. గ్రామంలో ఉన్న నీటి ట్యాంకు దూరంగా ఉండటంతో అక్కడికి వెళ్లి తెచ్చుకోవడం ఇబ్బందిగా మారింది. గత టీడీపీ ప్రభుత్వంలో ట్యాంకును ఏర్పాటు చేసి ప్రత్యేక మోటార్ ద్వారా ఎస్సీ కాలనీకి నీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం అది చెడిపోయి ట్యాంకు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారింది. దీంతో కాలనీ ప్రజలకు మంచి నీటి ఇక్కట్లు మరింత పెరిగాయి. దీంతో బోరు నీరే దిక్కయ్యింది. ప్రస్తుతం కాలనీలో ఉన్న పంచాయతీ చేతి పంపుల్లో కొన్ని మొరాయించాయి. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకున్న నాథుడు కరువయ్యాడు. అసలే మోకాళ్ల నొప్పులు, బరువు మోయలేని స్థితిలో ఉన్న కాలనీ వాసులకు ఊళ్లోకి వెళ్లి నీరు తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా మారింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో బోరు నీటిని తాగుతున్నారు. దీంతో ఫ్లోరైడ్ రక్కసి కోరల్లో చిక్కి వారి జీవనం దుర్భరంగా మారింది. దీంతో కాలనీలో నివసించే పెద్దలతోపాటు చిన్నపిల్లలు కూడా ఫ్లోరోసిస్ బారినపడుతున్నారు.



పట్టుకుంటే లేవలేని స్థితిలో ఉన్న దానయ్య

రోజుకు 2వేల లీటర్ల తాగునీరు అవసరం

కమ్మవారిపల్లెలో నివసించే ప్రజలకు రోజుకు సగటున 2.5వేల లీటర్లు తాగునీరు అవసరం. కానీ గ్రామంలోని ట్యాంకుకు 5 రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు. సగటును ఒక్కో మనిషికి రోజుకు 40లీటర్లు మంచినీరు అవసరం ఉంటుంది. అంటే రోజుకు ఆ గ్రామంలో నివసించే ప్రజలకు 2వేల లీటర్లకుపైగా కావాలి. ఐదురోజులకు ఒకసారి సరఫరా చేస్తున్న నీరు ఆ గ్రామ ప్రజలకు ఏమాత్రం సరిపోవడం లేదు. వాటర్ ప్లాంట్ల నుంచి బబుల్ రూ.15 చెల్లించి కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్కో కుటుంబానికి రెండు బబుల్స్ అవసరమవుతాయి. అందుకోసం రోజుకు రూ.30 ఖర్చు చేయాల్సి వస్తోంది.

ఫ్లోరైడ్ నుంచి విముక్తికి ఉగ్ర చర్యలు

ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి 2024 ఎన్నికలకు ముందు మండలంలోని కమ్మవారిపల్లి, పునుగోడు ఎస్టీకాలనీల్లో పర్యటించారు. ఆ సమయంలో ఫ్లోరైడ్‌తో బాధపడుతున్న కుటుంబాల దయనీయస్థితిని గమనించారు. చలించిపోయిన ఆయన మంచినీటి సరఫరా చేసేలా కృషి చేస్తానని వాగ్దానం చేశారు. ఇటీవల మార్కాపురం వచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కనిగిరి ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఫ్లోరైడ్ సమస్యను వివరించి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ మేరకు అమరావతి నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల నుంచి ప్రత్యేక బృందం ఇటీవల కమ్మవారిపల్లి, పునుగోడు గ్రామాల్లో పర్యటించింది. నీటి నమూనాలు సేకరించి అందులో ఫ్లోరైడ్ శాతాన్ని గుర్తించాయి. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబును కూడ ఇటీవల ఎమ్మెల్యే ఉగ్ర కలిసి ఫ్లోరైడ్ సమస్యను వివరించారు. సానుకూలంగా స్పందించిన సీఎం ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. దీంతో కనిగిరి ప్రాంతంతోపాటు కమ్మవారిపల్లి, పునుగోడు కాలనీ వాసులకు ఫ్లోరైడ్ నుంచి విముక్తి కలుగుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.



పునుగోడులో ఫ్లోరైడ్ బాధితులను పరిశీలించిన ఎమ్మెల్యే, రాష్ట్ర స్థాయి బృందం(ఫైల్)

పునుగోడు ఎస్టీకాలనీ వాసుల పరిస్థితి దయనీయం

మండలంలోని పునుగోడు గ్రామంలోని ఎస్టీకాలనీ అంటే ఓ వైపు విసిరేసినట్లుగా కొండ దిగువనే ఉంటుంది. 40ఏళ్ల క్రితం కొన్ని కుటుంబాల వారు కొండలో కట్టెలు కొట్టుకుని జీవిస్తూ అక్కడ దిగువనే గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తూ వచ్చారు. ఆ కాలనీలో 63 గృహాలు ఉండగా, 256 మంది జీవిస్తున్నారు. వారిలో చిన్నపిల్లలు 40మందికి పైగా ఉన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మంచినీటి సరఫరాకు చర్యలు చేపట్టారు. ఎస్టీ కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించారు. అప్పటి నుంచి సాగర్ నీటిని సరఫరా చేస్తున్నారు. కానీ వారం, పది రోజులకు కూడా ఆ ట్యాంకుకు నీరు రావడం లేదని ఎస్టీ కాలనీ వాసులు చెప్తున్నారు. దీంతో వంటకు, వాడకానికి బోరు నీటినే వినియోగించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ కాలనీలో కొంతమంది ఫ్లోరైడ్ బారినపడి కాళ్లు వంకర్లు తిరగడం, మోకాళ్లు ఒంగిపోవటం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇటీవల ఆ ప్రాంతంలో పర్యటించిన బృందం నీటి నమూనాలు సేకరించి ఫ్లోరైడ్ శాతం పరీక్షించగా 2.6 శాతం ఉన్నట్లు తేలింది.



కాళ్లు కూడా సహకరించడం లేదు

కోలా దానయ్య, కమ్మవారిపల్లె

ఈయన పేరు కోలా దానయ్య. కమ్మవారిపల్లెకు చెందిన ఈయన వయస్సు 55 సంవత్సరాలు. ఫ్లోరైడ్ బారినపడి మంచానికి పరిమితమయ్యారు. దీంతో ఆ కుటుంబం పరిస్థితి దయనీయంగా మారింది. ఇద్దరు కుమారులు పరాయి రాష్ట్రాల్లో కూలి పనులకు వెళ్లి జీవిస్తున్నారు. వారు ఆయనకు పంపించే డబ్బులే ఆధారం. కాళ్లు కూడా సహకరించని స్థితిలో ఉన్న తనకు భార్యే అన్నీ తానై సేవచేసే పరిస్థితి ఏర్పడిందని ఆయన కన్నీటి పర్యంతమయ్యారు.

తనతోపాటు కన్నబిడ్డ మంచానికే

బలసాని కాంతమ్మ, కమ్మవారిపల్లె

ఈమె పేరు బలసాని కాంతమ్మ. వయస్సు 62 ఏళ్లు. ఫ్లోరైడ్ కారణంగా మోకాళ్లు ఒంగిపోయి నడవలేని స్థితిలో ఉంది. తన కుమారుడు కూడా 50 ఏళ్లకే మంచంలో ఉన్నాడని ఆవేదన వెలిబుచ్చింది. మాకు సరిపడిన మేరకు మంచినీటిని సరఫరా చేస్తే భవిష్యత్ తరాల పిల్లలైనా ఫ్లోరైడ్ బారినపడకుండా ఉంటారని కోరుతోంది. లేదంటే ఎప్పటిలానే జీవితాంతం అగచాట్లు పడాల్సిందే.

10 కిలోల బరువు కూడా ఎత్తలేను

సామ్యేలు, కమ్మవారిపల్లె ఎస్సీ కాలనీ

కమ్మవారిపల్లెకు చెందిన ఈయన పేరు సామ్యేలు. వయస్సు 41 ఏళ్లు. ఫ్లోరైడ్‌తో ఆయన మోకాళ్లు ఒంగిపోయాయి. కొద్ది బరువు కూడా ఎత్తలేరు. పళ్లు కూడా గారపట్టి ఊడిపోతున్నాయని ఆయన చెప్పారు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నానని, నడుముల నొప్పి కారణంగా ఎక్కు ట్రిప్పులు తిరగేలకపోతున్నానని వాపోయారు. మంచి నీరు వచ్చే మంచి రోజుల కోసం ఎదురు చూస్తున్నానని చెమర్చిన కళ్లతో ఆశాభావం వ్యక్తం చేశాడు.

ఇంటర్మీడియెట్ పరీక్షల అధికారిగా సైమన్‌విక్టర్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్ఐవో సైమన్ విక్టర్

ఒంగోలు విద్య, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ విద్యా బోర్డు పరీక్షల నియంత్రణ అధికారి(కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్)గా ఎ.సైమన్ విక్టర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పరీక్షల నియంత్రణ అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన సుబ్బారావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. వరుసగా రెండోసారి ఈ పోస్టుకు ప్రకాశం జిల్లావాసి నియమితులు కావడం గర్వకారణం. సైమన్ విక్టర్ కంభం ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ఇప్పటి వరకు ఇంటర్మీడియేట్ బోర్డు ఆర్ఐవోగా పనిచేశారు, ప్రస్తుతం ఇంటర్ పరీక్షల నియంత్రణ అధికారిగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన విక్టర్‌ను పలువురు అభినందించారు.

44 మందికి పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు


ఒంగోలు విద్య, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన స్పాట్ అడ్మిషన్లలో 44 సీట్లు భర్తీ అయినట్లు ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. పాలిసెట్-25 కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు మంగళవారం ఈ స్పాట్‌అడ్మిషన్లు నిర్వహించారు. ఆటో మొబైల్ ట్రేడ్‌లో 11,సివిల్‌లో 12,ఎలక్ట్రికల్‌లో 2, మెకానికల్‌లో 19 కలిపి 44 సీట్లు భర్తీ అయినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

ఉత్తమ అవార్డుల ఎంపికకు కొత్త విధానం

- 30 రకాల దరఖాస్తులు
- పరిగణనలోకి 17 అంశాలు
- 21నుంచి 23 వరకు ఇంటర్వ్యూలు

ఒంగోలు విద్య, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని సెప్టెంబరు 5న దేశ వ్యాప్తంగా గురుపూజోత్సవాన్ని ఓ పండుగగా జరుపుకుంటాం. ఈ సందర్భంగా గురువులను సన్మానించుకుంటాం. ఉపాధ్యాయులుగా విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న వారిని జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి పురస్కారాల ఎంపికకు సంబంధించి ఇప్పటి వరకు ఉన్న విధానాన్ని మార్చి కొత్త విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందుకు సంబంధించి 100 పాయింట్లకు 17 అంశాలను పరిగణనలోకి తీసుకోనున్నారు. అంతేగాక ఇంటర్వ్యూలను ప్రవేశపెట్టారు.

మూడు రకాల దరఖాస్తులు



- ఉపాధ్యాయులుగా పదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులు. సాధించిన విజయాలు, నూతనావిష్కరణలో విద్యార్థుల ప్రగతి, సమాజంలో, పాఠశాల ప్రగతికి చేసిన కృషిని వివరిస్తూ తగు ఆధారాలతో స్వయంగా దరఖాస్తు చేసుకోవాలి.
- రెండో అంశంగా కొంతమంది టీచర్లు వెలకట్టలేని సేవలు అందిస్తున్నా అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోరు. పొగడ్తలు, గొప్పలు చెప్పుకోవడం ఇష్టం ఉండదు. అటువంటి టీచర్లను గుర్తించి కనీసం ఐదుగురు తమ సహచర టీచరు గురించి దరఖాస్తు చేస్తే వాటిని పరిగణనలోకి తీసుకుంటారు.
- మూడో అంశంగా సమస్త సేవలను, లీప్ యాప్‌లోని అంశాలను పరిశీలించి ప్రభుత్వమే మంచి టీచర్లను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేయనుంది.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు టీచర్లను ఎంపిక చేయడంలో 100 పాయింట్లలో 17అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఈ పాయింట్లలో ఎక్కువ సాధించిన వారిని ఎంపిక చేస్తారు.

21నుంచి 23 వరకు ఇంటర్వ్యూలు

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికలో ఈ ఏడాది కొత్తగా ఇంటర్వ్యూలను ప్రవేశపెట్టారు. గత ఏడాది వరకు టీచర్లు తమ దరఖాస్తుల్లో చేసుకున్న అంశాలను మాత్రమే పరిశీలించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేసేవారు.

పాయింట్లు ఇలా...

ఉపాధ్యాయుల ఉన్నత విద్యార్హతలకు రెండుపాయింట్లు, సర్వీసుకు ఆరు పాయింట్లు, టీచర్ సబ్జెక్టులో ఉత్తీర్ణత శాతానికి పది, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘ కార్యకలాపాల్లో భాగస్వామ్యానికి రెండు, విద్యార్థిప్రమాణాల పెంపునకు చేసిన కృషికి ఐదు పాయింట్లు ఇలా ఆయా అంశాల వారీగా పాయింట్లను కేటాయించారు.

ప్రస్తుతం 100 ప్రతిభా పాయింట్లతోపాటు ఇంటర్వ్యూలో కూడా ప్రతిభ చూపిన వారినే రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేస్తారు. విద్యాడివిజన్, జిల్లాస్థాయిలో ఉత్తములుగా ఎంపికై రాష్ట్ర స్థాయికి పోయిన వారిని వారి ప్రతిభాపాఠవాలు ఆధారంగా అవార్డులకు ఎంపిక చేయనున్నారు. ఆసక్తి గత టీచర్లు ఈ అవార్డుల కోసం ఈనెల 8లోపు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది.

రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకుంటాం

తహసీల్దార్ రవిశంకర్



కంభం రోడ్డు మలుపు వద్ద వేసిన వెంచర్ నిర్వాహకులను విచారిస్తున్న తహసీల్దార్

కనిగిరి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వాగు ఆక్రమణలపై రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రవిశంకర్ చెప్పారు. 'వాగుల ఆక్రమణ' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఆర్డీవో, జిల్లా అధికారుల ఆదేశాలతో తహసీల్దార్ రవిశంకర్ చెక్‌పోస్టు వద్ద, కంభం రోడ్డు మలుపు వద్ద, జీపు స్టాండు వద్ద వెలుస్తున్న భారీ షాపింగ్ మాల్ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ గతంలో వాగులు, చెరువు అలుగుల ఆక్రమణలపై ప్రత్యేక సర్వే చేపట్టినట్లు చెప్పారు. ఈ సర్వేలో ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారించామన్నారు. కొన్నిచోట్ల ఆక్రమణదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. వారి నుంచి ఎలాంటి సమాధానాలు రాలేదన్నారు. మరోసారి నోటీసులు జారీచేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఆర్డీవో, జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఆక్రమణదారులు ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామన్నారు. కంభం రోడ్డు మలుపు వద్ద వేసిన వెంచర్ నిర్వాహకులకు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసినట్లు చెప్పారు. వారివద్ద ఉన్న పత్రాలు, రెవెన్యూ రికార్డులను పరిశీలించి ఆక్రమణ జరిగినట్లు తేలితే కేసు నమోదు చేస్తామన్నారు.

రేపు గోవాలో జరిగే ఓబీసీ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌రావు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : గోవాలో ఈనెల 7న జరిగే ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్‌రావు చెప్పారు. మంగళవారం గిద్దలూరు పట్టణంలో స్ప్రింగ్ బోర్డు పాఠశాల ఆవరణలో స్థానిక బీసీ నాయకులతో కలిసి హలో బీసీ చలో.. గోవా అంటూ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి బీసీల డిమాండ్ల సాధన కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందించడానికి గోవాలోని డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో పెద్ద ఎత్తున ఓబీసీ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు ప్రధాని నరేంద్రమోదీతోపాటు పలువురు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అఖిలపక్ష పార్టీల అధ్యక్షుడు, పలువురు జాతీయ స్థాయి నేతలు హాజరవుతున్నట్లు తెలిపారు. అలాగే జాతీయ స్థాయిలో జరుగు కులగణనపై వెంటనే మార్గదర్శకాలు విడుదల చేయాలని, జనగణనలో సమగ్ర కులగణన చట్టబద్ధతకై పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి చర్చించాలన్నారు. చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లను కల్పించాలని, మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించి అమలు చేయాలన్న అంశాలపై మహాసభలలో చర్చిస్తారన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఓబీసీ నాయకులు

కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి బాగుగున్నల శ్రీను, రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి జాడి శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

ట్రంక్ రోడ్ వ్యాపారుల కోసం

పాతమార్కెట్ వద్ద పనులు ప్రారంభం

● షాపుల సంఖ్యపై సందిగ్ధం

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని ట్రంక్‌రోడ్ విస్తరణకు చర్యలు వేగవంతం అయ్యాయి. ఈ మేరకు రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయేవారికి ప్రత్యామ్నాయంగా షాపులు కట్టించేందుకు అవసరమైన ఏర్పాట్లను కార్పొరేషన్ అధికారులు ప్రారంభించారు. ఈ మేరకు మంగళవారం పాతకూరగాయల మార్కెట్ వద్ద స్థలంలోని చెత్తను తొలగించి శుభ్రం చేసే పనులు చేపట్టారు. అయితే ఎన్ని షాపులు నిర్మిస్తారు. ఏ విధమైన డిజైన్‌తో నిర్మిస్తారనే విషయం స్పష్టత లేదు. 100 అడుగులు విస్తరిస్తే 123 మందికి షాపులు నిర్మించాల్సి ఉండగా, 90 అడుగులు విస్తరిస్తే సుమారుగా 105 షాపులు, 80 అడుగులు అయితే 72 షాపులు కోల్పోయే అవకాశం ఉండటంతో ఎన్ని అడుగులు విస్తరించాలనే విషయంపై చర్చలు జరుగుతున్నాయి. అయితే తుది నిర్ణయం వచ్చే వరకు ప్రాథమికంగా వారికి పాత మార్కెట్‌లో షాపుల నిర్మాణం, అలాగే 1:4 నిష్పత్తిలో టీడీఆర్ బాండ్‌లు ఇవ్వనున్నారు.


పాతమార్కెట్‌లో చెత్తను తొలగిస్తున్న ఎక్స్‌వేటర్

క్విస్‌లో డ్రోన్ టెక్నాలజీపై ఇంటర్న్‌షిప్


మాట్లాడుతున్న సూర్యకల్యాణచక్రవర్తి

ఒంగోలు విద్య, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో డ్రోన్ టెక్నాలజీపై ఇంటర్న్‌షిప్‌ను మంగళవారం ప్రారంభించారు. మేఘాలయ షిల్లాంగ్‌లోని నార్త్‌ఈస్ట్ సెంటర్ ఫర్ టెక్నాలజీ అండ్ గ్రిడ్(సెక్టార్), క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలు సంయుక్తంగా ఈ ఇంటర్న్‌షిప్‌ను నిర్వహిస్తున్నాయి. డ్రోన్ పనితీరు, డ్రోన్ అసెంబుల్ తదితర అంశాలపై విద్యార్థులకు వివరిస్తారు. ఈ సందర్భంగా క్విస్ విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులు డ్రోన్ టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలన్నారు. సెక్టార్ డైరెక్టర్ జనరల్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీ రోజురోజుకు అభివృద్ధి చెందుతుందని, రానున్న రోజుల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి, ప్రిన్సిపాల్ వి.హనుమంతరావు, సుబ్బారావు, భార్గవ, డీన్‌లు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-1లో రైతుల నిరసన

ఒంగోలు(రూరల్), ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలంకేంద్రం-1లో లోగ్రేడ్ పొగాకును వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో మంగళవారం రైతులు వేలాన్ని నిలుపుదల చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పొగాకు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె.జయంతిబాబు మాట్లాడుతూ వర్జీనియా పొగాకు కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించి రైతులు నష్టపోకుండా కాపాడాలని డిమాండ్ చేశారు. కాగా వేలం కేంద్రానికి చీమకుర్తి మండలంలోని మంచికలపాడు, కేవీపాలెం, గోనుగుంట, జీఎల్‌పురం, టి.గుడిపాడు, బండ్లమూడి గ్రామాల రైతులు బేళ్లను తీసుకువచ్చారు. అయితే లోగ్రేడ్ పొగాకును వ్యాపారులు నోబిడ్ చేశారు. ఈ రైతులు ఇప్పటికే నాలుగుసార్లు బేళ్లను ఇంటికి, బోర్డుకి తిప్పారు. ఇలాంటి పరిస్థితి మంచిది కాదంటూ వేలం నిర్వహణాధికారితో అన్నారు. సమాచారం అందుకున్న ఆర్‌ఎం వేలంకేంద్రం వద్దకు వచ్చారు. వ్యాపారులతో మాట్లాడారు. కొంతమేరకు నోబిడ్‌లు తగ్గింది. కార్యక్రమంలో కార్యదర్శి పమిడి వెంకట్రావు పాల్గొన్నారు

ఆర్టీసీ ఆస్తుల లీజు జీవోను రద్దు చేయాలి

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆస్తుల లీజును రద్దు చేయాలని ఏపీ పీటీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ విజయవాడలోని గవర్నర్‌పేటలోగల ఆర్టీసీ స్థలం 4.15 ఎకరాలను లులూ షాపింగ్‌మాల్‌కు 99 సంవత్సరాల లీజుకు కేటాయించడం అన్యాయంగా ఉందన్నారు. ఈ స్థలం లీజుకు కేటాయిస్తూ ఇచ్చిన జీవో నెం. 137ను రద్దు చేయకుంటే ఆందోళనకు సిద్ధం అవుతామని తెలిపారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర జోన్ వైస్ ప్రెసిడెంట్ కె.నాగేశ్వరరావు, జోనల్ అధ్యక్షుడు వాకా రమేష్, జిల్లా అధ్యక్షుడు పి. వెంకటేశ్వరరెడ్డి, నాయకులు తిరుమలేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ పాలకవర్గ ప్రమాణస్వీకారం

సంతనూతలపాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని త్రిపురాంతకస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాల పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఎండోమెంట్ ఏవో నారాయణరెడ్డి ఆధ్వర్యంలో చెన్నకేశవస్వామి ఆలయ చైర్మన్‌గా దుంపా సుబ్బారెడ్డి, త్రిపురాంతకస్వామి ఆలయ చైర్మన్‌గా శిఖాకొల్లి ఉమామహేశ్వరస్వామి, ఇతర పాలకవర్గసభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పాలకవర్గసభ్యులు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ప్రధానకార్యదర్శి రావులపల్లి వెంకటసురేష్‌బాబు, నీటిసంఘం అధ్యక్షురాలు మన్నం రంగనాయకమ్మ, నాయకులు ఆర్.అంకారావు, టి.శ్రీనివాసరావు, నాయకులు డి.యలమందారెడ్డి, ఎం.ఫణీంద్ర, నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి స్వామి


మంత్రిస్వామికి వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి డాక్టర్ స్వామి పేర్కొన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావు ఆధ్వర్యంలో జర్నలిస్టులు మంగళవారం తూర్పు నాయుడుపాలెంలో మంత్రి స్వామికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐవీ.సుబ్బారావు మాట్లాడుతూ జర్నలిస్టుల అక్రిడిటేషన్ల విషయంలో గత ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రంలో అనేక మందికి అక్రిడిటేషన్లు లేవని, అందువల్ల కొత్తగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులకు హెల్త్ ఇన్సూరెన్స్‌తో పాటు ఇంటి స్థలాలు, ఇతర సమస్యలను వివరించారు. అనంతరం మంత్రి స్వామి మాట్లాడుతూ ఇప్పటికే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ


సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించిన అతిథులు, టీచర్లు

సంతనూతలపాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పి.గుడిపాడులో ఎంపీయూపీ స్కూల్‌లో మంగళవారం సరస్వతీదేవి విగ్రహావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన టీడీపీ మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబు విగ్రహ ఏర్పాటు దాతలు ఎస్‌ఎంసీ చైర్మన్ కాజా అంజలి, పరశురామిరెడ్డిలు తమ కుమారుడు రేణుకే శొరెడ్డి జన్మదినం సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేయించడంపై అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ సెక్రటరీ అడకా స్వాములు, ఎంఈవో వెంకారెడ్డి, హెచ్‌ఎం తిరుపతిస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ, కూటమి ప్రభుత్వాలు దొందూదొందే !

● లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధినేత విజయ్‌కుమార్

కొత్తపట్నం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుతం అధికారం చెలాయిస్తున్న కూటమి ప్రభుత్వం దొందూదొందేనని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్‌ఆర్‌కేఆర్.విజయకుమార్ ధ్వజమెత్తారు. మంగళవారం రాత్రి కొత్తపట్నంలో జరిగిన బహిరంగసభలో మాట్లాడుతూ పేదలను బిచ్చమెత్తుకునేలా ఈ రెండు ప్రభుత్వాలు పాలన కొనసాగించాయన్నారు. పేదరికం నుంచి శాశ్వతంగా బయటకు వచ్చే పథకాలను అమలు చేయకుండా ఉచితాల పేరుతో దగా చేస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా మన ఓట్లను మనమే వేసుకుందామని, అధికారం చేజిక్కించుకున్నప్పుడే ఆత్మగౌరవం దక్కుతుందని పేర్కొన్నారు. చిటితోటి శోభన్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దమ్ము వెంకటేష్, ఐశ్వర్య, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభల ప్రచార యాత్ర ప్రారంభం

● జిల్లాలో 16వ తేదీ వరకు నిర్వహణ


బస్సుయాత్రలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 20వతేదీ నుంచి జరగనున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని ఏపీ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార బస్సు యాత్రను మంగళవారం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్ వద్ద కళాకారుల ఆటాపాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఈశ్వరయ్య మాట్లాడుతూ ఒంగోలు నగరంలో తొలిసారిగా ఈనెల 20నుంచి 25వతేదీ వరకు రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వేలాది మంది కార్యకర్తలు, నాయకులు పాల్గొంటారన్నారు. ప్రకాశం జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ఏర్పడిన నాటి నుంచి అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నతీరుగా ఉందన్నారు. వెలిగొండప్రాజెక్టు ప్రారంభించి 29 ఏళ్ళు దాటుతున్నా ఇంత వరకు నిర్మాణం పూర్తి చేయకపోవడం సిగ్గుచేటన్నారు. నిమ్జ్, దొనకొండ పారిశ్రామిక కారిడార్ వంటి హామీలు అమలు కాక జిల్లాలో నిరుద్యోగం తాండవిస్తుందని, ఆయా అంశాలపై రాష్ట్ర మహాసభల్లో చర్చిస్తామని చెప్పారు. సీపీఐ వంద వసంతాల వేడుకల్లో భాగంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో వెయ్యిమంది కళాకారులతో వందగొంతుకలతో, వంద కళారూపాలతో ప్రజా కళా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ ప్రచారజాత మంగళవారం నుంచి జిల్లాలో 16వతేదీ వరకు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, ప్రతినిధులు రామకృష్ణ, పిచ్చయ్య, ఆరేటి రామారావు, నజీర్, అనంతలక్ష్మి, శ్రీను, బద్రి, ఆర్.వెంకట్రావు, నల్లూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలి

● రిమ్స్ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ భాస్కరి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ భాస్కరి

ఒంగోలు(రూరల్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి ముర్రుపాలు పట్టాలని, ఆ పాలతోనే శిశువు ఆరోగ్యంగా పెరుగుతుందని ఒంగోలు రిమ్స్ మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు పేర్కొన్నారు. ఒంగోలు నగరం వెంగముక్కపాలెంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని జరిగిన అవగాహన సదస్సులో ప్రొఫెసర్ జి.భాస్కరి మాట్లాడారు. తల్లిపాలతోనే పూర్తి స్థాయిలో బిడ్డకు పోషకాలు లభ్యమవుతాయన్నారు. వారిలో వ్యాధినిరోధక శక్తి పెరిగి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ ఉంటుందని, అందువల్ల తొలి ఆరు నెలలు వరకు తప్పక తల్లిపాలను మాత్రమే ఇవ్వాలని ఆమె కోరారు. తరువాత అనుబంధ ఆహారం ఇస్తున్నప్పటికి రెండేళ్లపాటు తల్లిపాలు ఇవ్వడం ద్వారా వారిలో తల్లీబిడ్డ ఎంతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. తల్లిపాలు ఇచ్చే పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీడీపీవో వై.అంజమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సహాయక ప్రొఫెసర్లు డాక్టర్ కె.రాధిక, వైద్యులు ప్రదీప్‌కుమార్, పి.స్పందన, దివ్య, సోషల్‌వర్కర్ రవిశంకర్, హెచ్‌ఈవో తాళ్లూరి వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ జి.రమ, ఏఎన్‌ఎం జి.ఝాన్సీ రాణి, అంగన్‌వాడీలు యు.కుమారి, డి.లీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు శ్రేష్ఠం

పొన్నలూరు: స్థానిక ఎస్సీ కాలనీలో మంగళవారం తల్లిపాల వారోత్సవం సందర్భంగా సీడీపీవో సుశీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్ఠమన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విక్టోరియా, సత్యవతి, మధురవాణి, గౌస్య బేగం, రమాదేవి, పోలమ్మ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలి

● ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్


ఒంగోలులోని విద్యుత్‌భవన్ వద్ద ధర్నా చేస్తున్న పలు సంఘాల నాయకులు

ఒంగోలు క్రైం, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ప్రజలకు భారంగా మారుతాయని, అందువల్ల వాటి ఏర్పాటును విరమించుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులోని విద్యుత్‌భవన్ వద్ద సీఐటీయూ నగర కార్యదర్శి టి.మహేష్, ఏఐఎఫ్‌టీయూ నాయకులు సాయిబాబా అధ్యక్షత ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రైవేటీకరణలో భాగంగా స్మార్ట్ విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం గత వైసీపీ ప్రభుత్వం విధానాలు అమలు చేయడం సమజసం కాదన్నారు. విద్యుత్ వినియోగదారులపై భారం మోపే విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు జీవీ.కొండారెడ్డి, డీవీ.స్వామి, ఆర్.మోహన్, చుండూరి రంగారావు, ఎస్కే.మాబు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, లలితకుమారి పాల్గొన్నారు.

మద్దిపాడు: విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, ట్రూఅప్ చార్జీలు పెంచవద్దని కోరుతూ మద్దిపాడులో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెనక్కి తీసుకోవాలన్నారు. అనంతరం విద్యుత్ శాఖ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు కాసిం, ఆదిలక్ష్మి, కనపర్తి సుబ్బారావు, కాకుమాను సుబ్బారావు, ఉబ్బా వెంకటేశ్వర్లు, వెంకట రామిరెడ్డి, బాబ్జి, కళ్యాణ్ పాల్గొన్నారు.

సంతనూతలపాడు: స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు అన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సంతనూతలపాడు బస్టాండ్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి షేక్.మస్తాన్, పెద్దబ్బాయ్, వెంకటేశ్వర్లు, భగత్‌సింగ్, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: విద్యుత్ స్మార్ట్ మీటర్లను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఉప్పుగుండూరులోని సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో మంగవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌స్టేసన్‌లో మండల కార్యదర్శి తూబాటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జి.బసవపున్నయ్య, రావెళ్ల వెంకట్రావు, కొమరగిరి రామాంజనేయులు, నలతోటి రామారావు, యు.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: స్మార్ట్‌మీటర్లు బిగించవద్దంటూ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం చీమకుర్తిలోని విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పల్లాపల్లి ఆంజనేయులు, చిన్నపరెడ్డి, పల్లాపల్లి ఆంజనేయులు, కంకణాల వెంకటేశ్వర్లు, రాంబాబు, కొండయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం: స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజలపై విద్యుత్ భారాలను మోపొద్దని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈతముక్కల సబ్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి స్వామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కంకణాల రమాదేవి, పట్టపు ప్రకాశం, పిల్లి కృష్ణ, యానాది, రామిరెడ్డి, లక్ష్మమ్మ, కట్టా కుమారి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలగా అమ్మనబ్రోలు హైస్కూల్

● జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు


మాట్లాడుతున్న హరిబాబు

నాగులుప్పలపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అమ్మనబ్రోలులోని సీఎస్‌ఆర్ జడ్పీ హైస్కూలును ఉత్తమ క్రీడా పాఠశాలగా అభివృద్ధి చేసుకుందామని జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు కోరారు. ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ సూచనలతో ఈదర ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక హైస్కూల్ ఆవరణలో జడ్పీ సీఈవో బి.చిరంజీవి, డీఈవో కిరణ్‌కుమార్, ఎస్‌ఎస్‌ఏ డీఈ ఆర్.జగన్‌మోహనరావు, ఎంఈవోలు రవి, రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు నల్లూరి బాబు, వీరాంజనేయులు, ఏపీవో రవి, హెచ్‌ఎం ఎం.సత్యవతిలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హైస్కూల్‌లో వాకింగ్‌ట్రాక్, వాటర్ హార్వెస్టింగ్ డ్రైనేజ్, గ్రీనరీ, మల్టీపర్పస్ హాల్, లైబ్రరీ, అథ్లెటిక్ ట్రాక్, ఆటల కోర్టు, ఓపెన్‌జిమ్, టాయిలెట్ రెనోవేషన్ తదితర వసతులను ఏర్పాటు చేసి మోడల్ క్రీడా పాఠశాలగా తీర్చిదిద్దేందుకు తీర్మానాలు చేశారు. అనంతరం డీఈవో ఉపాధ్యాయులతో సమీక్ష చేసి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. టెన్త్ విద్యార్థులతో ముచ్చటించారు.

తెలుగు మహిళా నేతకు పాముకాటు

మర్రిపూడి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నర్సారెడ్డి సతీమని మాజీ ఎంపీటీసీ సభ్యురాలు రమణమ్మ మంగళవారం ఉదయం పాముకాటుకు గురైంది. పశువులను మేపుకునేందకు గ్రామానికి ఉతరం వైపునకు వెళ్లింది. ఆ సమయంలో గడ్డిలో ఉన్న పామును చూడక తొక్కడంతో కాటువేసింది. గమనించిన రమణమ్మ కిలోమీటర్ దూరంలో వ్యవసాయ పనులు చేస్తున్న కూలీల వద్దకు పరిగెత్తింది. పాముకాటు వేసిన విషయాన్ని కూలీలకు తెలపడంతో ఆమెను హుటాహుటిన పొదిలి వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం ఆమెను ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారని నర్సారెడ్డి చెప్పారు.

గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికుడి మృతి

చీమకుర్తి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బూదవాడ ప్రాంతంలో ఉన్న గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలో జరిగిన సంఘటనలో ప్రమాదవశాత్తు గాయపడిన రాజస్థాన్ కార్మికుడు మంగళవారం మృతి చెందినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన షారుక్(26) అనే వలసకార్మికుడు బూదవాడ వద్ద ఉన్న లక్ష్మీశివసాయి గ్రానైట్ ఫ్యాక్టరీలో మెషిన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మెషిన్ రిపేర్‌లో భాగంగా బెల్టు సరిచేసే నిమిత్తం చెప్పులు వేసుకొని పైపుపైకి ఎక్కుతుండగా జారి కిందపడిపోవటంతో తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించగా వైద్యసేవలు పొందుతూ మృతి చెందినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయపడిన ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

నాగులుప్పలపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మోపెడ్ వాహనాన్ని కారు ఢీకొంది. దీంతో ఇరువురు గాయపడిన సంఘటన నిడమానూరు సమీపంలోని నాగులుప్పలపాడు-తిమ్మనపాలెం రోడ్డులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బి.నిడమానూరు గ్రామానికి చెందిన సోదరులైన సయ్యద్ ఖాదర్‌వలి, చిన్నమదార్ మంగళవారం ఉదయం తమ మోపెడ్‌పై తిమ్మనపాలెం వెళతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108వాహనంలో ఒంగోలుకు తరలించారు.

కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్, నాయకులు

మద్దిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని టీడీపీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మద్దిపాడులో ప్రజల చేతిలో ప్రభుత్వ కార్యక్రమం సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం యాప్ ద్వారా అందించే పౌరసేవను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి మందపల్లి శ్రీనివాసరావు, గడ్డం రవి, మద్ద ఆంజనేయులు, గంగిశెట్టి నరసింహారావు, షేక్ నూరుల్లాబాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ విద్య పెంపుపై మాగుంట ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లాలో పాఠశాలలు, కళాశాలల్లో కృత్రిమ విద్య, యంత్ర అభ్యసనం, సాంకేతిక నూతన ఆవిష్కరణ, శిక్షణ కార్యక్రమాలు, కోర్సులపై ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి జయంత్‌చౌదరి సమాధానం ఇస్తూ జాతీయ విద్యా విధానం ద్వారా నూతన ఆవిష్కరణ ప్రాముఖ్యతలను గుర్తించిందన్నారు. కృత్రిమ విద్య, డిజైన్‌రూపకల్పన, సమగ్ర ఆరోగ్యం, సేంద్రీయ జీవనం, పర్యావరణ విద్య, ప్రపంచ పౌరసత్వవిద్య తదితర అంశాలపై విద్యార్థుల్లో నైపుణ్య పెంపుదల చేయడం జరుగుతుందన్నారు. ప్రకాశం జిల్లాలో పదో తరగతిలో ఐదు పాఠశాలలు ఉండగా 12వతరగతిలో ఒక పాఠశాల ఉందని మాగుంటప్రశ్నకు కేంద్ర మంత్రి వివరణ ఇచ్చారు.

ఎస్‌ఎస్‌ఎన్‌లో వైద్యశిబిరం

ఒంగోలు విద్య, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మంగమూరురోడ్డులోని ఎస్‌ఎస్‌ఎన్ డిగ్రీ కళాశాలలో మంగళవారం మెగా నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల డైరెక్టర్ వై.సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడ్రన్ ఐ హాస్పటల్ చైర్మన్ డాక్టర్ ఎం.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కంటిచూపుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల కంటిచూపుపై దృష్టి పెట్టి వారికి ఎటువంటి ఇబ్బంది ఉన్నా వైద్యుల వద్దకు తీసుకెళ్లాలని కోరారు. డాక్టర్ అర్పణపాపవర్ ఆధ్వర్యంలో 600 మంది విద్యార్థులకు కంటిపరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న 98 మందిని గుర్తించి వారికి కళ్ళజోళ్లను సిఫార్సు చేశారు. కార్యక్రమంలో ఎం.నాగరాజు, టి.స్వర్ణలత, సురేందర్, టి.రాజేంద్రబాబు, పి.రవితేజ, నీలిమ, రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుక్కులను దున్నుకోవాలి : ఏవో

ఒంగోలు(రూరల్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మాగాణి సాగు చేసే రైతులు దుక్కులను దున్నుకోవాలని ఏవో కె.రమేష్‌బాబు అన్నారు. ఒంగోలు మండలంలోని ఉలిచి, చేజర్ల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి విత్తనాలు కావాల్సిన రైతులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలకు ఆత్మీయ వీడ్కోలు

మద్దిపాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన 15 మంది ఏఎన్‌ఎంలను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వైద్యులు వినీల చౌదరి, జగదీష్‌బాబు, అవినాష్ మాట్లాడుతూ పీహెచ్‌సీలో ఇంతకాలం వైద్య సేవలు అందిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారని, బదిలీపై వెళ్లిన చోట కూడా ఇదేవిధంగా పనిచేయాలని ఆకాంక్షించారు. నూతనంగా బదిలీపై వచ్చిన వారికి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్‌లు రజితకుమారి, లలితమ్మ, నాగరాజు, సీతమ్మ, బాలకోటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందిని సత్కరిస్తున్న వైద్యులు

జాడలేని వాన..!

» ముగుస్తున్న ఖరీఫ్ సీజన్
» ఆందోళనలో అన్నదాతలు
» పాడికి గ్రాసం కరువు
» భారమైన పశుపోషణ


మేత లేక బక్కచిక్కిన పశువులు

కంభం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జూన్, జూలై, ఆగస్టులో జోరు వానలతో కళకళలాడాల్సిన పశ్చిమ ప్రకాశంలో వరుణుడు ముఖం చాటివేయడంతో ఖరీఫ్ మీద ఆశ వదులుకుంటున్న రైతులు ఒక వైపు, పశుగ్రాసం కొరతతో ఆందోళన చెందుతున్న పశుపోషకులు మరో వైపు. పశువులకు గ్రాసం దొరకక రోజురోజుకు పశువుల సంఖ్య తగ్గే ప్రమాదం వస్తున్నది. పంటలు పండకపోయినా, సాగులో నష్టాలు చవిచూసినా రైతుకు ఆసరాగా ఉండే పశువులు కబేలాలకు తరలిపోయే పరిస్థితి వస్తున్నది. ఓ వైపు కరువు, మరో వైపు వర్షాభావ పరిస్థితులలో పశుపోషణ భారమైందని రైతులు, పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండుగడ్డిని కొనుగోలు చేసుకుని తెచ్చి జాగ్రత్తగా వినియోగిస్తున్నారు. ట్రాక్టర్ గడ్డి ధర రూ.15వేల నుంచి రూ.20వేలు పలుకుతున్నదని, పశుపోషణ భారంగా మారిందని రైతులు వాపోతున్నారు. గ్రాసం కొనలేని వారు మూగ జీవాలను సంతలో తోలుకానికి పెడుతున్నారు. పల్లెల్లో గత వైభవం కోల్పోయి గేదెలు, ఎద్దుల కొట్టాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. రైతులకు ఎద్దులు అవసరం ఉన్నా వేల రూపాయలు పెట్టి కొనుగోలు చేయలేక, చేసినా మేత కరువై విక్రయానికి సిద్ధపడుతున్నారు. పాడి పశువులకు పచ్చిమేత, తాగునీరు సైతం దొరికే పరిస్థితి లేదు. దీనితో పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతున్నది. పశువులకు సకాలంలో మేత, నీరు లేకపోవడంతో బక్క చిక్కి పోతున్నాయి. పశుదానా కొనలేక పశువులను బేస్తవారపేట, మార్కాపురం మార్కెట్‌యార్డులలో నిర్వహించే సంతకు, కబేలాలకు విక్రయిస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే పశుసంపద కనుమరుగయ్యే ప్రమాదం ఉందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ట్రాక్టర్లతో ఎండు గడ్డిని తెచ్చుకుంటున్న పశు పోషకులు

ఎంఈవో-1గా అశ్వనీకుమార్


ఎంఈవోగా నియామకపత్రాన్ని అందుకుంటున్న అశ్వనీకుమార్

గిద్దలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు మండల ఇన్‌చార్జి ఎంఈవో-1గా ఎన్.అశ్వనీకుమార్ నియమితులయ్యారు. తురిమెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న అశ్వనీకుమార్‌ను గిద్దలూరు మండల ఇన్‌చార్జి ఎంఈవో-1గా ఆర్‌జెడి నియమించడంతో ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి నియామక పత్రం అందుకున్నారు.

రేపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన

గిద్దలూరు టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు ఈనెల 7వ తేదీన వస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు భవనాశి వెంకటరామాంజనేయులు ఒక ప్రకటలో తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా జనరల్ సెక్రటరీ డాక్టర్ జేవీ నారాయణ పిలుపు మేరకు నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షుడు, పార్టీలో వివిధ హోదాలలో ఉండే వారు ఒంగోలులో జరిగే ర్యాలీ, సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు భాస్కర్

పొదిలి పట్టణ ప్రజలకు ఊరట

» కందుల చొరవతో తగ్గిన కొళాయి దరావత్తు
» హర్షం వ్యక్తం చేసిన టీడీపీ నాయకులు

పొదిలి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి కొళాయిల దరావత్తు రుసుం పెనుభారంగా మారిన నేపథ్యంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చొరవతో ప్రజలకు ఊరట లభించింది. గత వైసీపీ పాలనలో కొళాయి కనెక్షన్‌ల క్రమబద్ధీకరణకు రూ.10,500 ధరవతు చెల్లించాలని నగరపంచాయతీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత నగరపంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి రూ.10,500 చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలన్నారు. అంత పెద్దమొత్తంలో డిపాజిట్ చెల్లించలేమని ప్రజలు అధికారులకు మొరపెట్టుకున్నారు. డిపాజిట్ డబ్బు చెల్లించేందుకు ఎవరు ముందుకు రాలేదు. దీంతో అక్రమ కొళాయిలను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి సమస్యను ఎమ్మెల్యే కందుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ కమిషనర్‌తో మాట్లాడారు. డిపాజిట్‌ను తొలగించాలని ఆయన సూచంచగా పూర్తిగా తీసివేయడం కుదరదని కమిషనర్ చెప్పారు. దాంతో రూ.6500 చెల్లించేలా అధికారులను ఒప్పించారు. దీంతో ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఇమాంసాహెబ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మీగడ ఓబులరెడ్డి, ముస్లిం మైనారిటీ నాయకులు రసూల్, రైతుసంఘ నాయకులు యలమంద, నాయకులు కాటూరి శ్రీనివాసులు, జ్యోతి మల్లి, యాసిన్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

అరటి సాగులో శిక్షణ


అరటి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

గిద్దలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన రైతులకు అరటి సాగులో సస్యరక్షణ పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆత్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్‌గా వచ్చిన సీవీ విజయభాస్కర్ మాట్లాడుతూ అరటిలో ముఖ్యంగా సిగటోకా ఆకు మచ్చ తెగులు ఎక్కువగా విస్తరిస్తున్నదని అన్నారు. ఆకుపై చిన్న పసుపు రంగు మచ్చ ఏర్పడి పెద్దదిగా మారి బూడిద రంగులోకి మారితే ఈ తెగులు వచ్చినట్లు గుర్తుపట్టాలన్నారు. తగిన మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడాలని, కలుపు లేకుండా, నీరు నిలువ లేకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. ఉద్యాన అధికారి శ్వేత మాట్లాడుతూ అరటిపండు పరిమాణం, నాణ్యత పెరిగేలా గెలలో ఆఖరిహస్తం విచ్చుకున్న 5వ రోజు, 15వ రోజు సల్ఫేట్ ఆఫ్ పొటాష్ పిచికారీ చేయాలని సూచించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : అదనపు చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ అన్నారు. సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం నాయకులు బాలనాగయ్య మాట్లాడుతూ.. పేదల జేబులకు చిల్లు పెట్టే స్మార్ట్ మీటర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రూబెన్, సుబ్బరాయుడు, హరికృష్ణ, సలాంఖాన్, ఏడుకొండలు, ప్రసాద్, మల్లికార్జున పాల్గొన్నారు.

పత్తి పైరును నాశనం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

కంభం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : అర్ధవీడు మండలం గన్నేపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీ ఈశ్వరమ్మకు చెందిన పత్తి పొలంలో కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందును పిచికారీ చేయడంతో పైరు కొంతమేర దెబ్బతిన్నది. బాధితురాలు మాట్లాడుతూ 1.25 ఎకరాల్లో తాను పత్తిని వేశానని, పంట చేతికి వచ్చే సమయానికి గుర్తు తెలియని వ్యక్తులు గడ్డిమందు జల్లడంతో ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమేరకు తాను పోలీసులకు ఫిర్యాదు చేశానని, విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని ఈశ్వరమ్మ కోరుతున్నది.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

గిద్దలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : స్త్రీశక్తి పథకం కింద రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తున్న దృష్ట్యా ఆటో కార్మికులను ఆదుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య అన్నారు. స్థానిక నరవ రోడ్డులో గల ఆటో స్టాండ్ ఆవరణలో పట్టణ ఆటో వర్కర్స్ యూనియన్ సదస్సు నిర్వహించారు. సీఐటీయూ నాయకులు ఆవులయ్య మాట్లాడుతూ వాహన మిత్ర పథకం కింద రూ.15వేలు ఇవ్వాలని, ట్యాక్స్‌లు, ఇన్సూరెన్స్‌లు, జరిమానాలు తగ్గించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12వ తేదిన గిద్దలూరు రెవిన్యూ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో ఆటో కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, హుస్సేన్, బాలగురువయ్య, రఫీ, పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌ను కాపాడాలి

ప్రభుత్వాన్ని కోరిన పురపెద్దలు

పెద్దదోర్నాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఎంతో ప్రాముఖ్యత కలిగిన దోర్నాల ఆర్టీసీ బస్టాండును కాపాడాలని పురపెద్దలు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక నటరాజ్ కూడలిలో మంళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మండల అధ్యక్షుడు వేదాంతం ప్రభాకర్ రావు మాట్లాడుతూ కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఆస్తిపై మండల తహసీల్దార్ చొరవతో రెవెన్యూ అధికారులు కొలతలు వేయడం అన్యాయమన్నారు. దిగువ శ్రీశైలంగా పేర్కొన్న దోర్నాల కేంద్ర బిందువుగా నటరాజ్ కూడలిలో 70 ఏండ్లుగా ఆర్‌అండ్‌బీ ఆధీనంలోని స్థలంలో కొంత భాగం 43సెంట్లు ప్రజా ప్రయోజనార్థం ఆర్టీసీకి బదలాయింపు జరిగింది. బస్టాండు నిర్మాణానికి నిధులు కూడా మంజూరయ్యాయి. అయితే పట్టణానికి చెందిన కొందరు తమ పూర్వికులదంటూ కోర్టును ఆశ్రయించారని, నిర్మాణం పనులు నిలిచి పోయాయన్నారు. అయినా బస్సులు నేటికీ ఇక్కడ నిలపడం, తాత్కాలికంగా రవాణా సర్వీసులు నిర్వహిస్తున్న క్రమంలో మళ్లీ రెవెన్యూ అధికారులు కొలతలు వేయడం ఏమిటని ప్రశ్నించారు.తిరిగి కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రభుత్వం స్పందించి ప్రజాప్రయోజనం కోసం ఆర్టీసీ బస్టాండును నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో యక్కంటి మల్లారెడ్డి, ముత్తులూరి శివ శంకరాచారి, కోటిరెడ్డి, కాశిరెడ్డి పాల్గొన్నారు.


బస్టాండులో కొలతల పరిశీలనకు వచ్చిన అధికారులు


రాచర్ల కేంద్రంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంతకుమారి

ముర్రుపాలతో బిడ్డకు ఆరోగ్యం

పెద్దారవీడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ముర్రుపాలు బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. జనరల్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా లక్ష్మీదేవి, అంజమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి తల్లీ బిడ్డ పుట్టిన గంటలోపు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలన్నారు. ఆరునెలల వరకూ తల్లిపాలు పట్టించాలన్నారు. ప్రతి తల్లీ ఆకుకూరలు, గుడ్లు, పాలు వంటి పౌష్టికాహారాలు తీసుకొని తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు దుర్గారాణి, సావిత్రి, వీర నారాయణమ్మ, నాగమ్మ, పాల్గొన్నారు.

బేస్తవారపేట : బేస్తవారపేట అంగన్‌వాడీ కేంద్రాలలో మంగవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆశా కార్యక్రమానికి సూపర్‌వైజర్ పి.సలోమి పాల్గొని తల్లులకు వివరించారు. కార్యక్రమంలో కార్యకర్తలు వై.పద్మావతి, యూ పుల్లమ్మ, టి.విజయలత పాల్గొన్నారు.

రాచర్ల : తల్లిపాలు బిడ్డ ఎదుగుదలకు ఉపయోగపడతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంతకుమారి అన్నారు. తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన రాచర్ల 1,3,4 కేంద్రాలలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాలు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, రమణమ్మ, ఖాశింబి, హెల్పర్లు పాల్గొన్నారు.

ఆశాలు ప్రజలతో మమేకం కావాలి

బేస్తవారపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఆశా కార్యకర్తలు గ్రామాల్లోని ప్రజలతో పరిచయాలు పెంచుకొని వారితో మమేకం కావాలని జిల్లా అధికారి శ్రీవాణి అన్నారు. మంగళవారం బేస్తవారపేటలో జరిగిన ఆశాడే కార్యక్రమం వైద్యాధికారి టి.కావన అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీవాణి ఆశా కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలతో సత్సంబంధాలు ఉన్నప్పుడే గ్రామంలోని ఆరోగ్య సమస్యలపై అవగాహన ఉంటుందన్నారు. టీబీ ముక్త్ అభియాన్ గురించి వల్ నంబుల్ వ్యాధుల గురించి వివరించారు. కార్యక్రమంలో పి.రాజేవ్వరీ, సీహెచ్‌వో జలపాటి తులసి ప్రసాద్‌రావు, వి.రాధకృష్ణ పూసలపాడు, మోక్షగుండం, బేస్తవారపేట వైద్య సిబ్బంది. ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీఐపై అవగాహన

గిద్దలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టంపై మండలపరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సమాచారం కోరిన వ్యక్తుల దరఖాస్తులపై తీసుకోవలసిన చర్యలు, ఎటువంటి సమాచారాన్ని అర్జీదారులు అడగవచ్చో, అడగకూడదో, సమాచారాన్ని ఎన్ని రోజుల్లోపల ఇవ్వవలెనో, సమాచారంపై సంతృప్తి చెందని యెడల అప్పీల్‌కు వెళ్ళు సందర్భాలు తదితర విషయాలపై అవగాహన సదస్సులో అధికారులు వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో డీవీ రమణరెడ్డి, ఉప మండలపరిషత్ అభివృద్ధి అధికారి రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాట్సాప్‌లో ఏపీకే యాప్‌ను తెరవొద్దు

సైబర్ క్రైంలో రూ.14లక్షలు నష్టపోయిన వైపాలెం వాసి


మాట్లాడుతున్న సీఐ ప్రభాకరరావు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్‌లో వచ్చే ఏపీకే యాప్‌ను తెరవ వద్దని, సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ సీహెచ్ ప్రభాకరరావు మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఏపీకే లింక్స్, పీఎం కిసాన్, యస్‌బీఐ లైఫ్, యోనో బ్యాంక్ యాప్‌లను ఓపెన్ చేసి సైబర్ నేరాలకు పాల్పడే వ్యక్తుల చేతిలో బందీలు కావద్దని సీఐ ఎర్రగొండపాలెం సర్కిల్ పరిధిలో ఉన్న మండలాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఫేస్ బుక్‌ద్వారా మీ సెల్ హ్యాక్ అవుతుందని తెలిపారు. అత్యాశకు పోయి సెల్‌ఫోన్ వాట్సాప్‌లో వచ్చిన యాప్ లింక్‌లు ఓపెన్ చేయొద్దని తెలిపారు. ఎర్రగొండపాలేనికి చెందిన వ్యక్తి తెలంగాణ రాష్ట్రంలో పనులకు వెళ్లి యాప్‌ను ఓన్‌చేసిన రూ.14లక్షలు పోగొట్టుకున్నారని తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సచివాలయ పోలీసుల ద్వారా కరపత్రాలను పంపిణీ చేయిస్తున్నట్లు సీఐ తెలిపారు. గంజాయి తాగినా, విక్రయించినా శిక్ష తప్పదని సీఐ హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ ఐపీ చౌడయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభఉత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మార్కాపురం తాలుకా అధ్యక్షుడు కొల్లి చెంచిరెడ్డి అన్నారు. ఉద్యోగులారా రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమం ఆర్ అండ్‌బీ కార్యాలయంలో మం గళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోటి ఉద్యోగులలో చర్చలలో భా గంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు రావాల్సిన డీఏ, పీఆర్‌సీ మొదలైన ఆర్థిక ప్రయోజనాలు, వివిధ శాఖలలో జరిగిన బదిలీలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రమణారెడ్డి, వెంకటేశ్వర రావు, గుడేసాహెబ్, కోమలి, శేఖర్ పాల్గొన్నారు.

టీ తాగుతూ మాట్లాడుకుందాం

గిద్దలూరు : రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు వైపీ రంగయ్య మాట్లాడుతూ ఉద్యోగుల భవిష్యత్ కోసం, హక్కులే లక్ష్యంగా పోరాటం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులకు బకాయిగా ఉన్న రూ.30వేల కోట్లు విడుదల, పీఆర్సీ, ఐఆర్, డీఏ, సరెండర్ లీవ్‌ల సాధన దిశగా ఉద్యోగులను చైతన్యపరిచేందుకు ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ 9 నెలల బకాయిలు సచివాలయ ఉద్యోగులకు ఇంతవరకు ఇవ్వలేదన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సహాధ్యక్షులు విజయ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటరామయ్య, నారాయణ, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

కంభం : ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లకు బకాయిలు చెల్లించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కంభం తాలూకా అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై మండల పరిషత్ కార్యాలయంలో టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమంలో పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో కంభం ఎపిజిఇఎ యూనియన్ నాయకులు రంగస్వామిరెడ్డి, రం గయ్య, కృపాకర్, వెంకటేశ్వర్లు, రవీంద్ర, వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులు ఒప్పందపత్రాలు తీసుకోవాలి

ఏడీ బాలాజీనాయక్


మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏడీ బాలాజీ నాయక్

పెద్దారవీడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్‌లో మొక్కజొన్న విత్తనాలు ఉత్పత్తి చేసే ప్రతి రైతు కంపెనీలతో ఒప్పందం చేసుకొని అగ్రిమెంట్ కాపీలను తీసుకోవాలని ఏడీ డి.బాలాజీ నాయక్ అన్నారు. మండలంలోని బి.చెర్లోపల్లిలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 250 ఎకరాల్లో పలు కంపెనీల మొక్కజొన్న విత్తనోత్పత్తి కోసం నాటారన్నారు. ఆయా రైతులంతా అగ్రిమెంటు కాపీలు తీసుకొని భద్రపర్చుకోవాలన్నారు. లేనిచో భవిష్యత్‌లో వచ్చే పరిణామాలకు వారే పూర్తి బాధ్యత వహించాలన్నారు. తక్కువ కాలంలోనే ఎక్కువ దిగుబడి, ఎక్కువ ధర ఇస్తామని చెప్పే నోటిమాటలు నమ్మవద్దన్నారు. కంపెనీవారు ఇచ్చే పురుగుమందుల విషయంలో ఏమైనా అనుమానం ఉంటే వ్యవసాయాధికారికి రాత పూర్వకంగా తెలియ జేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో ఎస్.లక్ష్మీనారాయణ, ఏఈవో సునీల్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ

గిద్దలూరు : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటలలో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని దిగువమెట్ట తాండా, కేఎస్‌పల్లి గ్రామాల్లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఏ శైలజరాణి పాల్గొని మాట్లాడుతూ జీవన ఎరువుల ప్రాముఖ్యత వివరించారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యం, ఆముదం, కంది, మొక్కజొన్న, మిరప పంటలో విత్తనం వేసే దగ్గరి నుంచి పంట కోత వరకు చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. వ్యవసాయాధికారి ఎం.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంటలను బీమా చేసుకునేందుకు ఈనెల 14వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు వెంకటేష్, కిరణ్మయి పాల్గొన్నారు.

14లోపు ప్రీమియం చెల్లించాలి

కంభం : ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంటల బీమా చెల్లిచేందుకు 14వ తేదీ వరకు పొడిగించినట్లు వ్యవసాయాధికారి షేక్ మహమ్మద్ మంగళవారం రైతులకు తెలిపారు. కంభం మండలంలోని తురిమెళ్ల, మదారుపల్లి గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. రైతులు వీఆర్వోలను సంప్రదించి వీసీఆర్‌సీ కార్డులు పొందాలని వివరించారు. పెసర పంటను పరిశీలించి పురుగు నివారణకు ట్రైజోఫోస్ 500 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేసుకోవాలని తెలిపారు.

విత్తన శుద్ధితో తెగుళ్లు దూరం

మార్కాపురం రూరల్ : విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా పంటలకు తెగుళ్లు దూరమవుతాయని వ్యవసాయాదికారి బుజ్జిబాయి తెలిపారు. మండలంలోని గజ్జలకొండ గ్రామ రైతు సేవా కేంద్రంలో పప్పు ధాన్యాల విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పెసర, కంది, మినుము, శనగ విత్తన శుద్ధికి కేజీ 10 గ్రాముల ట్రైకోడెర్మా కలపాలని తెలిపారు. ట్రైకోడెర్మాను పశువుల ఎరువు, వేప చెక్కతో కలిపి భూమిలో కలపడం వలన చీడ పీడలను నివారించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ టెక్నాలజి మేనేజర్ వాణి, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొదిలి : ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో భాగంగా 2025 క్రాప్ ఇన్సూరెన్స్ గడువును 14వతేదీ వరకుకు పొడగించినట్లు వ్యవసాయాధికారి డీ శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. కనుక ఇన్సూరెన్స్ చెల్లించే రైతులు గడువు లోగా చెల్లించాలని ఆయన కోరారు

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కొలుకుల, గొళ్ళవిడిపి గ్రామాలలో మంగళవారం ఏఓ కె నీరజ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాలలో సాగు చేసిన పత్తి, మొక్క జొన్న, మిరప, మినుము తదితర పంటలను ఆమె పరిశీలించారు. ఆనంతరం రైతులు సాగు చేసి ఆయా పంటలలో అవసరమైన పలు ఆంశాలను వివరించారు. ముందుగా ఆయా పంటలను ఈ క్రాప్ చేయించారు. కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ తప్పనిసరి

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలో సాగు చేసిన ప్రతి రైతు ఈ-క్రాప్ తప్పనిసరిగా చేసుకోవాలని ఎర్రగొండపాలెం తహసీల్దారు డీ మంజూనాథరెడ్డి అన్నారు. మంగళవారం మండంలోని కాశికుంట తాండాలోని రైతులతో ఈ-క్రాప్‌పై అవగాహన, పంటల పరిశీలిన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు లబ్ధి పొందాలంటే సాగు చేసిన పంటలను రెవెన్యూ వ్యవసాయ శాఖ సిబ్బందితో ఈ క్రాప్ చేయించాలని సూచించారు. ఈ-క్రాప్ చేయిస్తేనే ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు వర్తింపు అవుతందని రైతులకు వివరించారు. ఆనంతరం వ్యవసాయ శాఖ సిబ్బందితో కలసి రైతులు సాగు చేసిన పంటలను ఆయన స్వయంగా పరిశీలించి ఈ-క్రాప్ చేయించారు. కార్యక్రమంలో ఏవో కే నీరజ, సర్వేయర్ సలార్ ఖాన్, వీఆర్వో సత్యం, వ్యవసాయ శాఖ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

22ఏ భూములకు మోక్షమెప్పుడో..!



- క్రమబద్ధీకరణకు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- మరికొన్ని జీరో ఖాతాల్లో చేరిన వైనం
- నమ్మించి మోసం చేసిన గత వైసీపీ ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న రైతులు

దర్శి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో 22ఏలో చేరిన భూములకు మోక్షమెప్పుడు లభిస్తుందోనని అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ఏళ్ల తరబడి రికార్డుల క్రమబద్ధీకరణ కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులకు అన్నదాతలు బలైపోయారు. వందలాది మంది రైతుల భూములు జీరో ఖాతాల్లో చేర్చారు. ఆ భూములు కూడా క్రమబద్ధీకరణకు నోచుకోక ఇబ్బంది పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో కొంతమంది రెవెన్యూ అధికారులు, సిబ్బంది రైతులకు పూర్తిగా హక్కులు కల్గిన భూములను 22ఏ జాబితాలో చేర్చారు. అదేవిధంగా రైతులు ఎంతోకాలంగా సాగు చేసుకుంటూ పూర్తి హక్కులతో అనుభవిస్తున్న భూములను వారి ఖాతాల్లో చేర్చకుండా జీరో ఖాతాలకు బదిలీ చేయటంతో ఆ భూములపై రైతులు హక్కు కోల్పోయారు. అధికారులు చేసిన తప్పులకు అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. ఆ భూములను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఆర్డీవో కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయాల చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నారు.

ముడుపులు తీసుకొని దగాచేసిన అధికారులు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 22ఏ లో చేరిన భూములను క్రమబద్ధీకరిస్తామని నమ్మపలికి రైతుల నుంచి లక్షలాది రూపాయలు ముడుపులు తీసుకున్నారు. సంవత్సరాలు తరబడి వారిని కార్యాలయం చుట్టూ తిప్పుకొని ప్రభుత్వం మారగానే ఉడాయించారు. డబ్బులు పోగొట్టుకున్న రైతులు ఆ అధికారుల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితంలేదు. గట్టిగా అడిగిన కొద్దిమంది రైతులకు తిరిగి డబ్బులు ఇచ్చారు. మిగిలిన వారి డబ్బులు ఇప్పటికీ దిక్కులేదు. సుమారు రూ.50 లక్షలకు పైగా ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లిన అధికారి ముడుపులు తీసుకొని రైతులను ఇబ్బంది పెడుతున్నట్లు సమాచారం. ఆ అధికారి గత ప్రభుత్వ హయాంలో తహసీల్దార్లను విధులు నిర్వహించకుండా సెలవు పెట్టించి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా అధికారం చెలాయిస్తూ రైతుల నుంచి ముడుపులు దోచుకున్నారు. ఇప్పుడు ఆ అధికారి ఇతర నియోజకవర్గంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా హాయిగా ఉద్యోగం చేసుకుంటున్నాడు. ముడుపులు ఇచ్చిన రైతులు మాత్రం ఏంచేయాలో పాలుపోక లబోదిబోమంటున్నారు.

జీరో ఖాతాల్లో చేరిన భూముల పరిస్థితి కూడా అలాగే ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీరో ఖాతాల్లో చేరిన భూముల జాబితా సిద్ధంచేసి క్రమబద్ధీకరణ కోసం ఉన్నతాధికారులకు పంపారు. కొన్ని భూములకు జీరో ఖాతాల నుంచి విముక్తి లభించింది. ఇంకా అధికశాతం భూములు అలాగే ఉన్నాయి. దర్శి మండలంలోనే సుమారు 800 ఎకరాలకు పైగా పట్టాభూములు జీరో ఖాతాల్లో చేరాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమంగా 22ఏ జాబితాలో చేర్చిన భూములు, జీరో ఖాతాల్లో చేర్చిన భూములను క్రమబద్ధీకరిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు దీంతో ఇప్పుడైనా ఆ భూములకు మోక్షం లభించి తమకు హక్కు కల్పిస్తారనే ఆశతో బాధిత రైతులు ఎదురుచూస్తున్నారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ



యాజమాన్య పద్ధతుల కరదీపికలను రైతులకు అందజేస్తున్న వ్యవసాయాధికారులు

దొనకొండ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): యాజమాన్య పద్ధతులపై రైతులకు అధికారులు శిక్షణ ఇచ్చారు. మండలంలోని రుద్రసముద్రం గ్రామంలో ఒంగోలు జిల్లా వనరుల కేంద్రంవారు ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన 2025 క్రింద పంటల సాగుపై చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై మంగళవారం ఈకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త టి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ కంది, మిరప, మొక్క జొన్న పంటల్లో చీడపీడల గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి వీవీ శేషమ్మ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల యాజమాన్యం, కంది, మొక్కజొన్న, పత్తి, మిరప పంటల్లో విత్తనంవేసే దగ్గర నుంచి పంట కోత వరకు చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు, జీవన ఎరువుల ప్రాధాన్యతను వివరించారు. వివిధ పంటల్లో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల కరదీపికలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్, ఏఈవో యోగేశ్వరరావు, వీపీఏ రవితేజ, ఆత్మా బీటీఎం నాగభూషణం, రైతులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డలకు ఎంతో శ్రేష్ఠం



తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా దర్శిలో నిర్వహిస్తున్న ర్యాలీ

దర్శి ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పురిటి బిడ్డలకు తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమని సీడీపీవో పరిమళప్రద తెలిపారు. దర్శి పట్టణంలోని క్రిష్టియన్ పాలెంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డపుట్టిన గంటలోపు ముర్రుపాలు ఇవ్వాలాన్నరు. త్వారా ఆ బిడ్డ పటిష్ఠంగా తయారవుతారన్నారు. కనీసం ఆరు నెలలు తల్లిపాలు ఖచ్చితంగా ఇవ్వాలని చెప్పారు. రెండేళ్ల వరకు ఇచ్చినట్లు అయితే మరింత శ్రేష్ఠమని ఆమె తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ వెంకటరావు, సూపర్‌వైజర్లు అనురాధ, సుభాషిణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలి

దర్శి ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు ఏర్పాటును నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రంగారావు డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అదానీ కంపెనీతో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఒప్పందం చేసుకొని మీటర్లు బిగిస్తున్నందుకు నిరసనగా స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేట్ పారిశ్రామికవేత్తలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ దోచి పెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సందు వెంకటేశ్వరరావు, గోగు వెంకయ్య, కోటేశ్వరరావు, యలమందారెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కనిగిరి: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని సీపీఐ, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విడివిడిగా స్థానిక డీఈఈ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గుజ్జుల బాలిరెడ్డి, జీపీ రామారావు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

పామూరు: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రతిఒక్కరూ ప్రతిఘటించాలని సీపీఎం నాయకుడు సయ్యద్ హనీఫ్ అన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మమ్మిడాడి సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏఈ షేక్ జిలానిబాషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో షేక్ ఖాదర్‌బాషా, కె.మాల్యాద్రి, సీహెచ్ వెంకటేశ్వర్లు, షమ్మి, మదారమ్మ, ఖాదర్‌ఉన్నీసా, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: స్మార్ట్ మీటర్లను ఏర్పాటుచేయవద్దని సీపీఎం నాయకుడు వెల్లంపల్లి ఆంజనేయులు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బోడపాటి హనుమంతరావు, గాలి వెంకటేశ్వర్లు, సుబ్బారావు, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని తరలించొద్దు!

కనిగిరి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ-2 హాస్టల్‌ను తరలించవద్దంటూ మంగళవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ కనిగిరిలో సౌకర్యవంతంగా ఉన్న బీసీ-2 హాస్టల్‌ను మార్చటం దుర్మార్గమన్నారు. హాస్టల్‌లో వందమంది విద్యార్థుల వరకు చదువుకుంటున్నారన్నారు. హాస్టల్‌ను వెలిగండ్ల మండలంలోని ఇమ్మడిచెరువు గ్రామానికి తరలించి విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయవద్దన్నారు. బీసీ-2 హాస్టర్ తరలింపు నిర్ణయాన్ని నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించుకోవాలి

దర్శి ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి సూచించారు. మండలంలోని తూర్పువీరాయపాలెంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. కొద్దిరోజుల క్రితం సీఎం చంద్రబాబు ఇక్కడ రైతులతో నిర్వహించిన ముఖాముఖి సదస్సులో పాల్గొన్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఆ పంచాయతీలోని సమస్యలను పరిష్కరించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందటంతో ప్రత్యేకంగా గ్రామసభ ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈసందర్భంగా 36 అర్జీలు వచ్చాయి. రెవెన్యూశాఖకు సంబంధించి 13, మండల పరిషత్‌కు సంబంధించి 11, ఆర్‌డబ్ల్యూఎస్‌కు ఒకటి, ఆర్‌అండ్‌బీకి రెండు, విద్యుత్ శాఖకు ఒకటి, వ్యవసాయ శాఖకు సంబంధించి ఒక అర్జీ వచ్చింది. వచ్చిన జీరో ఖాతాల్లో చేరిన భూములను క్రమబద్ధీకరణ చేయాలని అధిక సంఖ్యలో అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఆర్ఐ పరిటాల శ్రీనివాసరావు, వీఆర్వో రామవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీడీపీవోగా బాధ్యతలు చేపట్టిన ఆశా బేగం



ఎమ్మెల్యేకు మొక్కను అందజేస్తున్న సీడీపీవో ఆశా బేగం

వెలిగండ్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వెలిగండ్ల సీడీపీవోగా షేక్ ఆశా బేగం మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గ్రేడ్ 1 సూపర్‌వైజర్‌గా నాయుడుపేటలో పనిచేస్తూ పదోన్నతిపై వెలిగండ్లకు బదిలీ అయ్యారు. బాధ్యతల అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారంలో ఎటువంటి లోపం లేకుండా క్రమంగా అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ గంధం సామ్యూల్, రసూల్, ఎం.వరలక్ష్మి, శాంతి పాల్గొన్నారు.

కౌలు రైతులందరూ కార్డులు తీసుకోవాలి

పామూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు సంబంధిత వీఆర్వోల వద్ద కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో టి.అబ్రహం లింకన్ తెలిపారు. మంగళవారం మండలంలోని వగ్గంపల్లి, రావిగుంటపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పశు సంవర్ధకశాఖ సహాయకులు మాలకొండయ్య, వ్యవసాయశాఖ సహయకులు మనీషా, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

దర్శి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గుండె జబ్బుతో బాధపడుతున్న బాధితుడికి ఉపాధ్యాయినులు రూ.26వేల ఆర్థిక సాయం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఎంఈవో కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఏసోబు కొంతకాలంగా గుండె సంబంధ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన వైద్యం కోసం పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయినులు మంగళవారం రూ.26వేలు సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు రఘురామయ్య, రమాదేవి పాల్గొన్నారు.

14లోగా పంటల బీమా చేయించుకోవాలి

పీసీపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రైతులు సాగుచేసిన పంటలన్నింటికీ ఈనెల 14లోగా పంటల బీమా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎన్.రంగాక్రిష్ణ అన్నారు. మండలంలోని చినవరిమడుగు, పీసీపల్లి గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజనలో మన జిల్లాలో సజ్జ, కంది, మినము, వరి, మిరప పంటలను నోటిఫైడ్ చేశారన్నారు. ఈ ఆరు పంటలకు రైతులందరూ తప్పనిసరిగా పంటల బీమా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. బీమా చేయించుకునేందుకు జులై30తో గడువు ముగిసినప్పటికీ రైతుల మేలు కోసం ప్రభుత్వం ఆగస్టు 14వరకు గడువు పొడిగించిందని చెప్పారు.రాయితీపై కంది విత్తనాలను ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

వెలిగండ్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న యువకుడికి వైద్యఖర్చుల నిమిత్తం ఉద్యోగ, ఉపాధ్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.35 వేలు అందజేశారు. మండలంలోని కంకణంపాడు గ్రామానికి చెందిన కృష్ణకుమార్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సేవాసంస్థ ప్రతినిధులు మంగళవారం బాధితుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసహాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వెంకట మోహన్, శ్రీహరి, శంకర్, కుమారస్వామి, చంద్రశేఖర్, నాగభూషణరావు, శ్రీనివాసులు, రంగయ్య, ఉమామహేశ్వరి, మదన్మోన్ పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

పామూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు అమృతంతో సమానమని పామూరు, వగ్గంపల్లి సెక్టార్ సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ, ఎంపీఎస్ పార్వతి అన్నారు. పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు తాపించాలన్నారు. తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని తూర్పుకట్టకిందపల్లి, బొట్లగూడూరు, రావిగుంటపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 7వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

వెలిగండ్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలని పంచాయతీ కార్యదర్శి కొండయ్య అన్నారు. సమాచారహక్కు చట్టంపై మంగళవారం సచివాయ సిబ్బంది ఆధ్వర్యంలో మొగళ్లూరు పంచాయతీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులతో కలిసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొండయ్య మాట్లాడుతూ ఏప్రభుత్వ శాఖ నుంచైనా సమాచారాన్ని ప్రజలు పొందవచ్చునని చెప్పారు.

అన్నదాత.. సుఖీభవ

- ఆర్థికసాయంతో ఆనందం
- నిధుల డ్రాతో

కిటకిటలాడుతున్న బ్యాంకులు

పీసీపల్లి/దొనకొండ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 2న రైతుల ఖాతాల్లో జమచేశాయి. దీంతో ఖరీఫ్‌లో పంటల సాగుకు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం జమచేసిన సుఖీభవ నిధులు పంటలసాగుకు ఉపయోగపడుతుండడంతో అన్నదాతల మోములో ఆనందం కనిపిస్తోంది. ఈనిధులను డ్రా చేసుకోవడానికి పీసీపల్లి మండలంలోని రైతులు పెదఅలవలపాడు, పీసీపల్లి, పెదయిర్లపాడులలో గల బ్యాంకులు, వ్యాపార ప్రతినిధుల వద్ద క్యూ కడుతున్నారు. దీంతో ఆయా బ్యాంకులు, వ్యాపార ప్రతినిధుల వద్ద సందడి వాతావరణం నెలకొంది. పెదఅలవలపాడులో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, పెదయిర్లపాడులో కెనరా బ్యాంకు, పీసీపల్లిలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుల వ్యాపార ప్రతినిధుల వద్ద వందలాదిమంది రైతులు డబ్బులు డ్రా చేసుకుంటున్నారు. అలాగే, దొనకొండ మండల కేంద్రంలో అధికసంఖ్యలో రైతు ఖాతాదారులున్న కెనరా బ్యాంక్ గత రెండు రోజులుగా రైతులతో రద్దీగా మారింది.

పీసీపల్లి మండలంలో 6655మంది రైతులు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కింద లబ్ధి పొందారని ఏవో ఎన్.రంగాకృష్ణ తెలిపారు. వీరి ఖాతాల్లో రూ.4.65 కోట్ల నగదు జమ అయిందని తెలిపారు. అర్హత కలిగి ఉండి ఏదైనా సమస్యతో ఖాతాల్లో నగదు జమ కాని రైతులు రైతుసేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులకు గ్రీవెన్స్ పెట్టుకోవాలన్నారు. అలాగే, దొనకొండ మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో 6628 మంది రైతులు లబ్ధి పొందారని ఏవో బాలకృష్ణానాయక్ తెలిపారు. వీరి ఖాతాల్లో రూ.4.63 కోట్లు జమ అయ్యాయని తెలిపారు.



రైతులతో రద్దీగా ఉన్న దొనకొండలోని కెనరా బ్యాంకు

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

- మోతుకూరి కొండయ్య, పెదవరిమడుగు, పీసీపల్లి మండలం



రైతుల సాధక బాధకాలు తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. గత ఎన్నికల సమయంలో రైతులకు అండగా ఉంటామని ఆయన మాట ఇచ్చారు.ఏ డాదికి అన్నదాత సుఖీభవ కింద 20వేలు ఇస్తానని చెప్పారు. ఇప్పుడు రైతుల ఖాతాల్లో తొలివిడతగా అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కింద 7వేలు చెల్లించి ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు అండగా నిలిచారు.

వ్యవసాయ పనులకు ఉపయోగపడింది

- పొన్నెబోయిన కనకమ్మ, చిన్నగుడిపాడు, దొనకొండ మండలం



అన్నదాన సుఖీభవ పథకంలో రూ.7వేలు జమ అయ్యాయి. నాకున్న ఆరున్నర ఎకరాల్లో కంది, పత్తి పంటలను సాగు చేశాం. ప్రస్తుతం ప్రభుత్వం అందించిన నగదు వ్యవసాయ ఖర్చులకు ఉపయోగపడటం ఎంతో సంతోషంగా ఉంది.

పెట్టుబడులకు అందని సాయం

- పెమ్మసాని రమణయ్య, పుల్లాయిపల్లి, దొనకొండ మండలం



గ్రామాల్లో పంటలు సాగు చేసే అన్నదాతలకు కొంత మేర పెట్టుబడి సాయంగా అందించేందుకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ప్రవేశపెటింది. తాను నాలుగు ఎకరాల్లో సాగు చేసిన కంది పంటకు పెట్టుబడులకు ప్రభుత్వం జమచేసిన ఈ నగదు ఉపయోగపడ్డాయి.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఆదేశం
- ప్రత్యేక డ్రైవ్ పనుల పరిశీలన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మున్సిపల్ అధికారులకు సూచించారు. పట్టణంలోని 1, 2వ వార్డుల్లో మంగళవారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు రోజులుగా పడుతున్న వర్షాలకు డ్రైనేజీల్లో దోమలు ప్రబలి అనారోగ్యాలు వచ్చే అవకాశముందన్నారు. వాటిని అరికట్టేందుకు పారిశుధ్యంపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి వీధి పరిశుభ్రంగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ తమ నివాసాల వద్ద నీడనిచ్చే చెట్లను నాటాలని సూచించారు. సమీప ఖాళా ప్రదేశాల్లో ఉన్న చిల్లచెట్లను ఎప్పటికప్పుడు తొలగించేవిధంగా సంబంధిత స్థల యజమాని చర్యలు చేపట్టేలా అధికారులు మరింత చొరవ చూపాలన్నారు.

రైతుబజారులోనే కూరగాయలు విక్రయించాలి

బొడ్డుచావిడి వద్ద రోడ్డుకు అడ్డంగా కూరగాయల దుకాణాలు నిర్వహించకుండా ప్రత్యేకంగా రైతుబజార్ నిర్మించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కూరగాయల దుకాణదారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న వాహనాల రద్దీ దృష్ట్యా రోడ్డుపై నిర్వహిస్తున్న వ్యాపారాలతో ఇబ్బందిగా మారిందన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా కూరగాయల దుకాణదారులకు ఉపాధి కోల్పోకుండా ప్రత్యేకంగా తీగెలగొంది లో రైతుబజార్ నిర్మించినట్లు తెలిపారు. ఇకనుంచి ప్రతి ఒక్కరూ అక్కడే కూరగాయలు అమ్మకాలు నిర్వహించాలన్నారు.

అనంతరం కూరగాయల వ్యాపారులతో కలసి రైతుబజార్‌ను సందర్శించారు. రైతుబజార్‌లో ఏర్పాటుచేసిన మౌలిక వసతులను ఎమ్మెల్యే కూరగాయల దుకాణదారులకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల ఆవరణల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ముండ్లమూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల వద్ద ఎలాంటి నేరాలు జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటుచేయటం వల్ల ఎంతో మేలు జరుగుతుందని ఎస్ఐ కె.కమలాకర్ అన్నారు. జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు మంగళవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో విద్యా కమిటీ ఛైర్మన్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పాఠశాలల ఆవరణల్లో సీసీ కెమెరాలు ఏర్పాటువల్ల విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు గురికారని తెలిపారు. పాఠశాల ఆవరణలో ఏదైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు హనుమంతరావు, బి.పవన్‌కుమార్, ఎన్ .వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగుచేయాలి

ముండ్లమూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి ఏ.తిరుమలరావు అన్నారు. మంగళవారం మండలంలోని మారెళ్ల, జమ్మలమడక గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతులు సాగుచేసిన మొక్కజొన్నను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విచ్చలవిడిగా పురుగు మందులు వాడొద్దని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బ్రహ్మయ్య, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ డాక్యుమెంట్ల కేసులో మరో నలుగురు లొంగుబాటు

కనిగిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన కేసులో మంగళవారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎదుట మరో నలుగురు లొంగిపోయినట్లు సీఐ ఖాజావలి తెలిపారు. ఈసందర్భంగా కేసు పూర్వాపరాలపై వివరాలు వెల్లడించారు. పట్టణంలోని సర్వేనెంబర్ 301, 302 లోని 95సెంట్లు భూమిని ఆక్రమించి అమ్ముకునేందుకు తప్పుడు పత్రాలను సృష్టించారు. సదరు భూమి యజమాని పోలంరెడ్డి మాలకొండారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరు రుజువైనందున కేసు నమోదు చేసి కోర్టుకు పరిచినట్లు తెలిపారు. గతంలో 11మందిని కోర్టు రిమాండ్ విధించగా జైలుకు తరలించినట్లు తెలిపారు. మంగళవారం దేవండ్ల నారాయణ, గుంటక నరసింహారెడ్డి, ఈర్ల తిరుపతయ్య, రాజు లొంగిపోగా జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

శ్మశాన స్థలం పరిశీలన

తాళ్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : శివరాంపురం గ్రామ ఉపసర్పంచ్ నారిపెద్ది రామ్మూర్తి శ్మశాన స్థలం ప్రహరీగోడను కూల్చి, రోడ్డు నిర్మాణం చేపట్టాడని ఆగ్రామస్తుడు మారిశెట్టి బ్రహ్మయ్య, మరికొందరు గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని హిందూ శ్మశాన స్థలాన్ని ఆక్రమించారన్న ఫిర్యాదు మేరకు పరిశీలించి తగు నివేదిక అందజేయాలని ఉన్నతాధికారులు తహసీల్దార్‌ను ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం తహసీల్దార్ బీవీ రమణారావు మంగళవారం శ్మశాన వాటికను పరిశీలించారు. రికార్డుల ఆధారంగా ఆసర్వే నంబర్, విస్తీర్ణస్థలం ఏవిధంగా ఉంటే పరిశీలించారు. శ్మశాన స్థల గోడను కూల్చారా, రోడ్డు నిర్మాణం శ్మశాన స్థలంలో నిర్మించారా? అన్న విషయాలను పరిశీలించారు. వాస్తవ పరిస్థితిని జిల్లా అధికారులకు తగు చర్యల నిమిత్తం నివేదిక అందజేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో పి.చంద్రశేఖర్‌రావు, ఉపసర్పంచ్ నారిపెద్ది రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పోస్టులకు వేముల యువకుల ఎంపిక

ముండ్లమూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేముల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికయ్యారు. ఇటీవల పోలీసు కానిస్టేబుల్ ఫలితాలు వెలువడ్డాయి. మండలంలోని వేముల గ్రామానికి చెందిన బైలడుగు శ్రీనివాస్ 150 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో 7వ ర్యాంకు సాధించాడు. అదే గ్రామానికి చెందిన జానపాటి భూకాశయ్య 148 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో 15వ ర్యాంకు సాధించాడు. ఈసందర్భంగా గ్రామస్థులు వారిని అభినందించారు.

సైబర్ వలలో చిక్కుకున్న రైతు

ముండ్లమూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దఉల్లగల్లు గ్రామానికి చెందిన కొండవీటి గుర్నాధం సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి రూ.59,840 నగదు పోగొట్టుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గుర్నాధంకు చెందిన కెనరా బ్యాంకు అకౌంట్ నెం.3648300000092 నుంచి గతనెల 25న రూ.6500, రూ.3490, 29న రూ.49850 మొత్తం రూ.59,840 నగదును సైబర్ నేరగాళ్లు లాక్కు న్నారు. రెండు రోజుల క్రితం బ్యాంకులో డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లగా తన ఖాతాలో జీరో బ్యాలెన్స్ ఉండటంతో కంగారుపడి మేనేజర్‌ను కలిసి స్టేట్‌మెంట్ తీయించారు. నగదు డ్రా కావడంతో ముండ్లమూరు పోలీసుస్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు.





అమృతలూరు గ్రామంలోని రేషన్ షాపు

విష జ్వరాల నివారణకు చర్యలు

- 51 మందికి పరీక్ష.. ఆరుగురికి పాజిటివ్
- ఈదుపల్లి గ్రామంలో పర్యటించిన కలెక్టర్
- మృతుల కుటుంబాలకు అండ : వెంకటమురళి

రేపల్లె, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో విష జ్వరాల నివారణకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. నగరం మండలం ఈదుపల్లి గ్రామంలో పర్యటించిన కలెక్టర్ ఇంటింటికీ వెళ్లి విషజ్వరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విష జ్వరాలతో మృతి చెందిన కుటుంబాలకు అండగా నిలుస్తామన్నారు. గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని, అవసరమైతే జ్వర పీడితులను గుంటూరు, తెనాలి తరలించి మెరుగైన చికిత్సలు అందించాలని అధికారులను ఆదేశించారు. మురుగుకాల్వల్లో దోమల నివారణ మందు ఫాగింగ్ చేయాలని సిబ్బందికి సూచించారు. విషజ్వరాలు తగ్గేంతవరకు వైద్యసిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ప్రజారోగ్యశాఖ నిర్లక్ష్యం కనిపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో 51 మందికి జ్వరాలు నిర్వహించగా ఆరుగురికి పాజిటివ్ అని తేలిందన్నారు. డెంగీతో స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స పొందారని, నయంకాక పూర్తిగా ముదిరిన తర్వాత తెనాలి, గుంటూరు వెళ్లడంతోనే దంపతులు మృతి చెందారని తెలిపారు. తాగునీరు మురికిగా, అదీ అరకొరగానే వస్తుందని గ్రామస్థులు తెలపడంతో తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, డీఎంహెచ్‌వో విజయమ్మ, సంక్రమిత వ్యాధుల విభాగం సహాయసంచాలకులు సుబ్రహ్మణ్యేశ్వరి, తహసీల్దారు నాంచారయ్య, ఎంపీడీవో బొర్రా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోండి : మంత్రి అనగాని

విషజ్వర బాధితులకు తక్షణమే వైద్యసేవలు అందించి వారికి అండగా నిలవాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. ఈదుపల్లిలో డెంగీ మరణాలపై మంగళవారం మంత్రి ఆరాతీశారు. అధికారులు అప్రమత్తంగా ఉండి విష జ్వరాల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. విష జ్వరంతో దంపతుల మృతి బాధాకరమని, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నా రు. గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. విషజ్వరాలు తగ్గేంత వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచనలు పాటించాలన్నారు.



ఈదుపల్లిలో డెంగీతో చనిపోయిన వారి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి

మృతులకూ.. రేషన్



కార్డుల్లో తొలగించని పేర్లు

- ప్రహసనాన్ని తలపిస్తోన్న ఈ-కేవైసీ
- అనర్హులు లబ్ధి పొందుతున్నా పట్టని అధికారులు

రేషన్ సరుకులు.. అర్హులకు మాత్రమే అందాలి. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా సరుకుల పంపిణీలో గోల్‌మాల్‌తో పాటు ప్రజాధనం పెద్దమొత్తంలో వృథా అవుతోంది. జిల్లాలో రేషన్ లబ్ధిదారుల్లో మృతులు ఉన్నారంటే ఆశ్చర్యం కాదు. ఇక ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్థికంగా స్థితిమంతులు, పెళ్లి చేసుకుని వెళ్లిపోయిన వారు.. ఇలా ఎందరో ఇప్పటికీ రేషన్ కార్డుల్లో ఉన్నారు. వీరందరూ నెలనెలా ఠంచనుగా రేషన్ సరుకులు పొందుతుండటంతో ప్రభుత్వంపై పెనుభారం పడుతోంది. దీనిని అడ్డుకోవాల్సిన అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ-కేవైసీ పక్కాగా అమలు చేస్తే అనర్హులను కార్డుల్లో నుంచి తొలగించవచ్చు. కానీ మూడు నెలలుగా ఈ-కేవైసీ ప్రక్రియను అధికారులు ఓ ప్రహసనంగా మార్చేశారు. ప్రభుత్వం గడువు పొడిగించుకుంటూ వెళ్తుండటంతో ఈ-కేవైసీ నూరు శాతం జరగడంలేదు. ఇదే అవకాశంగా డీలర్లు రేషన్ సరుకులను పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అర్హులకు మాత్రమే రేషన్ ఫలాలు అందడంతో పాటు బియ్యం పక్కదారి పట్టడానికి వీలులేదన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే క్షేత్రస్థాయిలో ఇందుకు పూర్తి విరుద్ధంగా పరిస్థితులు ఉంటున్నాయి. ఈ-కేవైసీ ప్రక్రియ నత్తనడకనే సాగుతుండటంతో అర్హత లేకపోయినా పలువురు లబ్ధి పొందుతున్నారని సమాచారం. ప్రజాధనం వృథాకు అడ్డుకట్ట పడాలంటే ఈ-కేవైసీతో పాటు క్షేత్రస్థాయి సర్వేతోనే సాధ్యపడుతుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. అర్హులకు లబ్ధి చేకూరడం ఎంత ముఖ్యమో అనర్హుల ఏరివేత కూడా పక్కాగా ఉండాలని పాలకులు చెప్తున్నా క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోవడంలేదు. గత ప్రభుత్వం అనర్హుల ఏరివేతపై దృష్టి పెట్టకపోగా.. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి నెలకొంది. రాజకీయ సిఫార్సులే ప్రామాణికంగా రేషన్‌కార్డులను ఇబ్బడిముబ్బడిగా జారీ చేయడంతో జిల్లాలో ఇబ్బడిముబ్బడిగా కార్డుదారులు పెరిగిపోయారు. ఏటికేడు

(మిగతా 6లో)

అనర్హులతో రూ.3 కోట్ల వ్యయం

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో దాదాపు రెండున్నర లక్షల మంది అర్హత లేకపోయినా రేషన్ ఫలాలు అందుకుంటున్నట్లు తెలుస్తోంది. దాదాపు 21 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం మూడు జిల్లాల పరిధిలోని కార్డుదారుల కోసం కేటాయిస్తుంది. ఇందుకు సగటున రూ.వంద కోట్ల వరకు ప్రభుత్వం ఖర్చు పెడుతోంది. కానీ అనర్హులు రేషన్ లబ్ధి పొందుతుండడం వల్ల ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.3 కోట్లు అదనంగా ఖర్చవుతున్నట్లు తెలుస్తోంది.

నెర్రెలిచ్చిన సాగు నేల

బలిజేపల్లి, నంబర్‌వన్ కాల్వలకు విడుదల కాని నీరు

ఎండుతున్న వెదనాట్లు



చుక్క నీరు రాని బలిజేపల్లి కాల్వ

వేమూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగు నిమిత్తంగా ప్రభుత్వం డెల్టా ప్రాంతానికి సాగునీటిని వదిలి 20 రోజులు దాటుతోంది. అయినా వేమూరు మండలం పరిధిలోని బలిజేపల్లి, నంబర్ వన్ కాల్వలకు ఇంత వరకు చుక్క నీరు అందలేదు. దాదాపుగా 1,500 ఎకరాలకు చెందిన రైతులు ఈ రెండు కాల్వలపై ఆధారపడి సాగు చేస్తున్నారు. గతంలో ఈ కాల్వల లెవలింగ్ సరిలేక నీరు అందేది కాదు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నిధులు నియోజకవర్గంలోని కాల్వల మరమ్మతులకు విడుదల చేయడంతో.. ఈ రెండు కాల్వల సమస్యకు పరిష్కారం లభించింది. అయినప్పటికీ సాగు నీరు అందకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నంబర్ వన్ కాల్వ కింద అబ్బనగూడవల్లి, బలిజేపల్లి, తాడిగిరిపాడు గ్రామాలకు చెందిన 800 ఎకరాలు.. బలిజేపల్లి కాల్వ కింద అబ్బనగూడవల్లి, పెనుమర్రు, బలిజేపల్లి-తాడిగిరిపాడు - కోడిపర్రు గ్రామాలకు చెందిన 600 ఎకరాలకు సాగుకు నీరు అందక వెద నాట్లు వేసిన రైతులు నానా అవస్థలు పడుతున్నారు. సాగునీరు అందకపోయినా వర్షాల కోసం ఎదురు చూసిన రైతులకు నిరాశే ఎదురైంది.

అడ్డుకట్టలే అసలు సమస్య..

నీటి పారుదల శాఖ ఏఈ రవి ఈ సమస్యపై వివరణిచ్చారు. ప్రధాన కాల్వల్లో సాగునీరు పుష్కలంగా ఉందన్నారు. అయితే.. కాల్వల ప్రథమంలో ఉన్న రైతులు తమ భూములకు నీరు పెట్టుకునేందుకు అడ్డుకట్టలు వేయడం వల్ల సమస్య ఏర్పడిందని చెప్పారు. మంగళవారం ప్రత్యేక చర్యలతో నీటిని వదిలి.. రైతులకు సహకరిస్తామని పేర్కొన్నారు.

గంటలోనే రిజిస్ట్రేషన్ : మంత్రి అనగాని

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గతంలో మాదిరిగా గంటల తరబడి వేచి చూడకుండా.. కార్యాలయానికి వచ్చిన గంటలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసేలా చర్యలు తీసుకున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గుంటూరు నగరంలోని కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించిన మంత్రి అర్బన్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ విధానాన్ని పరిశీలించారు. గుంటూరుకు చెందిన ఆలపాటి సుధాకర్ సతీమణి నాగ లీలావతికి దఖలు దస్తావేజు ద్వారా ట్రాన్స్ఫర్ చేసిన విధానాన్ని పరిశీలించి, పేరు మార్పిన సర్టిఫికెట్‌ను అందజేశారు.

ఆలయ భూమిని కాపాడండి

శ్రీవీరాంజనేయస్వామి పేరుతో కరపత్రం



గ్రామంలో పంపిణీ జరిగిన కరపత్రం



జెండాలు పాతిన ఆలయ భూమి

అమృతలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దూపదీప నైవే ద్యాల కోసం దాతలు ఇచ్చిన భూమిని కాపాడండి.. అంటూ ఏకంగా ఏలూరు జిల్లా ఏలూరు మండలం చాటపర్రు శ్రీవీ రాంజనేయస్వామి పేరుతో వెలిసిన కరపత్రం అమృతలూరులో చర్చనీయాంశంగా మారింది. 40 ఏళ్ల క్రితం అమృతలూరుకు చెందిన దాత సుశీర్ల సూర్యనారాయణ అనే భక్తుడు ఇచ్చిన 1 ఎకరా 98 సెంట్లకు వచ్చే కౌలుతో ఆలయంలో సేవలు అందుతున్నాయని, ఇప్పుడు ఆ భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు.. గ్రామస్థులు, ఆలయ అధికారులు కాపాడాలి.. అంటూ స్వామివారి పేరుతో వెలిసిన కరపత్రంలో ఉండటంతో ఆలయ భూమికి రెక్కలొచ్చాయా అని గ్రామస్థులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు జిల్లా ఏలూరు మండలం చాటపర్రులోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయానికి అమృతలూరులో సర్వే నెంబరు 479/బీలో 1 ఎకరా 98 సెంట్ల దానంగా ఇస్తూ సుశీర్ల సూర్యనా రాయణ వీలునామా రాశారు. కొంతకాలం వరకు చాటపర్రు వీరాంజనేయస్వామి దేవస్థానం అంటూ భూమి శిస్తు కూడా చెల్లించారు. అయితే ఇటీవల ఆ భూమి తమది అంటూ కొందరు గ్రామకచేరి రెవెన్యూ అధికారులను కలిశారు. స్వామికి చెందిన భూమిని దక్కించుకునేందుకే వారు అధికారులను కలిశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో కరపత్రం వెలుగుచూడటం.. ఆ పొలం చుట్టూ వీరాంజనేయస్వామి జెండాలను నాటడంతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

కొరిశపాడు సుపరిపాలనలో మంత్రి రవికుమార్



దివ్యాంగురాలికి ట్రైసైకిల్ పంపిణీ చేస్తున్న మంత్రి రవికుమార్, కలెక్టర్ వెంకటమురళి

మేదరమెట్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రాజకీయలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం అందిస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని కొరిశపాడులో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో రూ.1.66 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, రూ.2.30 లక్షలతో నిర్మించిన సైడ్ డ్రెయిన్లు, సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో రూ.32.50 లక్షలతో నిర్మించిన ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతు అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. తల్లికివందనం, ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 1.10 లక్షల మంది వితంతువులకు పింఛన్లు అందించామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క వితంతు పెన్షన్ కూడా ఇవ్వలేదన్నారు. గ్రామంలో ఇప్పటికే 50 లక్షలతో ఎస్సీ కాలనీలో రోడ్లు సైడ్ డ్రెయిన్లు నిర్మించామన్నారు. గ్రా మంలో పాత విద్యుత్ స్థంభాలను తొలగించి 150 కొత్తగా వేశామన్నారు. మరో 20, 30 ఏళ్ల వరకు వెనుతిరిగి చూడకుండా గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. రైతులకు అవసరమైన డొంక రోడ్లను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక ఆర్యోగ కేంద్ర భవనాలను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను మంత్రి ఆదేశించారు. రోగులకు అసౌకర్యం కలగ కుండా వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సామూహిక సీమంతాల కార్యక్రమంలో గర్భిణీలను మంత్రి ఆశీర్వాదించారు.

పదివేల మందికి సైకిళ్లు పంపిణీ చేస్తాం

15 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, జడ్పీ ఉన్నత పాఠశాలలో 56 మంది విద్యార్థులకు సైకిళ్లను మంత్రి పంపిణీ చేశారు. వచ్చే డిసెంబర్‌లోపు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పది వేల సైకిళ్ల పంపిణి చేస్తామని తెలిపారు. సీఎస్ఆర్ పథకం కింద పారిశ్రామికవేత్తలు, స్నేహితుల సహకారంతో విద్యార్థులకు సైకిళ్లు, దివ్యాంగులకు మూడు చక్రాల మోటర్ సైకిళ్లను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటమురళి, డీఎంహెచ్‌వో విజయమ్మ, ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, జడ్పీటీసీ తుళ్లూరి వెంకటరమణ, తహసీల్దార్ సుబ్బారెడ్డి, సర్పంచ్ విజయకుమార్, టీడీపీ నాయకులు ఏడెం భవానిప్రసాద్‌రెడ్డి, సింబోతు సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ మున్నంగి వెంకట సుబ్బారెడ్డి, గోలి హరిబాబు, సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్‌లు సురేంద్ర, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిహారంపై కసరత్తు

- ఒడిశా కలెక్టర్లతో చర్చిస్తున్న యంత్రాంగం
- క్షతగాత్రులకు నేడు పరిహారం పంపిణీకి చర్యలు

(బాపట్ల, బల్లికురవ, ఆంధ్రజ్యోతి)

బల్లికురవ మండల పరిధిలోని కొణిదెన రెవిన్యూలోని సత్య కృష్ణ గ్రానైట్ క్వారీ మృతులకు నష్ట పరిహారం అందించడానికి యంత్రాంగం కసరత్తు చేస్తోంది. క్వారీలో ఆదివారం ఒడిశాకు చెందిన ఆరుగురు కార్మికులు మృతి చెందిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలను స్వస్థలం ఒడిశా రాష్ట్రానికి ఆదివారం రాత్రికే తరలించారు. మృతులకు రూ.14 లక్షల చొప్పున నష్ట పరిహారం ప్రభు త్వం ప్రకటించిన సంగతి విదితమే. మృతుల్లో ఇద్దరు ఒడిశాలోని గజపతి జిల్లాకు చెందిన వారు కాగా, నలుగురు గంజాం జిల్లాకు చెందిన వారుగా గుర్తిం చారు. ఈ క్రమంలో ప్రభుత్వ పరిహారాన్ని ఆయా కుటుంబ సభ్యులకు అందేలా చూడడానికి కలెక్టర్ వెంకటమురళితో పాటు చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ఒడిశా కలెక్టర్లతో చర్చిస్తున్నారు. మృతుల కుటుంబసభ్యులు, బ్యాంకు ఖాతాల విషయంలో స్పష్టత రాలేదని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. క్వారీల్లో పనిచేసే వారికి పీఎఫ్, అసంఘటిత కార్మికులకు అందించే ఫలాలు అందాలన్నా బ్యాంకు ఖాతాలు తప్పనిసరి. అయితే వారికి బ్యాంకు ఖాతాలు లేవని, ఇందుకు కార్మిక శాఖ ఉదాసీనత కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. తీవ్ర గాయాల పాలైన వారిలో ఇద్దరికి పది లక్షల చొప్పున, మిగిలిన ఆరుగురికి ఒక్కొక్కరికి లక్ష చొప్పున పరిహారాన్ని ప్రభుత్వం అందించనుంది. వీరందరూ ప్రస్తుతం నరసరావుపేట ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నందువల్ల వారికి బ్యాంకు ఖాతాలు తెరిచే ప్రక్రియను యంత్రాంగం దాదాపుగా పూర్తి చేసింది. బుధవారం వారి ఖాతాల్లో పరిహారం జమ చేయనున్నట్లు చీరాల ఆర్డీవో తెలిపారు.

రెండో రోజు విచారణ

క్వారీలో రెండో రోజు మంగళవారం కూడా మైన్స్ అండ్ సేఫ్టీ డిప్యూటీ డైరెక్టర్ జ్ఞానేశ్వర్ విచారణ చేపట్టారు. క్వారీలో భద్రత పరంగా చేపట్టిన చర్యలపై పరిశీలన చేశారు. ప్రమాదం ఎలా జరిగింది. అప్పుడు ఎంత మంది కూలీలు ఉన్నారన్న దానిపై విచారణ చేపట్టారు.

అమరావతి రాయల్స్ జెర్సీ ఆవిష్కరణ

- చీరాల సెయింట్ ఆన్స్‌లో కెప్టెన్ హనుమవిహారి సందడి



అమరావతి రాయల్స్ జెర్సీ ఆవిష్కరిస్తున్న కెప్టెన్ విహారి

చీరాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వైజాగ్‌లో శుక్రవారం నుంచి జరిగే ఆంధ్రా ప్రీమియర్ లీగ్-2025 క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొనున్న అమరావతి రాయల్స్ టీం జెర్సీని కెప్టెన్ హనుమవిహారి ఆవిష్కరించారు. చీరాల సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం విద్యార్థుల కేరింతల మధ్య ఈ కార్యక్రమం జరిగింది. టీం విజయం సాధించాలని విద్యార్థులతో పాటు అభిమానులు ఆకాంక్షించారు. జట్టుకు మాజీ ఎంఎల్‌సీ అన్నం సతీష్ ప్రభాకర్ ఫ్రాంఛైజీగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్, మాజీమంత్రి వనమా వెంకటేశ్వరరావు, టీం కోచ్ అబ్రహం, మేనేజర్ హర్షవర్ధన్, సీఈవో యశ్వంత్, కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, రమణమూర్తి, పీడీ అన్నం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇదేటా..! ట

పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల్లో వ్యత్యాసం


అన్నదాత సుఖీభవ ఇది రాష్ట్ర ప్రభుత్వ పథకం.. పీఎం కిసాన్ ఇది కేంద్ర ప్రభుత్వ పథకం. రెండు పథకాల లక్ష్యం ఒక్కటే అన్నదాతకు పెట్టుబడి సాయం అందించడం. ఇంత వరకు బాగానే ఉంది. లబ్ధిదారుల ఎంపికలో రెండు పథకాలకు పొంతన లేదు. ఒక పథకం జాబితాలో ఉన్న లబ్ధిదారులు.. మరో పథకం జాబితాలో లేరు. పీఎం కిసాన్ పథకం కింద రూ.2 వేలు నగదు జమ అయిన అన్ని ఖాతాలకు.. అన్నదాత సుఖీభవ సొమ్ము రూ.5 వేలు జమ కాలేదు. ఇదే పరిస్థితి అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారులది. పీఎం కిసాన్‌లో అర్హత ఉంటే.. సుఖీభవకు ఎలా అనర్హులం అవుతామంటూ.. బాధితులు ప్రశ్నిస్తున్నారు. సుఖీభవ పొందిన తమకు.. పీఎం కిసాన్ ఎందుకివ్వరని సదరు రైతులు నిలదీస్తున్నారు. ఇలాంటి లబ్ధిదారులు వందల్లో ఉంటే ఎక్కడో పొరపాటు జరిగిందని భావించవచ్చు. ఈ సంఖ్య వేలల్లో ఉంది.


అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ లబ్ధిదారుల వ్యత్యాసం ఇలా..

జిల్లా	అన్నదాత సుఖీభవ (లబ్ధిదారులు)	పీఎం కిసాన్ (లబ్ధిదారులు)	వ్యత్యాసం
పల్నాడు	2,39,959	2,02,278	37,681
బాపట్ల	1,60,441	1,43,200	17,241
గుంటూరు	1,02,650	88,708	13,942

- రెండు కేంద్ర, రాష్ట్ర పథకాలు.. లక్ష్యం రైతుకు పెట్టుబడి సాయం
- కేంద్ర జాబితాలో ఉన్న లబ్ధిదారులు.. రాష్ట్ర జాబితాలో లేరు
- రూ.5 వేలు పడిన వారికి రూ.2 వేలు పడలేదు..
- రెండు పథకాల మధ్య తేడా 68,864 వేల మంది రైతులు







(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల్లో.. ఒక దానికి లబ్ధి చేకూరి, మరో పథకం వర్తించని రైతులు.. రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కానీ, వారి సందేహాలను నివృత్తి చేసే వారు కానరావడం లేదు. రెండు పథకాలకు ఒకే లబ్ధిదారుల జాబితా లేదని అధికారులు చెప్పకనే చెబుతున్నారు. పీఎం కిసాన్

(మిగతా 6లో)

స్మార్ట్ పాలనకు ప్రభుత్వం శ్రీకారం

● సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య ● పలుచోట్ల వాట్సప్ గౌవర్నెన్స్‌పై అవగాహన



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

సాల్మన్‌సెంటర్(చీరాల), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్స్‌తో 200 ప్రజా సేవలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని సాల్మన్ సెంటర్‌లో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈక్రమంలో స్థానికులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే గురువారం నుండి చేనేతలకు ఉచిత విద్యుత్ అమల్లోకి వస్తున్నట్లు చెప్పారు. మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు అందజేయనున్నట్లు వివరించారు. 15వ తేదీ నుండి మహిళా తల్లులకు ఉచిత బస్‌సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే స్త్రీనిధి ద్వారా రూ.19 లక్షల చెక్కులను పొదుపు సంఘాల మహిళలకు అందజేశారు. గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవం చేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీడీవో శివన్నారాయణ, ఏపీఎం మధు, సీనియర్ టీడీపీ నాయకులు సిద్ధి బుచ్చేశ్వరరావు, టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొ న్నారు. అనంతరం బుర్లవారిపాలెంలో రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు.

పంగులూరు: రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికతను వినియోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో కే.సుమంత్ అన్నారు. మండల కేంద్రమైన పంగు లూరులో మంగళవారం వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ ముందస్తు వేడుకలలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందచేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి రమేష్, కార్యదర్శులు రాంబాబు, సునీత, హెచ్‌ఈ అనూరాధ, గుడిపూడి రామారావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వాట్సప్ గవర్నర్స్ సేవలపై ప్రజలందరూ అ వగాహన కలిగి ఉండాలని ఐఈఈఆర్‌టీ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు బత్తుల కిరణ్ అన్నారు. మంగళవారం స్థానిక నంబూరివారిపాలెంలో మనమిత్ర క్యాంపెయిన్ నిర్వహణలో వాట్సప్ గవర్నర్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ అశోక్‌బాబు, సచివాలయం సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చినగంజాం : చినగంజాం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మనమిత్ర యాప్‌పై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీ.హెచ్.పూర్ణచంద్రరావు, గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అధికారులు మన మిత్ర యాప్, హర్ ఘర్ తిరంగాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కె.అంజయ్య, చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సంతమాగులూరు : ప్రజాసేవలను పారదర్శకంగా పొందేందుకు మనమిత్ర వాట్సప్ సేవలు ఉకరిస్తాయని ఎంఆర్‌వో బుచ్చిబాబు అన్నారు. 9552300009 ఈ వాట్సాప్ నెంబరును సేవ్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వ కల్పిస్తున్న 34 శాఖల సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ వాట్సాప్ నంబరులో వ్యవసాయ శాఖకు సంబంధించిన పంటబీమా నమోదు, రెవెన్యూ శాఖ సంబంధించిన వివిధ ధ్రువపత్రాలు పొందడం, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన ఇంటిపన్ను చెల్లింపులు, ప్రజాఫిర్యాదులు, బంగారు కుటుంబాలుగా నమోదు చేసుకోవడం, తదతర సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.





పంగులూరులో ముగ్గులపోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు, చినగంజాంలో ర్యాలీ

తల్లులకు ప్రోత్సాహకాలు



బెస్ట్ మథర్ ప్రోత్సాహకం అందజేస్తున్న సీడీపీవో ఝాన్సీ

చీరాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : తల్లీ, బిడ్డ ఆరోగ్య సూత్రాలను విధిగా ఆచరించాలని తల్లులకు బెస్ట్ మథర్ ప్రోత్సాహకం అందించి పోత్సహిస్తున్నట్లు సీడీపీవో ఝాన్సీ తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే తల్లి పాల వారోత్సవాలతో తల్లీ బిడ్డ ఆరోగ్యంపై దృష్టి సారించింది. ఈక్రమంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం విఠల్‌నగర్ అంగన్వాడీ కేంద్రంలో బెస్ట్ మథర్ ప్రోత్సాహకాలను సీడీపీవో అందజేశారు. తోటవారి పాలెం, వాడరేవు, బుర్లవారిపాలెం, పెర్లవారిపాలెం, పిట్టువారి పాలెం ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. సూపర్ వైజర్‌లు శేషమ్మ, శ్యామల, ఆయా ప్రాంతాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతను వివరించాలి

యద్దనపూడి,(మార్టూరు)ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం అని డాక్టరు శ్రీహర్ష అన్నారు. ప్రపంచ తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం యద్దనపూడి మండలంలోని జాగర్లమూడి, యద్దనపూడి గ్రామాలలో అంగనవాడీ కేంద్రాలలో అవగాహన కార్యక్రమాల, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఎదగడానికి తల్లి పాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. పిల్లలు ఆరోగ్యంగా, బలంగా, పుష్టిగా పెరగడానికి తల్లిపాలు ద్వారానే సాధ్యమన్నారు. సీడీపీవో సుభద్ర మాట్లాడుతూ తల్లులను చైతన్యపరచే బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలదన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజరు సుజాత, కార్యకర్త గేరా సౌభాగ్యవతి తదితరులు పాల్గన్నారు.

వేగం కన్నా క్షేమమే ప్రధానం



మాట్లాడుతున్న సీఐ శేషగిరిరావు

మార్టూరు, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్లడం కన్నా క్షేమంగా వెళ్లడం మిన్న అని మార్టూరు సీఐ ఎం.శేషగిరిరావు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ ట్రాఫిక్ లైట్ దినోత్సవం సందర్భంగా మార్టూరులోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గడ్డం అంజనేయులు ఎస్సై సైదా మాదాల సాంబశివరావు, రావి అంకమ్మచౌదరి, చెరుకూరి నాగేశ్వరరావు, జాష్టి సాంబశివరావు, షేక్ కాజాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులో బ్యాగ్‌ను పోగొట్టుకున్న మహిళ

● రికవరీ చేసి అందజేసిన సీఐ

మార్టూరు, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో విజయవాడకు చెందిన దంపతులు సంచిని పోగొట్టుకోగా, సీఐ ఎం.శేషగిరిరావు రికవరీ చేసి అందజేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడకు చెందిన మాలె మాలకొండయ్య, భార్య గోవిందమ్మతో కలిసి సోమవారం విజయవాడ వెళుతున్నారు. వీరి ముందు కూర్చున్న ప్రయాణికులు మార్టూరులో దిగారు పొరపాటున వారి సంచులతో పాటు ఈ సంచినికూడా తీసుకెళ్లారు. విజయవాడలో బస్సు దిగినప్పుడు గమనించి ఇక్కడి సీఐ శేషగిరిరావుకు తెలియజేశారు. ఆయన సీసీ కెమెరాలు పరిశీలించి ప్రయాణికులను గురించి వారి నుంచి బ్యాగు రికవరీ చేశారు. బాధితులకు అందజేశారు. బ్యాగులో విలువైన వస్తువులు ఉన్నట్లు మాలకొండయ్య తెలిపారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ



మాట్లాడుతున్న ఏడీఏ ఏప్రాయం

అద్దంకిటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ, అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని ఏడీఏ బి.ఏప్రాయం అన్నారు. మంగళవారం ధర్మవరం, శంకవరప్పాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతు ఆధార్ తప్పుగా నమోదైన వారికి తహసీల్దార్ కార్యాలయంలో సరిచేసుకున్నట్లు అయితే వారికి కూడా అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, ఉద్యానశాఖ అధికారిణి ఎస్. దీప్తి, వీఏఏ శేషయ్య, ఖాజాబీ, రైతులు పాల్గొన్నారు.

హోంగార్డుల నుంచి కానిస్టేబుళ్లుగా...

- జిల్లాలో 9 మంది ఎంపిక

-అభినందించిన ఎస్పీ

ఒంగోలు క్రైం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి) : ఆత్మ విశ్వాసం.. పట్టుదల.. క్రమశిక్షణ వారి విజయానికి సోపానంగా మారాయి. పోలీసుశాఖలో అంతర్ భాగంగా ఉన్న హోంగార్డు విభాగంలో ఏళ్ల తరబడి కష్ట పడి ప్రజలకు సేవలు అందించిన 9 మంది హోంగార్డులు ఇటీవల జరిగిన కానిస్టేబుల్ పరీక్షలో విజయం సాధించి తమ సత్తా చాటారు. అంతేకాదు యువతకు ఆదర్శంగా నిలబడ్డారు. జిల్లాలో హోంగార్డులుగా పని చేస్తున్న 9 మంది హోంగార్డులు తమ విధులు నిర్వహిస్తూనే శరీరక ధారుడ్య పరీక్షలతో పాటు రాత పరీక్షలకు అహర్నిశలు కష్టపడి విజయం తమ సొంతం అని నిరూపించుకున్నారు. వీరిలో 8 మంది సివిల్ కానిస్టేబుళ్లుగా, మరొకరు ఏపీఎస్పీ కానిస్టేబులుగా నెగ్గి శిక్షణకు వెళుతున్నారు.

ఎంపికైన వారు

హోంగార్డులుగా పనిచేస్తూ కానిస్టేబుళ్లగా ఎంపికైన సిహెచ్.ఆవులయ్య, వైవిబి. గాంధీ, బాలకోటేశ్వరరావు, ఎం.శివప్రసాద్, పి.అమర్‌నాథ్, వి.సత్యనారాయణ రెడ్డి, ఏడుకొండలు, దాసరి ఆశ్వీరాదం, ఎస్.కె. అన్వర్ బాషాలు ఉన్నారు.

అభినందించిన ఎస్పీ

కానిస్టేబుళ్ల ఎంపిక పరీక్షలో నెగ్గి ఉద్యోగం సాధించిన 9 మంది హోంగార్డులను ఎస్పీ ఏఆర్.దామోదర్ మంగళవారం అభినందించారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హోంగార్డులు కష్టపడి కానిస్టేబుళ్లగా ఉద్యోగం సాధించడం స్ఫూర్తిదాయకం అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, ఆర్ఐ.సీతారామిరెడ్డి పాల్గొన్నారు.



కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారిని అభినందిస్తున్న ఎస్పీ దామోదర్

రెండు రోజులుగా పోస్టల్ సర్వర్ డౌన్

- ఇబ్బందులు పడిన ప్రజలు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సేవలకు అంతరాయం ఏర్పడింది. సోమ, మంగళవారంలో సర్వర్ రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయవాడ రీజియన్ పరిధిలోని ఈసమస్య తలెత్తినట్లు తపాలా శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. గత నెలలో తపాల శాఖ సాఫ్ట్‌వేర్‌ను 2.0గా అప్‌డేట్ చేయడంతో సాంకేతిక సమస్యలు ఎదురైనట్లుగా అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా 427 పోస్టాఫీస్‌ల ద్వారా అందించే బ్యాంకింగ్, కొరియర్, రిజిస్టర్ పోస్టలు, పీఎల్ఐ, ఇతరత్రా వివిధ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం మధ్యాహ్నం 3గంటల నుంచి సర్వర్ కొంతమేర పనిచేయడంతో సేవలను కొనసాగించారు. రెండు రోజులుగా తలెత్తిన సర్వర్ సమస్యతో ప్రజలు తమ కవర్లను ఇతర ప్రాంతాలకు పంపేందుకు ప్రవేటు కొరియర్లను ఆశ్రయించారు.



ఒంగోలులో బోసిపోయిన పోస్టాఫీస్

స్కూలుకు వెళతామని ఇంటి నుంచి అదృశ్యం

● కుటుంబ సభ్యులకు చిన్నారులను అప్పగింత



చిన్నారులను తల్లికి అప్పగిస్తున్న సీఐ

వేటపాలెం (చీరాల), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : స్కూల్‌కు వెళుతున్నామని చెప్పి ఇద్దరు విద్యార్థులు అదృశ్యం కాగా, వారిని గంటల వ్యవధిలోనే పోలసులు గురించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేటపాలెం మండలం పందిళ్లపల్లికి చెందిన ఇరువురు చిన్నారులు స్కూల్‌కు వెళుతున్నామని ఇంటి నుండి అదృశ్యమయ్యారు. అయితే సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు వెంటనే వేటపాలెం ఎస్సై జనార్ధన్‌ను ఆశ్రయించారు. స్పందించిన ఎస్సై సీసీ కెమెరాలను పరిశీలించి వేటపాలెం సమీపంలో సంచరిస్తున్న వారిని గుర్తించారు. అనంతరం స్టేషన్‌కు తరలించి తల్లిదండ్రులకు అప్పగించగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

సర్దుబాటు చార్జీల పేరుతో దోపిడీ

పంగులూరు, ఆగష్టు 5(ఆంధ్రజ్యోతి):విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రభుత్వం వినియోగదారులను దోపిడీ చేస్తోందని సీపీఎం సీనియర్ నేత నాగబోయిన రంగారావు అన్నారు. స్మార్ట్ మీటర్లను బిగించవద్దని, విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలను రద్దుచేయాలని కోరుతూ ప్రజాఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం పంగులూరు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాయిణి వినోద్‌బాబు, మల్లారెడ్డి, సుబ్బరాజు, రామచంద్రరాజు, ఆదాం సాహెబ్, తలపనేని సుబారావు, సుధాకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సోడాబండిని ఢీకొన్న మోటార్‌సైకిల్

అద్దంకి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు అంచులో నిలిపి ఉన్న షోడాబండిని మోటార్‌సైకిల్ ఢీ కొనడంతో ఇరువురికి గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని బత్తులవారిపాలేనికి చెందిన బత్తుల నాగేంద్ర మోటార్ సైకిల్‌పై అద్దంకి వైపు వస్తూ తిమ్మాయపాలెం సమీపంలో ఇటుక బట్టీల వద్ద ఆగి ఉన్న షోడా బండిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిలిస్టు నాగేంద్ర, షోడాబండి నిర్వాహకుడు వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాగేంద్రను మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు వాహనంలో ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకట్రావు

పర్చూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మార్కెట్ యార్డ్‌లో మంగళవారం యద్దనపూడి మండలానికి సంబంధించి రైతుల బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశచరిత్రలో ఎన్నడూలేని విధంగా సంచలన నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తీసుకుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ఎన్.రంగయ్య చౌదరి, సాయకులు సీతయ్య, రాము, చంద్రశేఖర్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

పంగులూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న యువతి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మంగళవారం మండలంలోని కొండమంజులూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వినోద్‌బాబు కథనం మేరకు కొండమంజులూరు గ్రామానికి చెందిన యువతి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తోంది. ఆమెకు తల్లిదండ్రులు పెళ్లి సంబందాలు చూడడం ఇష్టం లేకపోవడంతో కొండమంజులూరులోని ఇంటిలో చీరతో ఉరివేసుకుని బలన్మరణానికి పాల్పడింది. పొలం నుంచి ఇంటికి వచ్చిన తండ్రి తులుపుల వేసిఉండటంతో తలుపులను బద్దలు కొట్టిచూడగా యువతి ఉరికి వేలాడు కనిపించింది. ఘటనపై తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

స్కూల్ గేమ్స్ సెక్రటరీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు విద్య, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూలు గేమ్స్ సెక్రటరీ పోస్టు నియామకానికి అర్హులైన స్కూలు అసిస్టెంట్ వ్యాయామ విద్య/ పీఈటీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగత వారు ఈనెల 8లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పోస్టు కాలపరిమితి రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు.

కుమారుడిపై తండ్రి గొడ్డలితో దాడి

అవీఇవీ



వైద్యశాలలో చికిత్స చేస్తున్న వైద్యులు

పెద్దదోర్నాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో గొడవ చేస్తున్న తండ్రిని మందలించిన కుమారుడిపై గొడ్డలి, విల్లంబులతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన మండలంలోని పోతన్న గూడెంలో సోమవారం రాత్రి జరిగింది. ఈ ఘటనలో కుడుముల బయన్నకు తలపై గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పోతన్నగూడేనికి చెందిన కుడుముల వెంకటేశం మద్యం సేవించి భార్యపై చేయిచేసుకుంటుండగా కుమారుడు బయన్న అడ్డుకున్నాడు. దీంతో ఆవేశంతో వెంకటేశం గొడ్డలితో కుమారుడి తలపై దాడి చేసి, అనంతరం విల్లంబుతో కూడా గాయపరిచి పరారయ్యాడు. గమనించిన బంధువులు క్షతగాత్రున్ని దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మృతులకూ.. రేషన్

(5వ పేజీ తరువాయి)

లబ్ధిదారుల సంఖ్యలో పెరుగుదల నమోదు కావడమే తప్ప తొలగించిన వారి సంఖ్య కనిపించదు. అయితే అర్హులు ఎందరో రేషన్ ఫలాలు అందుకోలేక పోతున్నారు. వారిని అధికారులు కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడంతో సరిపెడుతున్నారే కానీ కనికరించడంలేదు. బయోమెట్రిక్‌ను దుర్వినియోగిస్తూ కుటుంబంలో చనిపోయిన వారు ఉన్నా వారి సమాచారం ఇవ్వకుండా రేషన్ లబ్ధి పొందుతున్నవారూ ఉన్నారు.

విభాగాల మధ్య లోపం..

అనర్హుల ఏరివేత పక్కాగా జరగాలంటే జిల్లా పౌరసరఫరాల శాఖతో పాటు మండలాల పరిధిలోని రెవెన్యూ విభాగం కూడా సమన్వయంతో అడుగులేయాలి. కానీ క్షేత్రస్థాయిలో అది లోపించింది. మరణ ధ్రువీకరణ పత్రాన్ని వారి కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా అందిస్తే తప్ప రెవెన్యూ విభాగం మరణాలపై స్పదించడం లేదన్న విమర్శలున్నాయి. ఈ పత్రాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయగానే ఆటోమెటిక్‌గా వారి పేరు రేషన్ కార్డు నుంచి తొలగించబడుతుంది. కానీ ఈ పని అందరూ స్వచ్ఛందంగా చేయకుండా ఏళ్ల తరబడి లబ్ధి పొందుతూనే ఉన్నారు. సచివాలయ సిబ్బంది కూడా మరణాలపై దృష్టి పెట్టడం లేదు. పౌర సరఫరాల శాఖ ఈ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో అంతిమంగా ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతోంది.

ఇదెట్టా..!

(5వ పేజీ తరువాయి)

పథకానికి 2019 వెబ్ ల్యాండ్ ప్రకారం లబ్ధిదారులను గుర్తించారని, సుఖీభవ పథకానికి 2005 జూన్ నాటి వెబ్ ల్యాండ్ ప్రకారం లబ్ధిదారుల ఎంపిక జరిగిందని సబంధిత అధికారులు చెబుతున్నారు.

మూడు జిల్లాల్లో బాధితులు ఇలా..

పల్నాడు జిల్లాలో 37,681, బాపట్ల జిల్లాలో 17,241, గుంటూరు జిల్లాలో 13,942 మంది రైతులు పీఎం కిసాన్‌ను కోల్పోయారు. మూడు జిల్లాల్లో 68,864 మంది రైతుల ఖాతాలకు అన్నదాత సుఖీభవ తొలి విడద నగదు రూ.5 వేలు జమ కాలేదు. అలాగే పీఎం కిసాన్ పథకం లబ్ధి పొందిన వారు కూడా.. సుఖీభవకు దూరమయ్యారు. కూటమి ప్రభుత్వం ఏటా రూ.20 వేలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల కింద పెట్టుబడి సాయం అందిస్తానని హామీ ఇచ్చింది. రెండు పథకాల జాబితాలను పరిశీలించి.. అర్హులకు రెండు పథకాల సొమ్ము ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే.. ప్రభుత్వ హామీ నెరవేరుతుంది.

ఈకేవైసీ మతలబు ఏమిటో?

ఈకేవైసీ కాలేదని, ఇంటి మ్యాపింగ్ జరగలేదని, 1బీ నమోదు కాలేదని తదతర అంశాలతో అర్హులైన రైతుల పేర్లను అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల జాబితా నుంచి అధికారులు తొలగించారు. ఇక్కడ తొలగించిన లబ్ధిదారులకు పీఎం కిసాన్ పథకం వర్తించింది. వీరి బ్యాంకు ఖాతాలకు రూ.2 వేలు జమ కావడం గమనార్హం. ఈకేవైసీ పీఎం కిసాన్ పథకానికీ ఉంది. అయితే అక్కడ ఉన్న ఈకేవైసీ.. సుఖీభవకు ఎందు కాలేదు.? రెండు ఈకేవైసీలు ఒకటి కాదా అని లబ్ధిదారుల ప్రశ్నిస్తున్నారు. మ్యాపింగ్ అయిన లబ్ధిదారులకు కూడా సుఖీభవ వర్తించ లేదు. ఇలాంటి వారు కూడా వేలల్లోనే ఉన్నారు.

సాగుదారు విధిగా హక్కుపత్రాలను పొందాలి

ఇంకొల్లు, ఆగస్టు 5,(ఆంధ్రజ్యోతి) : కౌలుకు పొలం సాగుచేసే రైతులందరూ సాగుదారు హక్కుపత్రాలు తప్పనిసరిగా పొందాలని ఏవో మేరమ్మ అన్నారు. మండలంలోని గంగవరంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పంటకు నష్టం వాటిల్లినప్పుడు సాగుదారు హక్కుపత్రాలు పొందినట్లయితే నష్టపరిహారం పొందవచ్చునన్నారు. పొగాకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న పంటను సాగు చేసుకోవాలని సూచించారు.

కూటమి ప్రభుత్వంలో మాటలకే పరిమితం

● వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్

వాడరేవు(చీరాల), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితమని, ప్రభుత్వంతో ప్రజలకు ఒరిగిందేమీలేదని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జీ కరణం వెంకటేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వాడరేవు గ్రామంలో 'బాబు షూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరాలలో చైన్‌స్నాచింగ్

● మహిళ మెడలో నుంచి అపహరించిన దుండగులు

చీరాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మహిళ మెడలో నుండి ఇరువురు దుండగులు చైన్ అపహరించారు. వేటపాలెం మండలం పాపాయిపాలేనికి చెందిన బాధితురాలు తెల్ల గాంధీబొమ్మ సమీపంలోని బ్రహ్మంగారి గుడికి వచ్చింది. తిరిగి మరో మహిళతో కలిసి నడుచుకుంటూ ప్రధాన కూడలికి వస్తుండగా గుర్తుతెలియని ఇరువురు దుండగులు ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలోని రెండున్నర సవర్ల చైన్ తెంచుకుని పరారయ్యారు. దీంతో బాధితురాలు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించగా వారు విచారిస్తున్నారు.

ఎలుకల మందు తిని తల్లికుమార్తెల ఆత్మహత్యాయత్నం

అద్దంకి, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): కుటుంబసభ్యుల వేధింపులు తాలలేక తల్లి కుమార్తెలు ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తిమ్మాయపాలేనికి చెందిన కొల్లూరి సుబ్బారావు, శ్రావణిలకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. సుబ్బారావుకు ఇద్దరు సోదరులు, సోదరి ఉన్నారు. వీరికి మూడు పోర్షన్ల ఇళ్లు ఉంది. వీటిలో ఒక పోర్షన్‌లో సుబ్బారావు కు టుంబం ఉంటోంది. అయితే సుబ్బారావు తల్లిదండ్రులు వేరే ఇంట్లో అద్దె కు ఉంటున్నారు. ఈ క్రమంలో ఇళ్లు ఖాళీ చేయాలని అత్త,మామలతో పాటు మిగిలిన కుటుంబసభ్యులు తరచూ గొడవ పడుతున్నారు. సోమవారం మరో సారి గొడవ పడడంతో మనస్తాపం చెందిన శ్రావణి, పదవ తరగతి చదువుతున్న తన కుమార్తెతో కలిసి ఎలుకల మందు పేస్ట్‌ను చక్కెరలో కలుపుకొని కూల్ డ్రింక్‌తో కలుపుకొని తల్లీ కుమార్తెలు తాగారు. గమనించిన బంధువులు ఇద్దరిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ లో చేర్పించారు. రిమ్స్ నుండి వచ్చిన సమాచారం మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

అవీ.. ఇవీ..

దేవతామూర్తులకు వెండి కిరీటాల బహూకరణ



పూజలు చేస్తున్న పద్మనాభయ్య దంపతులు

చినగంజాం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలో వేంచేసిన హరిహరసుత అయ్యప్పస్వామి దేవస్థానంలోని దేవతామూర్తులకు వెండి కిరీటాలను దాతలు బహూకరించి పూజలు నిర్వహించారు. సోపిరాల గ్రామానికి చెందిన రైల్వే రిటైర్డ్ టీటీఐ పర్వతరెడ్డి పద్మనాభయ్య కుమారుడు ప్రవాసాంధ్రుడు శ్రీనివాసరావు, ప్రవీణ దంపతులు రూ.4.50లక్షలతో నూతనంగా చేయించిన నాలుగు వెండి కిరీటాలను దేవతామూర్తులకు బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శంకర్‌మిశ్రా దేవస్థానం ప్రాంగణంలో పద్మనాభయ్య, వెంకటసుబ్బమ్మ దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం శ్రీనివాసరావు దంపతులు సమకూర్చిన నూతన వెండి కిరీటాలను పద్మనాభయ్య దంపతులు ఆలయ కమిటీ చైర్మన్ టీఎస్‌ఆర్. ఆంజనేయులుకు అందజేశారు. దేవస్థానంలోని దేవతామూర్తులు అయ్యప్ప స్వామి, విఘ్నేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, మాలికాపురత్తమ్మ అమ్మవార్లను ఆలయ పూజారి విశేషంగా అలంకరించి, దాతలు అందజేసిన వెండి కిరీటాలను అలంకరించి పూజలు జరిపారు. కార్యక్రమంలో దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య పరీక్షలు



చిన్నారులను పరీక్షిస్తున్న వైద్యులు

పర్చూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని వైఆర్ హైస్కూల్‌లో మంగళవారం ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ఉపకరణాల నిమిత్తం అలింకో వైద్యబృందం నేతృత్వంలో ఉచిత వైద్యనిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్యా సమన్వయకర్త మట్టా జ్యోత్స్న హాజరయ్యారు. ఆయా మండలాల నుండి వచ్చిన ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య పరీక్షలు చేపట్టారు. సదరం సర్టిఫికెట్లు ఉండి యూడిఐడీ కార్డ్ లేని వారిని గుర్తించి యూడిఐడి కార్డ్ కూడా రిజిస్ట్రేషన్ చేశారు. అనంతరం క్యాంపుకు హాజరైన ప్రత్యేక అవసరాల పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు భోజన వసతి కల్పించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఏ.శివకోటేశ్వరావు, పి.వెంకట రామయ్య, మొలబంటి వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రియా వర్మ, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అద్దంకిలో వైద్యశిబిరం

సంతమాగులూరు : సమగ్రశిక్ష బాపట్ల వారి ఆధ్వర్యంలో అద్దంకి నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలలో ప్రత్యేక అవసరాలున్న దివ్యాంగ విద్యార్థులకు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు సంతమాగులూరు ఎంఈవోలు వేమవరపు కోటేశ్వరరావు, దార్ల దినేష్ కుమార్‌లు ప్రకటనలో తెలిపారు, అద్దంకిలోని సత్రంబడి, క్యాంపు నిర్వహించనునట్లు చెప్పారు. వైద్య నిధారణ పరీక్షలు అనంతరం అవసరమైన వారికి అలింకో బృందం వారి సౌజన్యంతో ఉచితంగా ఉపకరణాలు అందజేస్తారని పేర్కొన్నారు, శిబిరానికి వచ్చే సమయంలో సదరం సర్టిఫికేట్, ఆధార్ కార్డు, కార్డులతో పాటు పాస్‌పోర్టు ఫోటో తెచ్చుకోవచ్చన్నారు.సదరం సర్టిఫికెట్ లేని వారు కూడా పాల్గొన వచ్చన్నారు. ఇతర సమాచారం కొరకు సన్నిహిత ఉపాధ్యాయులు దిలీప్‌రెడ్డి 6302890867, కోటేశ్వరరావు, 994905482లను ఫోన్ ద్వారా సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి పనులపై నేడు ప్రజా వేదిక

బల్లికురవ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది కాలంలో చేపట్టిన ఉపాధిహామీ పథకం పనులపై గ్రామాలలో సామాజిక తనిఖీ నిర్వహించారు. నేడు మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజా వేదిక గ్రామ సభ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో పాండురంగస్వామి తెలిపారు. ఈ సభలో గ్రామాలలో జరిగిన పనులు వాటికి మంజూరు చేసిన నిధులు వివరాలపై తనిఖీ బృందాలు ప్రజలకు వెల్లడిస్తాయన్నారు. లోపాలు ఉంటే తెలియజేయాలన్నారు.

శక్తియాప్‌పై అవగాహన పెంచుకోవాలి

అద్దంకి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): శక్తియాప్‌పై మరింత అవగాహన పెంచుకోవాలని టీడీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు చుండూరి మురళీసుధాకర్‌రావు అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశ పెట్టను న్న 700 రకాల వాట్సాప్ సేవలను వినియోగించుకోవాలన్నారు.ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా, మహిళలు అరాచక శక్తుల బారిన పడకుండా శక్తి యాప్ ను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ 16వ వార్డు ఇన్‌చార్జ్ యర్రాకుల రామాంజనేయులు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కాలేషావలి, విద్యాసాగర్, భాస్కరరావు, మౌనిక, విజయ, శ్రీనివాసరావు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీపీఐ బృందం



ప్రమాదం జరిగిన గ్రానైట్ క్వారీని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ విల్సన్

బల్లికురవ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీర్లకొండ వద్ద రెండురోజుల క్రితం ప్రమాదం జరిగి ఆరుగురు కూలీలు మృతిచెందిన గ్రానైట్ క్వారీని సీపీఐ బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రభుత్వం మృతుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఆలానే క్వారీలో ఎంత మంది పనులు చేస్తున్నారు అన్న వివరాలను కార్మిక శాఖ వెల్లడించాలన్నారు. కార్మికుల భద్రతకు తగిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం నర్సారావుపేట ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఈ పరిశీలనలో సీపీఐ నేతలు తన్నీరు సింగరకొండ, రాంబాబు, సామ్యేల్, సైదా, పూర్ల చంద్రరావు, నిమ్మల అప్పయ్య తదితరులు ఉన్నారు.

విద్యాబుద్ధులతో చక్కని అవకాశాలు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : బాల్య దశ నుండే విద్యాబుద్దులు అలవరుచుకోవడం వలన చక్కని అవకాశాలు పొందవచ్చని పట్టభద్రుల సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకటసుబ్బారావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సర్వోదయ కాలనీ, మంకినివారిపాలెం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు రాత పుస్తకాలు, పలకలు అందజేశారు. వెనుక బడిన పాఠశాలలను ఎంచుకుని సహకారాలు అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఓం ప్రకాష్, నాగమాంబ, సువర్ణలత, ఆది శేషమ్మ, విజయకుమారి, అనూరాధ విద్యార్థులు పాల్గొన్నారు.

వామ్మో.. వానరాలు

- మూకుమ్మడి దాడులతో బెంబేలు
- ఆందోళనకు గురవుతున్న ప్రజలు



పర్చూరు జయంతివారి వీధిలో వానరాలు

పర్చూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వానరాల సమస్య పర్చూరులో జఠిలంగా మారింది. ఇళ్లలోకి ఎప్పుడు చొరబడతాయోనని మహిళలు ఆందోళనకు గురవుతున్నారు. మరో వైపు వీధుల్లో వెళుతున్న వారిపై విచక్షణా రహితంగా దాడులు చేసి గాయపరుస్తుండడంతో హడలిపోతున్నారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లో ఎటుచూసినా వానరాలు గుంపులే దర్శనమిస్తునాయంటే పరిస్థితి ఎలా



రోడ్డుపై తిరుగుతున్న వానరం

ఉందో అర్ధం చేసుకోవచ్చు. రాత్రి సమయాల్లో సైతం బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉంది.

వానరాలు జట్టులుగా ఇళ్లలోకి దూరి వస్తువులు, పదార్థాలను చెల్లాచెదరు చేస్తున్నాయి. ఇటీవల స్టేట్ బ్యాంక్ వద్దకు నడిచి వస్తున్న ఇద్దరు వ్యక్తులపై కోతులు గుంపులుగా వచ్చి దాడి చేశాయి. దీంతో పరిసరాలలో ఉన్న వారు పెద్ద ఎత్తున వచ్చి వాటిని తరిమి కొట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది గడిచిన నెలరోజుల్లో 20 మందిని పైగా కోతులు దాడిచేసి గాయపరిచాయంటే అతిశయోక్తి కాదు. కోతుల బెడదపై అనేక మార్లు పంచాయితీ అధికారులకు విన్నవించుకున్న పట్టిం చుకోవడం లేదని గ్రామ స్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొండముచ్చుతో సరి

కోతుల బెడదపై కొందరు పంచాయితీ కార్యాలయం వద్దకు ప్రదక్షణలు చేయడంతో కొండముచ్చును తెచ్చి గ్రామంలో కొద్దిసేపు తిప్పి సరిపెడుతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కోతులను పట్టించి ప్రజలను రక్షించాలని కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏబీసీలో వరి సాగుకు అవాంతరాలు

- ఆలస్యంగా ప్రారంభమైన వంతెన పనులు
- కొట్టుకుపోయిన డైవర్షన్
- నీటిని కట్టడిలో అధికారులు విఫలం





అద్దంకి బ్రాంచి కెనాల్‌లో నీరు, పగులగొట్టిన పాత వంతెనలోని కొంతభాగం

అద్దంకి,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ, ఎన్‌ఎస్‌పీ అధికారుల మధ్య సమన్వయ లోపం రైతులకు శాపంగా మారింది. అద్దంకి-బల్లికురవ-సంతమాగులూరు రోడ్డులో ఏబీసీపై వల్లాపల్లి సమీపంలో సుమారు రూ.2 కోట్లతో వంతన నిర్మాణానికి మం త్రి రవికుమార్ నిధులు మంజూరు చేయించారు. అయితే వేసవిలోనే పనులు మొదలు పెట్టాల్సిన కాంట్రాక్టర్, ఆర్‌అండ్‌బీ అధికారులు తీరిగ్గా పక్షంరోజుల క్రితం పనులు ప్రారంభించారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా జూలై నెల చివరలోనే కృష్ణా నది ఎగువ ప్రాంతంలో వరదలతో సాగర్ డ్యామ్ పూర్తిస్థాయిలో నిండింది. దీంతో నీటిని దిగువకు విడుదల చేశారు. అయితే తొలుత అద్దంకి బ్రాంచి కెనాల్‌కు నీటి విడుదల చేయలేదు. ప్రధాన కాలువలో నీటి సామర్థ్యం ఎక్కువగా ఉండడంతో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఏబీసీకి నీటి విడుదల చేశారు. ఈ క్రమంలో 31వ మైలు వద్ద భవనాసి ఎస్కేప్ ఛానల్‌కు నీటి మళ్లించే విధంగా వేసిన అడ్డుకట్ట అంతంత మాత్రంగా ఉండడంతో కొట్టుకుపోయింది. అనంతరం ఏబీసీలో దిగువకు నీటి ప్రవాహం వచ్చింది. దీంతో 33వ మైలు వద్ద బ్రిడ్జి నిర్మిస్తున్న స్థలానికి ఏర్పాటు చేసిన డైవర్షన్ కోతకు గురైంది. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం వంతెన నిర్మాణ పనులకు ఆటకం ఏర్పడింది. దీంతో మరలా వంతెన నిర్మాణ పనులు చేపట్టాలన్న ఉద్దేశ్యంతో మంగళవారం నుంచి ఏబీసీకి నీటి విడుదల పూర్తిగా తగ్గించారు. 500 క్యూసెక్కులు మాత్రమే వదలడంతో పల్నాడు జిల్లా ఆయకట్టు వరకే పరిమితం చేశారు. దీంతో బాపట్ల జిల్లా పరిధిలో ఉన్న ఏబీసీ ఆయకట్టు రైతులు కనీసం మరో నెల రోజుల పాటు సాగుకు ఆగాల్సిన పరిస్థితి నెలకొంది. అకాస్మాత్తుగా నీటి విడుదల చేయడంతో వంతన నిర్మాణ పనులు మొదటికి రాగా, సాగుకు మరో 15 రోజులు పనులు ఆలస్యం అయ్యే పరిస్థితి నెలకొంది. అయితే ఇప్పటికే పలువురు రైతులు బోరు బావుల కింద వరి నారుమడులు పోశారు. సాగునీరు విడుదలైతే వెంటనే నాట్లు వేసేందుకు సిద్ధం అయ్యారు. ప్రస్తుతం నీటి విడుదల ఆలస్యం కావడంతో నారు ముదిరిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు ఈ ఏడాది ముందస్తుగానే సాగునీరు ముందస్తుగానే విడుదల చేస్తుండడంతో వరినాట్లు వేసుకోవచ్చు అనుకున్న రైతులకు నిరాశే మిగిలింది. ఇలా రెండు శాఖల అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య సమన్వయ లోపంతో రైతులకు ఇబ్బందులను తెచ్చిపెట్టింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనులు వేగవంతంగా పూర్తి చేసి సాగు నీటి విడుదల జరిగేలా చర్యలు చేపట్టాలని, డైవర్షన్ పునర్నిర్మించి చేసి రాకపోకలకు వీలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

సీతారామస్వామి దేవస్థానం ట్రస్టీగా రామసుబ్బారావు



ప్రమాణస్వీకారం చేస్తున్న రామసుబ్బారావు

చినగంజాం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు మోటుమర్రి రామసుబ్బారావు స్థానిక పురాతన సీతారామస్వామి దేవస్థానం సింగిల్ ట్రస్టీగా నియమితులయ్యారు. స్థానిక భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలోని కల్యాణ మండపంలో ఒంగోలు డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వేణుగోపాల్, ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావులు రామసుబ్బారావుతో మంగళవారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రామసుబ్బారావు మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి సహకరించిన పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, దేవదాయ శాఖాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భావనారాయణస్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు వలివేటి వెంకట రామానుజం అధ్యక్షతన జరిగిన సభలో టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కొండ్రగుంట శ్రీహరి, టీడీపీ నాయకులు అబ్దుల్ కలాంఅజాద్, టీ.జయరావు, సందు శ్రీనివాసరావు, బెల్లంకొండ రమేష్‌బాబు, భయ్యా సతీష్‌కుమార్, నరహరి శ్రీనివాసరావు, వడ్లమూడి సత్యనారాయణ, పల్లపోలు లక్ష్మినారాయణ, గంటా వెంకట నారాయణ, కోట శివరామకృష్ణ, జి.నరసింహారావు, ఎస్.సూరిబాబు, టి.చిన్నా, నక్కల రవితేజ, షేక్ ఖాదర్‌భాష తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలాలు, గదులకు బహిరంగ వేలం

ఇంకొల్లు, ఆగస్టు 5,(ఆంధ్రజ్యోతి) ఇంకొల్లు పంచాయితీ పరిధిలోని ఖాళీ స్థలాలతో పాటు షాపింగు కాంప్లెక్సు గదులకు ఈ నెల 11న ఉదయం 10 గంటలకు వేటంపాట నిర్వహించ న్నుట్లు పంచాయితీ కార్యదర్శి సుబ్బారెడ్డి,అడ్డగడ్డ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. 2025వ సంవత్సరం ఆగస్టు నుంచి 2027 మార్చి 31వ తేదీ వరకు లీజుకు ఇవ్వడానికి డిప్యూటీ మండల పరిషత్ అధికారి సమక్షంలో వేలంపాట జరుగుతుందన్నారు. పాటలో పాల్గొన దలచిన వారు రూ.1లక్ష విలువ కలిగిన ఆస్థి ధృవీకరణ పత్రంతో పాటు రూ.50,000 డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనవలసిందిగా కోరారు.

పారదర్శకంగా పొదుపు సంఘాల విధివిధానాలు

డీపీఎం సునీత

వేటపాలెం(చీరాల), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల ద్వారా సభ్యులకు అందుతున్న సేవలను పారదర్శకంగా సభ్యులకు తెలియజేయాలని డిపిఎం సునీత అన్నారు. మంగళవారం వేటపాలెం వెలుగు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, వాటి రికవరీపై పలు సూచనలు చేశారు. అలాగే బ్యాంకు లింకేజీ రుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎంలు మధు, అంజిబాబు, సీసీలు బుజ్జి, వేణు, శ్రీను, కవిత, అనూరాధ, విజయలక్ష్మీ, చిన్నయ్య, వీవోఏలు పాల్గొన్నారు.

విద్యుత్ పోరాట చరిత్రను మరువవద్దు

శాసన మండలి మాజీ సభ్యులు జల్లి విల్సన్



చీరాలలో నిరసన తెలియజేస్తున్న వామపక్షాల నాయకులు

అద్దంకిటౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడుకు విద్యుత్ గండం పొంచి ఉందని, 2001 విద్యుత్ పోరాట చరిత్రను మరిచిపోవద్దని శాసన మండలి మాజీ సభ్యులు జల్లి విల్సన్ అన్నారు. మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లుకు వ్యతిరేకంగా స్థానిక బస్టాండ్ కూడలిలో సీఐటీయూ నాయకులు అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాలనే కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లును పగలగొట్టమని పిలుపునిచ్చి నేడు భిన్నంగా వ్యహరించడం దుర్మార్గమన్నారు. నరేంద్ర మోడీ అండతో అదాని దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలను దోచుకునే విధంగా విద్యుత్ సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలు మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కేఎల్‌డీ ప్రసాద్, ఖాదర్‌బాషా, సీఐటీయూ నాయకులు తిరుపతిరెడ్డి, బి.విజయ్‌కుమార్, కరీమ్, ఆదాం, నాగేశ్వరరావు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, శామ్యూలు పాల్గొన్నారు.

మార్టూరు : స్మార్ట్‌మీటరు బిగింపును నిలిపివేయాలని, ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని, సెకి ఒప్పందాన్ని రద్దుచేయాలని కోరుతూ మంగళవారం ఉదయం మార్టూరులో విద్యుత్ డీఈఈ కార్యాలయం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రైతుసంఘం నాయకులు ధర్నా చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు బత్తుల హనుమంతరావు, కందిమళ్ల రామకోటేశ్వరరావు, వీరవల్లి కృష్ణమూర్తి, పాలెపు సాంబయ్య, మోహనరావు, సూరిబాబు, రాంబాబు పాల్గొన్నారు.

పర్చూరు : స్మార్ట్‌మీటర్లను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని, ప్రజలకు విద్యుత్ భారం తగ్గించాలని బాపట్ల జిల్లా కౌలు రైతు సంఘం ఉపాధ్యాక్షులు బండి శంకరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా వేదిక పిలుపు మేరకు స్థానిక విద్యుత్ కార్యాలయం మందు సీపీఎం, కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి కొండయ్య, మత్తే డేవిడ్, చిన్నదాను, మక్కెన వెంకనన, జక్కరయ్య, చిమటా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంకొల్లు : స్మార్ట్‌మీటర్లు బిగించవద్దని సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డీటీ లక్ష్మీకుమారికి ఆ పార్టీ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు, మాదాల అంజయ్య, భానుప్రసాద్ పాల్గొన్నారు.

చీరాల : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లు ప్రజల సొమ్మును నిలువున దోచుకుని కార్పొరేట్లకు దోచిపెడుతోందని వామపక్షాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు మంగళవారం విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు ఎస్.బాబురావు, బత్తుల శామ్యూల్, ఊటుకూరి వెంకటేశ్వర్లు, వసంతరావు, భగవాన్‌దాస్, కిరణ్, గోసాల ఆశీ ర్వాదం, మాచర్ల మోహన్‌రావు, ధర్మ, చుండూరి వాసు, మార్క్, శేషయ్య, సైదయ్య, ప్రకాష్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న పద్మావతి

బల్లికురవ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వశక్తితో జీవనం సాగించేందుకు ప్రభుత్వం కుట్టుమిషన్ శిక్షణ ఇస్తోందని, చీరాల డివిజన్ డిఎల్‌డీవో పద్మావతి అన్నారు. మంగళవారం బల్లికురవ మండల కేంద్రంలో ప్రభుత్వం తీసుకొచ్చిన వాట్సాప్ గవర్నెన్స్‌పై 'హర్ గర్ తిరంగా'పై ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎల్‌డీవో కుట్టు మిషన్ శిక్షణను తనిఖీ చేశారు. మూడుమాసాల పాటు ఇచ్చే శిక్షణ ప్రతి ఒక్కరికి ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పాండురంగస్వామి, సొసైటీ అధ్యక్షులు గొట్టిపాటి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భూసావారిపాలెం పాఠశాల మూత



విద్యార్థులు లేకపోవడంతో మూతపడిన భూసావారిపాలెం ప్రాథమిక పాఠశాల

బల్లికురవ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తేశ్వరం పంచాయతీ శివారు గ్రామమైన భూసావారి పాలెం ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు ఎవరు రాకపోవడంతో మూతపడింది. గతేడాది ముగ్గురు విద్యార్థులతో పనిచేసిన పాఠశాలకు ఈ ఏడాది మాత్రం ఒక్క విద్యార్థే ఉన్నారు. ఉన్న విద్యార్థి కూడా పాఠశాలకు రాకపోవడంతో పూర్తిగా తాళాలు పడ్డాయి. ఈ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ప్రసూతి సెలవులో వెళ్లడంతో ఎంఈవో కార్యాలయం నుంచి ఒక ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై పాఠశాలకు పంపించారు. విద్యార్థులు మాత్రం ఎవరు పాఠశాలకు రావటం లేదు. గ్రామంలో ఉన్న విద్యార్థులందరూ ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్నారు. విద్యాశాఖ అధికారులు పలుమార్లు అవగాహన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ, విద్యార్థులు లేకపోవడంతో పాఠశాలను మూసివేశారు. ఈ విషయమై ఎంఈవో రమేష్‌ను వివరణ కోరగా విద్యార్థులు పాఠశాలకు వస్తే తిరిగి పాఠశాలను తెరిపిస్తామన్నారు.

పత్తి పైరు బీమాకు అవకాశం

యద్దనపూడి,(మార్టూరు)ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): ప్రత్తి పైరుకు బీమా చేసేందుకు ఈ నెల 14వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు ఏవో కుమారి అన్నారు. మంగళవారం యద్దనపూడి మండలంలోని పోలూరు, శ్యామలవారి పాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో కుమారి రైతులతో మాట్లాడారు. అదేవిధంగా అన్నదాత సుఖీభవ పథకంలో ఆధార్ తప్పుగా లింక్ అవ్వడం వలన డబ్బులు జమ కానివారు, చనిపోయిన రైతుల పేరుతో పొలం ఉండి, రిజెక్ట్ చేయబడిన వారు,"సంబంధిత వీఆర్‌వోలను కలిసి సరిచేయించుకోవాలన్నారు. తర్వాత వ్యవసాయ శాఖ సిబ్బంది వద్ద గ్రీవెన్స్ లో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ లక్ష్మి, పలువురు రైతులు పాల్గొన్నారు.

9న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అద్దంకిటౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):అద్దంకి మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 9వ తేదిన ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షురాలి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య ఒ క ప్రకటన ద్వారా తెలిపారు. సమావేశానికి అందరు సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలన్నారు.

ప్రతి రైతు వద్ద పొగాకు కొనుగోలు చేయాలి

యద్దనపూడి,(మార్టూరు) ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రతి రైతు పొగాకును కొనుగోలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు అధికారులను కోరారు. మంగళవారం యద్దనపూడి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ పులగం రజని అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పలు గ్రామాలకు చెందిన పొగాకు కొనుగోలుపై ఆయా గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు సభదృష్టికి తీసుకురాగా, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన కృషి కారణంగా, మార్క్‌ఫెడ్ వారు ప్రతి రైతు దగ్గర ఉన్న పొగాకును కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారని ఏవో కుమారి సభకు తెలిపారు. అదే విధంగా యద్దనపూడి నుండి మార్టూరు వరకు, వింజనంపాడు నుండి చిలకలూరిపేట వరకు ఆర్టీసీ బస్సు నడిపేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆ యా గ్రామాల ప్రజా ప్రతినిధులు సభలో కోరారు. అంతేగాకుండా పలు గ్రామాలలో కరెంటు తీగలు కిందకు వేలాడుతున్నాయని తరచుగా విద్యుత్‌కు అంతరాయం కలుగుతున్నదని సభదృష్టికి తీసుకువచ్చారు. గతంలో ఇచ్చిన కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న గృహనిర్మాణాలను వేగవంతంగా చేసేందుకు ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అవగాహన కలిగించాని హౌసింగ్ ఏఈ రమణనాయక్ సభలో కోరారు. గ్రామాలలో అంగనవాడీ కేంద్రాల తీరుపై సమస్యలు ఉంటే తెలియచేయాలని సీడీపీవో సుభద్ర తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో ఎంపీడీవో ఎండీఏ జావెద్, తహసీల్దార్ కె రవికుమార్, డాక్టరు శ్రీహర్ష, వెలుగు ఏపీఎం వెంకటరావు, ఏపీఎం రమేష్, ఎంఈవో చిలుకూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

రుణాల రికవరీలో ఇంకొల్లు సొసైటీకి మొదటి స్థానం

ఇంకొల్లు, ఆగస్టు 5, (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాల ద్వారా ఇచ్చిన రుణాలను తిరిగి వసూలు చేయడంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇంకొల్లు సొసైటీ మొదటి స్థానంలో నిలిచింది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదగా ఇంకొల్లు సొసైటీ చైర్మన్ కరి శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు. పాత ప్రకాశం జిల్లాలో ఇంకొల్లు సొసైటీ పరిధిలో ఇచ్చిన రుణాలు ఎక్కువ మొత్తంలో రికవరీ చేయడంపై సొసైటీ అధికారులను ఆయన ప్రత్యేకంగా అభినందించినట్లు చైర్మన్ కరి శ్రీనివాసరావు తెలిపారు. రుణాల రికవరీలో ఇంకొల్లు సొసైటీని ఆదర్శంగా తీసుకొని రుణాల రికవరీని వేగవంతం చేయాలని మంత్రి అచ్చం నాయుడు అన్నారన్నారు.

ఆటలతో మానసిక ఉల్లాసం



లాంగ్ జంప్ దూకుతున్న విద్యార్థులు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి ధశ నుండే ఆటల్లో పాల్గొనడం వలన మానసికంగా ధైర్యంగా ఉంటారని, లక్ష్యాలపై దృష్టి పెరుగుతుందని వేటపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయినీ సరోజని అన్నారు. మంగళవారం పాఠశాలలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు జూనియర్స్ సీనియర్స్ విభాగాల్లో లాంగ్ జంప్, షాట్‌పుట్, స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్స్ డ్రాయింగ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే డ్రాయింగ్‌లో స్వాతంత్ర్య సమర యోధులు అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్రబోస్, ఝాన్సీల లక్ష్మీబాయి, మహాత్మా గాంధీజీ వంటి చిత్రాలతో అలరించారు. విజేతలకు ఆగస్టు 15 వేడుకల్లో బహుమతులు అందజేయ నున్నట్లు వివరించారు. పోటీలను పాఠశాల ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.



'సోమశిల'కు 14,105 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం 14,105 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. దీంతో డ్యాం నీటి మట్టం 36.230 టీఎంసీలకు చేరుకొంది. ఉత్తర కాలువకు 370, వరద కాలువకు 4,000, డెల్టాకు 3,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

రికవరీ!

- ఎస్సీ కార్పొరేషన్‌లో వసూలుకాని బకాయిలు
- సుమారు రూ.28 కోట్లకుపైమాటే
- పదేళ్లు గడుస్తున్నా అధికారుల్లో కానరాని చలనం





షెడ్యూలు కులాలకు చెందిన యువతకు (ఎస్సీ) ఉపాధి కల్పించడమే లక్ష్యంగా 2014-19 మధ్య కాలంలో అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం వాహనాలు, వాణిజ్య దుకాణాల ఏర్పాటుకు రుణాలు అందజేసింది. ఇందుకు 35 నుంచి 50 శాతం వరకు సబ్సిడీ కూడా ఇచ్చింది. కానీ నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా రుణ రికవరీ మాత్రం కావడం లేదు. ఇప్పటివరకు సుమారు 28.66 కోట్ల రూపాయలు వసూలు కావాల్సి ఉంది. ఇంత భారీ మొత్తంలో బకాయిలు ఉన్నా ఎస్సీ కార్పొరేషన్ అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. అంతేగాక వారు వ్యవహరిస్తున్న తీరు కూడా విమర్శలకు తావిస్తోంది.



నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే మరికొంత మంది లబ్ధిదారులకు కొత్త రుణాలు ఇవ్వొచ్చు. వారి ఎదుగుదలకు కూడా ఊతం ఇచ్చినట్టు అవుతుంది. కానీ, ఎస్సీ కార్పొరేషన్‌లో మాత్రం ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. 2014-19 మధ్య తెలుగుదేశం పార్టీ హయాంలో మంజూరు చేసిన సబ్సిడీ రుణాలను రికవరీ చేయటంలో అధికారులు కాలయాపన చేస్తున్నారు. ఎస్సీలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి గతంలో టీడీపీ ప్రభుత్వం విరివిగా సబ్సిడీ రుణాలను మంజూరు చేసింది. వివిధ రంగాల్లో అనుభవం ఉన్నవారికి వారు కోరుకున్న యూనిట్లను మంజూరు చేసింది. ఇందులో లబ్ధిదారు మహిళ అయితే 50 శాతం, పురుషుడైతే 35 శాతం రాయితీ ఇచ్చారు. కానీ తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించడంలో జాప్యం చేస్తున్నారు.

- తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2015-16 నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరాల మధ్య ఎన్ఎస్ఎఫ్‌డీసీ (ట్రాన్స్‌పోర్టు) పథకం కింద 79 మందికి రూ.9.16 కోట్ల విలువైన ఇన్నోవా కార్లను, మరో 70 మందికి రూ.3.84 కోట్ల విలువైన ఎతియాస్ కార్లను అందజేసింది. అదే విధంగా ఇతర వాహనాల కింద ఒక జేసీబీకి రూ.30లక్షలు, ఈ-ఆటోలు తదితర 39 వాహనాలకు రూ.2.21 కోట్లను రుణాలుగా అందచేసింది. ఎన్ఎస్ఎఫ్‌డీసీ (నాన్ ట్రాన్స్‌పోర్టు-సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంటు) కింద ఇటుకల తయారీ, మినీ డెయిరీ, కిరాణా షాపులు తదితరాలు పెట్టుకోవడానికి 615 మందికి రూ.10.44 కోట్లు రుణాలుగా అందచేసింది. భూమి కొనుగోలు పథకం కింద 118 మంది లబ్ధిదారులకు రూ.2.55 కోట్ల సబ్సిడీ రుణాలను అప్పట్లో అఅఇకారులు పంపిణీ చేశారు. ఇలా ఎన్ఎస్ఎఫ్‌డీసీ కింద మొత్తం 921 యూనిట్లకు రూ.28.22 కోట్లను సబ్సిడీ రుణాలుగా అందచేసింది. ఈ రుణాలకు సంబంధించి ఇప్పటివరకు లబ్ధిదారుల నుంచి రూ. 5.33 కోట్లను మాత్రమే ఎస్సీ కార్పొరేషన్ అధికారులు రాబట్టగలిగారు. ఇంకా రూ.22.88 కోట్లు రికవరీ చేయాల్సి ఉంది.

- అదేవిధంగా ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ (ట్రాన్స్‌పోర్టు) పథకం కింద రెండు ఇన్నోవా కార్లకు రూ.24.9 లక్షలు, ఒక ఎతియాస్ కారుకు రూ.6.12 లక్షలు, 14 ట్రాక్టర్లు-ట్రాలీలకు రూ. 69.2 లక్షలు, 99 ఈ-ఆటోలకు రూ.84.11 లక్షలు, 18 ఎండీసీఎంఎస్‌లకు రూ. 1.97 కోట్లు రుణాలుగా అందచేశారు. ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ (నాన్-ట్రాన్స్‌పోర్టు-సెల్ఫ్ ఎంప్లాయిమెంటు) పథకం కింద 256 మందికి రూ.2.33 కోట్లు రుణాలుగా ఇచ్చారు. ఈ పథకం కింద మొత్తం 390 యూనిట్లకు గాను రూ.6.15 కోట్లు అందచేశారు. ఈ మొత్తంలో కేవలం రూ.36.99 లక్షలను మాత్రమే రాబట్ట గలిగారు. ఇంకా రూ.5.78 కోట్లు రికవరీ చేయాల్సి ఉంది. మొత్తంగా ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాల కింద ఇంకా రూ. 28.66 కోట్లను లబ్ధిదారుల నుంచి రాబట్టాల్సి ఉంది.

ఉద్యోగుల ష్యూరిటీ ఉన్నా...

ఇన్నోవా, ఎతియాస్, జేసీబీ వాహనాలను తీసుకునే సమయంలో లబ్ధిదారులకు కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ష్యూరిటీ ఇచ్చారు. మరి కొందరు తమ ఇంటి, భూముల పత్రాలను ష్యూరిటీ కింద ఎస్సీ కార్పొరేషన్ అధికారులకు అందజేశారు. ఇంత ఉన్నా రుణాలు తిరిగి చెల్లించని లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వకపోవడంపై ఎస్సీ కార్పొరేషన్ అధికారుల మెతకవైఖరి ఏమిటో అంతు పట్టడం లేదు.



నోటీసులు ఇస్తున్నాం

2015-16 నుంచి 2019 వరకు కార్లు, జేసీబీలు తదితరాలు తీసుకున్న లబ్ధిదారులు రుణానికి సంబంధించి నెలవారీ చెల్లింపులు చేయటం లేదు. వారికి ష్యూరిటీ ఇచ్చిన ఉద్యోగుల జీతాల నుంచి రికవరీ చేస్తామని చెబుతున్నాం. చివరి ప్రయత్నంగా లబ్ధిదారులకు నోటీసులు ఇస్తున్నాం. అయినా వారు స్పందించకపోతే ఆర్ఆర్ యాక్ట్‌ను ప్రయోగించి రుణాలు రికవరీ చేస్తాం. రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లిస్తే మరికొంత మంది కొత్త వారికి రుణాలు అందచేసే అవకాశం ఉంటుంది.

- ఈ. కిరణ్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎస్సీ కార్పొరేషన్

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న ప్రభుత్వం తాజాగా దూర ప్రాంతాల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు రవాణాభత్యం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది.

విద్యార్థులకు రవాణా భత్యం

- 10,396 మంది... రూ.62.37 లక్షలు
- ఒక్కొక్కరికి నెలకు రూ.600 చెల్లింపు
- త్వరలో తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ

నెల్లూరు(విద్య), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల నివాసం కిలోమీటరు కంటే ఎక్కువ దూరం ఉన్న 1 నుంచి 5వ తరగతి పిల్లలు, 3 కి.మీ కంటే ఎక్కువ దూరంలో ఉన్న 6, 7, 8 తరగతుల విద్యార్థులకు రవాణా భత్యం ఇచ్చేలా జాబితాను సిద్ధం చేశారు. గతంలో ఇదే నగదును ఏడాదికి ఒకసారి చెల్లిస్తున్న తరుణంలో విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న ఫిర్యాదులతో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి నగదు చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. పాఠశాలలు దూరంగా ఉన్నచోట పిల్లలు అత్యధికంగా ఆటోల్లో ప్రయాణించడం, మరికొంత మందిని వారి తల్లిదండ్రులు తమ వాహనాల్లో విడిచిపెట్టడం చేస్తున్నా వీటికి అయ్యే ఖర్చులు భారంగా ఉండటంతోపాటు ప్రమాదాల భయం కూడా వెంటాడుతోంది. ఈ సమస్యలకు పరిష్కారంగా విద్యార్థులు సురక్షితంగా పాఠశాలలకు చేరుకోవాలన్న ఉద్దేశంతో రవాణా భత్యం అందించనున్నారు.



జిల్లాలో 10,396 మంది విద్యార్థులు

జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన సర్వే ప్రకారం 404 ప్రభుత్వ పాఠశాలల్లో 10,396 మంది విద్యార్థులను అధికారులు గుర్తించారు. వీరిలో ఒక్కో విద్యార్థికి నెలకు రూ.600 చొప్పున మూడు నెలలకు రూ.1800 చెల్లించనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య తెలిపారు. మొత్తం 10,396 మంది విద్యార్థులకు రూ.62,37,600 నగదు విడుదల కానుందని, ఈ నగదుకు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. అలాగే జరిగిన సర్వేను కూడా మరోసారి స్పష్టంగా చేయాలని ఆదేశాలిచ్చామని, దీనివల్ల విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.



ఉదయగిరి - నందవరం రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు

రోడ్ల మరమ్మతులకు నిధులు

- మూడు కీలక రహదారులకు రూ.14.5 కోట్లు
- రోడ్ల మెయింటెనెన్స్‌కు మరో రూ.4 కోట్లు
- టెండర్లు ఆహ్వానించిన ఆర్అండ్‌బీ శాఖ

నెల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కీలకమైన రహదారుల అభివృద్ధికి అడుగులు ముందుకుపడ్డాయి. మూడు ప్రధాన కనెక్టివిటీ రోడ్లను బాగు చేసేందుకు రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ (ఏపీఆర్‌డీసీ) ద్వారా నిధులు మంజూరయ్యాయి. మొత్తం మూడు రోడ్లకు కలిపి రూ.14.50 కోట్లు ఇచ్చారు. మనుబోలు - పొదలకూరు రోడ్డు, ఉదయగిరి - నందవరం రోడ్డు, సంగం-విరువూరు-కలువాయి రోడ్డు ఈ జాబితాలో ఉన్నాయి. మనుబోలు-పొదలకూరు రోడ్డుకు సంబంధించి సున్నా నుంచి పదో కిలోమీటర్ వరకూ బాగు చేసేందుకు రూ.3.50 కోట్లు, ఉదయగిరి - నందవరం రోడ్డుకు 16 నుంచి 29వ కిలోమీటర్ మధ్య బాగు చేసేందుకు రూ.2.50 కోట్లు, సంగం-విరువూరు-కలువాయి రోడ్డుకు సంబంధించి 26 నుంచి 46 కిలోమీటర్ల మధ్య ఇంప్రూమెంట్ చేసేందుకు రూ.8.5 కోట్లు మంజూరు చేశారు. మొత్తంగా 42 కిలోమీటర్ల మేర ఈ రహదారులను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఆర్అండ్‌బీ అధికారులు టెండర్లు ఆహ్వానించారు. ఈ 18వ తేదీతో టెండర్ల గడువు ముగుస్తుండగా, ఆ తర్వాత పనులు ప్రారంభం కానున్నాయి. కాగా కొన్ని ప్రధాన రోడ్ల మెయింటెనెన్స్ కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆర్అండ్‌బీ శాఖ నెల్లూరు, కావలి డివిజన్ల పరిధిలో మెయింటెనెన్స్‌కు రూ.4 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులను సెక్షన్ల వారీగా మొత్తం 29 ప్యాకేజీలుగా విభజించి అధికారులు టెండర్లు పిలిచారు.

పోలీసు నిఘాలో వరికుంటపాడు

- నివాసాల్లోనే ఆందోళనకారులు 8లో..

చూసి కొనండి సార్!

పొగాకు రైతుల వేడుకోలు • నాణ్యత లేదనే సాకుతో బేళ్ల వెనక్కు...

- వివరాలు 8లో..

రేపటి నుంచి క్రీడాపోటీలు

- డీఎస్‌డీవో యతిరాజ్

నెల్లూరు(విద్య), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఈ నెల 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో క్రీడా పోటీలు నిర్వహించ నున్నట్లు డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తొలుత జిల్లాస్థాయిలో గురువారం అథ్లెటిక్స్, ఆర్చరీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, కబడ్డీ, 8వతేదీన బాస్కెట్‌బాల్, హాకీ, ఖోఖో, వాలీబాల్, 9వతేదీన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని తెలిపారు. 22 ఏళ్లలోపు వయసు కలిగిన క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలు, టెన్త్ మార్కుల జాబితా, ఆధార్‌కార్డును సమర్పించి పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు సంబంధిత తేదీల్లో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉదయం 7 గంటలకు హాజరు కావాలని కోరారు. జిల్లా స్థాయిలో రాణించిన వారితో జట్లను ఎంపిక చేస్తామని, వారికి ఈనెల 11 నుంచి 14వతేదీ వరకు గుంటూరులో జోనల్‌స్థాయి క్రీడాపోటీలు జరుగుతాయని తెలిపారు. జోనల్‌లో ప్రథమ స్థానం సాధించిన క్రీడా జట్లు ఈనెల 16 నుంచి 20వతేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. జోనల్, రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు శాప్ పూర్తి ఖర్చులు భరించి పోటీలకు పంపిస్తుందని వివరించారు.

'కామరాజ్' కుటుంబానికి


రూ.1.29 కోట్లు!

- పరిహారాన్ని డిపాజిట్ చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల
- హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం నిర్ణయం
- ప్రమాదానికి కాంట్రాక్టరే బాధ్యుడని ఇంజనీర్ల నివేదిక
- కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేసేందుకు సిఫార్సు
- 2016లో రోడ్డు ప్రమాదంలో మరణించిన టీచర్ కామరాజ్

నెల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు ఆర్అండ్‌బీ అధికారులు దిగొచ్చారు. రోడ్డు ప్రమాదంలో టీచర్ కామరాజ్ మరణించిన కేసులో కోర్టు ఆదేశాలను అమలు చేసేందుకు ఉపక్రమించారు. ఎన్నో మలుపులు తిరిగిన ఈ పరిహారం కేసు ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. కామరాజ్ కుటుంబానికి రూ.1.29 కోట్లు పరిహారంగా ఇవ్వాలని జిల్లా కోర్టు తీర్పు ఇవ్వగా దీనిపై ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ వేసింది. అయితే జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పులోని 50 శాతం పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేస్తే తదుపరి వాదనలు వింటామని హైకోర్టు స్పష్టం చేసింది. ఎనిమిది వారాల్లోపు ఈ మొత్తాన్ని జమ చేయాలని ఈ ఏడాది జనవరిలో ఆదేశించినా ఆర్అండ్‌బీ శాఖ జమ చేయలేదు. ఈలోపు జిల్లా కలెక్టరేట్ ఆస్తులను అటాచ్‌మెంట్‌కు కోర్టు ఆదేశాలివ్వడంతో ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలకు పూనుకున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు రూ.1.29 కోట్ల పరిహారంలో 50 శాతాన్ని నెల్లూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ వద్ద డిపాజిట్ చేస్తూ తాజాగా జీవో విడుదల చేశారు. అదే సమయంలో కోర్టు తీర్పుల నేపథ్యంలో ఆర్అండ్‌బీ శాఖలో తీవ్ర చర్చే జరిగింది. అనేక విచారణలు జరిగాయి. వర్క్ అగ్రిమెంట్ ప్రకారం వర్క్ జరుగుతున్న సమయం లో ఎటువంటి నష్టం జరిగినా అందుకు కాంట్రాక్టరే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఇంజనీర్లు స్పష్టం చేశారు. పరిహారం అమౌంట్‌ను కాంట్రాక్టర్ నుంచే రికవరీ చేయాలం టూ ఇంజనీర్లు ప్రభుత్వానికి నివేదించారు.

ఇదీ నేపథ్యం..

2016, మే 27వ తేదీన రామతీర్థం పాఠశాలలో పీఈటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దాసరి కామరాజ్ రాత్రి 11 గంటల ప్రాంతంలో నెల్లూరు నుంచి బైక్‌పై తిరిగి స్వగ్రామమైన విడవలూరు మండలం వావిళ్లకు వెళుతున్నారు. కొడవలూరు మండలం గుండాలమ్మపాలెం వద్ద ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం గుంతలు తీశారు. ఈ గుంతలను గమనించలేకపోయిన కామరాజ్ బైక్‌పై అక్కడ ప్రమాదానికి గురై మరణించారు. దీనిపై కొడవలూరు పోలీసు స్టేషన్‌లో 42/2016 క్రైం నంబర్‌తో కేసు నమోదైంది. కాగా కామరాజ్ కుటుంబం మొత్తం ఆయన జీతంపైనే ఆధారపడి జీవిస్తోంది. దీంతో వీరంతా పరిహారం కోసం జిల్లా కోర్టును ఆశ్రయించారు. కాంట్రాక్టర్లయిన పైడాల తిరుపతిరెడ్డి, యేగు పెంచలయ్య, ఆర్అండ్‌బీ ఎస్ఈ, ఈఈ, ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్లను పార్టీలుగా చేరుస్తూ సూట్ వేశారు. కామరాజ్ ఉపాధ్యాయుడని, ఆయనకు ఇంకా 12 సంవత్సరాల సర్వీసు ఉందని, ఆయన జీతం, బెనిఫిట్స్ మొత్తం లెక్కించి రూ.90 లక్షలు పరిహారంగా ఇప్పించాలని కోర్టును అభ్యర్థించారు. మూడో జిల్లా అదనపు న్యాయస్థానంలో ఐదేళ్ల పాటు విచారణ జరిగిన ఈ కేసులో కామరాజ్ కుటుంబ సభ్యులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. రూ.81.25 లక్షలను బాధిత కుటుంబానికి పరిహారం కింద వడ్డీతో సహా చెల్లించాల్సిందిగా ఆర్అండ్‌బీ అధికారులను కోర్టు ఆదేశించింది. వడ్డీ మొత్తాన్ని లెక్కించగా రూ.1.29 కోట్లుగా తేలింది.



సమస్యల తంటా...

అంగన్‌వాడీల పోరుబాట!

- వేతనం పెంచి, కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలని డిమాండ్
- సీడీపీవో కార్యాలయాలకు పాత సెల్‌ఫోన్లు



నెల్లూరు : మూటకట్టిన సెల్‌ఫోన్లు



ఉదయగిరిలో సెల్‌ఫోన్లను చేతబట్టుకుని ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పుతూ బాలింతలకు, గర్భిణులకు పోషకాహారాన్ని అందించే అంగన్‌వాడీలు పోరుబాట పట్టారు. వేతనాలు పెంచకుండా, అనేక యాప్‌లను ప్రవేశపెట్టి మొరాయిస్తున్న సెల్‌ఫోన్ల ద్వారా అధికారులు ఒత్తిడి తేవటంతో తిరగబడ్డారు. ఈ సమస్యలపై పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో ప్రత్యక్ష పోరాటానికి దిగారు. తమ వద్ద నున్న ఫోన్లను గుట్టలుగా పోసి, వాటిని మూటగట్టి సీడీపీఓలకు ఇవ్వబోగా వారు నిరాకరించారు. దీంతో వాటిని సీడీపీవోల కార్యాలయాల్లో ఉంచి ఫొటోలు తీసుకుని వచ్చారు.

యాప్‌లతో పనిభారం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషణ ట్రాకర్ యాప్, బాల సంజీవని యాప్‌లను ప్రవేశపెట్టాయి. ముఖ హాజరు ద్వారా సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టాయి. ఈ యాప్‌ల వినియోగానికి సంబంధించి అంగన్‌వాడీలకు కనీసం శిక్షణ కూడా ఇవ్వలేదు. ఫోన్లనూ సరఫరా చేయలేదు. పోషణ కిట్‌లను పంపిణీ చేయడానికి ఆధార్‌లో పేర్కొన్న ఫోన్ నెంబరుకు ఓటీపీ వస్తుంది. చాలా మంది గర్భిణులు, బాలింతలు ఆధార్‌లో ఒక నంబరు ఇచ్చి, మరో నంబరును ఫోనుగా వినియోగిస్తున్నారు. ఓటీపీ చెబితేనే వారికి సరుకులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. అధికారుల అధికారుల ఒత్తిళ్లతోపాటు లబ్ధిదారులు సరుకుల కోసం వచ్చినప్పుడు ఫోన్లు పనిచేయక పోవటం, నెట్ సిగ్నల్ లేకపోవటం, సర్వర్లు పనిచేయకపోవటంతో వారు విసిగిపోతున్నారు.

జీతాలు పెంచి... కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలి

తమకు పక్క రాష్ట్రం తెలంగాణలో ఇస్తున్నట్లు రూ. 18వేల వేతనాన్ని ఇవ్వాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు. కొత్తగా జీబీ ఎక్కువగా ఉండే ట్యాబ్‌లను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ట్యాబ్‌లు తిరిగి తీసుకోం

జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్లు తమ వద్ద వున్న ట్యాబ్‌లను సీడీపీఓ కార్యాలయాలకు చేర్చారు. వారు తీసుకోకపోవటంతో ఆ కార్యాలయ గదుల్లో ఉంచి ఫొటోలు తీసుకుని వచ్చాం. వేతనం రూ.18 వేలకు పెంచి, కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలి.

- సుజాత, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు

చెరువులో చేపల వేటకు అనుమతి తీసుకోవాలి

కొండాపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట చెరువులో చేపలు పట్టుకునేందుకు గడువు పూర్తయినందున మత్స్యకార సొసైటీ అనుమతి తీసుకోవాలని మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసరాజు తెలిపారు. మంగళవారం సొసైటీ చైర్మన్ కనకయ్య సొసైటీ సభ్యుల సహకారంతో చేపలు పట్టి విక్రయించేందుకు సిద్ధమవ్వగా 127 మంది సభ్యులున్న సొసైటీలోని ముగ్గురు వ్యక్తులు సొసైటీలో అక్రమాలు జరుగుతున్నాయని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు చెరువు వద్దకు వచ్చి సభ్యులను విచారించారు. చేపలు పట్టుకునేందుకు జూన్ నెలాఖరుకు గడువు పూర్తయిందని అధికారులు తెలియచేయగా చెరువులో నీరు ఎక్కువగా ఉండటంతో చేపలు పట్టలేకపోయామని చైర్మన్ వారికి తెలియచేశారు. మత్స్యకారశాఖ అధికారుల అనుమతి తీసుకొని చేపలు పట్టుకోవాలన్నారు.

‘రాళ్లపాడు’ కట్టలకు మహర్దశ!


రాళ్లపాడు కుడి కాలువ కట్టపై వేసిన గ్రావెల్

- 20 ఏళ్ల తర్వాత అభివృద్ధి
- బ్రాంచి కాలువల పనులూ పూర్తి
- ఆనందంలో రైతాంగం

లింగసముద్రం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : రెండు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని రాళ్లపాడు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలు, బ్రాంచి కాలువల కట్టలపై రోడ్డు అభివృద్ధి పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. దీంతో ప్రాజెక్టు ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 20 ఏళ్ల నుంచి ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలు, బ్రాంచి కాలువల కట్టలపై పిచ్చి మొక్కలు, చిల్లచెట్లు ఏపుగా పెరిగి మనిషి తిరగలేని విధంగా మూసుకుపోయాయి. దీనికి తోడు కట్టలపై అడుగడుగున గుంతలు, మిట్టలతో తయారవడంతో ఈ కట్టలపై ట్రాక్టర్లతో పొలాలకు వెళ్లి వ్యవసాయ పనులు చేసుకొనేందుకు, పంట ఉత్పత్తులను ఇంటికి తెచ్చుకొనేందుకు రైతులు నానా అగచాట్లు పడేవారు. అలాగే ప్రాజెక్టు వద్ద జరిగే సమావేశాలకు, పొలాలకు నీటి సరఫరాను పర్యవేక్షణకు కార్లు, ఇతర వాహనాలలో ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది, రైతులు రాకపోకలు సాగించేందుకు కూడా అనేక ఇబ్బందులు పడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయకట్టు కమిటీ ప్రతినిధులు, రైతులు ఈ కాలువల కట్టల రోడ్ల పరిస్థితిని, ప్రాజెక్టులోని ఇతర సమస్యలను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లడంతో ప్రాజెక్టులోని సమస్యల పరిష్కారానికి ఆయన అధికారులతో చర్చించారు. యుద్ధప్రాతిపదికన రూ.3 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేయించి ప్రభుత్వానికి పంపించారు. దీంతో ప్రభుత్వం కాలువల కట్టలపై రోడ్ల అభివృద్ధికి రూ.75 లక్షలు మంజూరు చేసింది. దీంతో అధికారులు ఈ పనులను మూడు వారాల క్రితం కాంట్రాక్టర్లకు అప్పగించి పనులు ప్రారంభింపచేశారు. చేపట్టిన పనులు శరవేగంగా చేసి వారం రోజుల క్రితం పూర్తి చేయించారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.75 లక్షలతో సుమారు 21 కి.మీ పొడవున ఉన్న ప్రాజెక్టు కుడి కాలువ కట్ట రోడ్డుతో పాటు వెంకటపేట, జంగాలపల్లి, సీతారాంపురం బ్రాంచి కాలువల కట్టల రోడ్ల అభివృద్ధి పనులను రూ.67.10 లక్షలతో పూర్తి చేశారు. అలాగే 3 కి.మీ పొడవున ఉన్న ఎడమ కాలువ కట్ట రోడ్డును కూడా కట్ట రోడ్డు బాగులేని దగ్గర రూ.5.20 లక్షలతో అభివృద్ధి చేశారు. ఇక మిగిలిన రూ.2.70 లక్షలతో ప్రాజెక్టు కట్టకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను తొలగించేందుకు కేటయించారు. అయితే ఈ చిల్లచెట్లను తొలగించేందుకు గుత్తేదారులు ఎవరూ ముందు రావడం లేదు. దీంతో ఈ జంగిల్ క్లియరెన్స్ పనులు నిలిచిపోయాయి. పూర్తయిన పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు నాలుగైదు రోజుల క్రితం తనిఖీ చేశారు. దీంతో ఈ కట్టలపై ప్రస్తుతం వాహనాల రాకపోకలకు, రైతులు పొలాలకు వెళ్లి వచేందుకు ఎంతో అనువుగా మారాయి. కట్టల అభివృద్ధిపై తక్షణం స్పందించి నిధులు మంజూరు చేయించడమే కాకుండా శరవేగంగా పనులు పూర్తి చేయించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు రైతులు కృతజ్ఞలు తెలిపారు.


పూర్తయిన ఎడమ కాలువ రోడ్డు అభివృద్ధి పనులు

న్యూస్ బాక్స్

212 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 331 పొగాకు బేళ్ల విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 212 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-96, ఆర్ఆర్-2, సీఆర్-16, జంపింగ్ లాట్స్-5 కారణాలతో 119 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.226.79గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

అంగన్‌వాడీ వర్కర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బిట్రగుంట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో అంగన్వాడీ కార్యకర్త, సహాయకుల ఖాళీల భర్తీకి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని కావలి ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య మంగళవారం తెలిపారు. సీఆర్ పాలెం మెయిన్‌లో కార్యకర్త, రామస్వామిపాలెం-2లో ఎస్టీ, నాగులవరం ఎస్టీ, కప్పరాళ్లతిప్ప 1 - 2 ఎస్టీలు, కమ్మపాలెం - 2 ఎస్సీ, పాతబిట్రగుంట -1 బీసీ(బీ), సీఆర్ పాలెం హెచ్‌డబ్ల్యూ సెంటర్ల ఓసీ, బేతనీపేట ఎస్సీలకు కేటాయించిన సహాయకుల పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. అలాగే దగదర్తి మండలం పెద్దపుత్తేడు -1 ఎస్సీ, 2 ఓసీ, చౌటపుత్తేడు బీసీ(డి), కాట్రాయపాడు మెయిన్ ఓసీ ఆయా పోస్టులు ఖాళీలు ఉన్నాయని ఆమె తెలిపారు.

పీహెచ్‌సీని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

గుడ్లూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గుడ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో పీ.పద్మజ మంగళవారం సందర్శించారు. ఆశా కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈనెల 12న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎల్.సాయి ప్రియాంక, రమ్య, సీహెచ్‌వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

దళిత కుటుంబాలపై దాడి అమానుషం

బిట్రగుంట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): దళిత కుటుంబాలపై మూకుమ్మడి దాడి అమానుషమని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లుసాల్మన్‌రాజు అన్నారు. బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంట దళితవాడపై ఇటీవల జరిగిన దాడిని మంగళవారం ఆయన ఖండించారు. గ్రామానికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. మూకుమ్మడి దాడిపై పోలీసులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. అనంతరం గ్రామంలోని బాధజితలతో కలసి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది గడ్డం అంబేద్కర్, నాయకులు పొంగలూరు ప్రసాద్, బొంగులూరు సుధాకర్, దానం మాల్యాద్రి, గంగపట్నం సతీష్, ఏంబేటి శ్రీనివాసులు, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోవూరు రోడ్డు జనార్దనకాలనీ ఫీడర్‌లో లైనుకు తగిలే చెట్ల కొమ్మలు తొలగించుటకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. జనార్దనకాలనీ, పుట్ట ఏరియా, ఎర్రగుంటపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

బిట్రగుంట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురంకు చెందిన విశాంత్రి ఉపాధ్యాయుడు ఆంద్ర బుద్ధయ్య సతీమణి తేళ్ల మేరీ శ్రీవాణి అనారోగ్యంతో సోమవారం మృతి చెందగా మంగళవారం ఆ కుటుంబాన్ని పలువురు పరామర్శించారు. టీడీపీ మండల కన్వీనర్ ఎం.నాగేశ్వరరావు, నాయకులు ఎల్.సుధీర్‌బాబు, సీహెచ్ వెంకటేశ్వర్లు, బీ.ప్రభాకర్, యోహాన్, బీజేపీ నేత ఎన్ఎస్ యాదవ్, ఎంఆర్‌పీఎస్ నేత జీ.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

‘అన్నదాత సుఖీభవ’ రాకుంటే వీఏఏలను కలవండి

లింగసముద్రం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : మండలంలో అన్నదాత సుఖీభవ డబ్బులు వివిధ కారణాల చేత రాని రైతులు వెంటనే రైతు సేవా కేంద్రాలలో వీఏఏలను కలవాలని పొలం పిలుస్తోంది మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి కె హర్షవర్ధన్ చెప్పారు. మంగళవారం మండలంలోని వీఆర్ కోట, అన్నెబోయినపల్లిలో ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ఏ రాజశేఖర్ పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

బిట్రగుంట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు అమృతం అని కావలి ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య అన్నారు. బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని 1, 2 మెర్జి అంగన్వాడీల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవల కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వీ.హైమావతి, ఎంఎస్‌కే షేక్.బాబీజాన్ పాల్గొన్నారు.

కందుకూరులో కుక్కల స్వైరవిహారం

- చిన్నారిపై మూకుమ్మడి దాడి

కందుకూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుల్తాన్‌మొహిద్దీన్ నగర్‌లో మంగళవారం వీధి కుక్కలు స్వైరవిహారం చేశాయి. వీధిలో ఆడుకుంటున్న ఓ చిన్నారిపై ఐదు కుక్కల గుంపు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచాయి. స్థానికులు గమనించి వెంబడించటంతో కుక్కలు పరారవగా గాయపడిన చిన్నారిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. గత కొన్ని రోజులుగా కుక్కలు గుంపులు గుంపులుగా ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఇటీవల కాలంలో పలు సందర్భాలలో బజార్లలో ఆడుకుంటున్న చిన్నారులపై కుక్కలు దాడి చేశాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దోమల నివారణకు చర్యలు


ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కావలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోజు రోజుకు పెరుగుతున్న దోమల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం పట్టణంలోని అనేక వార్డులలో ఫాగింగ్, స్ప్రేయింగ్ చేశారు. 2, 13, 32, 18 వార్డుల్లో ఫాగింగ్, 2, 17, 33 వార్డులలో డ్రైనేజీ కాలువల్లో దోమల నివారణ మందు స్ప్రేయింగ్ చేశారు. పట్టణంలో అన్ని వార్డులలో ఒక టీమ్‌వర్క్‌గా ఈ కార్యక్రమం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళల ఉచిత ప్రయాణం సమర్ధవంతంగా నిర్వహించాలి : డీఎం


మహిళా కండక్టర్‌కు నగదు బహుమతి అందచేస్తున్న డీఎం ఆదినారాయణ

కావలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 నుంచి ప్రారంభించనున్న మహిళల ఉచిత ప్రయాణ పథకం విజయవంతం చేయడానికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలని ఆర్టీసీ కావలి డిపో మేనేజరు డీ.ఆదినారాయణ తెలిపారు. మహిళా ప్రయాణీకుల రద్దీని తట్టుకునే విధంగా మెకానిక్‌లు బస్సులను సిద్ధం చేస్తున్నారని చెప్పారు. కావలి ఆర్టీసీ గ్యారేజి నందు మంగళవారం ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో జూలై మాసంలో తమకు కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించి 115 శాతం సాధించిన సీహెచ్ విజయకుమారి, 108 శాతం సాధించిన ఎం.రాజశేఖర్, 105 శాతం సాధించిన కేవీ శేషమ్మలకు డిపో మేనేజరు నగదు బహుమతులను అందచేశారు. ప్రతి ఉద్యోగి వీరిని ఆదర్శంగా తీసుకుని సంస్థ ఆదాయం పెంపుదలకు కృషి చేయాలన్నారు. అదే విధంగా డ్రైవర్లు ఇంధన పొదుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు ట్రాఫిక్ ఎం.కల్పన, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్‌కే ఖాజా మొహిద్దీన్, ట్రాఫిక్ సూపరింటెండెంట్ రామకృష్ణ, సిస్టం సూపర్‌వైజర్ శివశంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరు, పౌష్టికాహార లోపంతో ‘ఫ్లోరోసిస్’

- రాష్ట్ర ఫ్లోరోసిస్ కన్సల్‌టెంట్ డాక్టర్ దివ్య

కావలి రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కలుషిత నీరు, పౌష్టికాహార లోపమే ఫ్లోరోసిస్‌కు కారణమని రాష్ట్ర ఫ్లోరోసిస్ కన్సల్‌టెంట్ డాక్టర్ దివ్య పేర్కొన్నారు. మండలంలోని తుమ్మలపెంట, సర్వాయపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలోని తుమ్మలపెంట, మోర్లవారిపాలెం, కొత్తపల్లి, సిరిపురం గ్రామాల్లో పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం ఫ్లోరోసిస్ వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పళ్లు వంకర్లు పోవడం, ఎముకలు పటిష్టం లేకుండా వంగిపోవటం ఫ్లోరోసిస్ లక్షణాలన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో పాటు సర్వాయపాలెం ప్రాథ మిక ఆరోగ్యకేంద్రంలో ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్వాయపాలెం, తుమ్మలపెంట పీహెచ్‌సీల వైద్యులు ప్రతిమ, శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ దివ్య

నేతల నైజం ప్రజలకు శాపం

- ప్రతిపక్షంలో ఒకలా.. అధికారంలో మరోలా మాట్లాడుతున్నారు
- స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలపై వామపక్షాల ధర్నా


ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నేతలు


కావలి(టౌన్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అధికారం కోసం నేతల నైజం ప్రజలకు శాపంగా మారుతోందని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారమొచ్చాక మరోలా మాట్లాడడం అలవాటుగా మారిందని వామపక్ష పార్టీల నేతలు ధ్వజమెత్తారు. స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలను నిరశిస్తూ మంగళవారం వెంగళరావునగర్‌లోని విద్యుత్ ఈఈ కార్యాలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు, ట్రూఅప్ చార్జీల పేరుతో పేద, మధ్య తరగతి ప్రజలను దోచుకొంటున్నారన్నారు. ప్రజలు అప్రమత్తమై ప్రశ్నించకపోతే ప్రతినెలా అదనపు భారం మోయకతప్పదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రభుత్వమే నిర్వహించాలని, అదాని అంబానీలకు లాభం చేకూర్చేందుకు అప్పజెప్పడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. వైసీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లకు, ట్రూఅప్ చార్జీలకు వ్యతిరేకంగా ధర్నాలు నిర్వహించి గళమెత్తిన కూటమి నేతలు ఇప్పుడెందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు మానుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు. అనంతరం ఈఈ బెనర్జికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నేతలు పీ.పెంచలయ్య, మధుసూదన్‌రావు, కృష్ణమోహన్, నరసింహారెడ్డి, ఎల్.శ్యామల, పీ.తిరుపాలు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం


మాట్లాడుతున్న సీహెచ్‌సీ డాక్టర్ ఐశ్వర్య

ఉలవపాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ వాయల మస్తానమ్మ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. ఉద్యానవన, మత్స్యశాఖ, విద్యుత్, ఫారెస్టు శాఖల అధికారులు గైరు హాజరయ్యారు. హాజరు కానీ మండల శాఖాధిపతులపై తగిన చర్యలు తీసుకోవాలని సమావేశానికి హాజరైన సభ్యులు ఎంపీడీవో సురేష్‌ను కోరగా వారందరికి షోకాజ్ నోటీసులు జారీ చేసి తగిన వివరణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిస్తానని చెప్పారు. కాగా ఉలవపాడు నుంచి వీరేపల్లి మోడల్ స్కూల్‌కు విద్యార్థులను ఉచితంగా తీసుకెళ్లే ఆర్టీసీ బస్సు నిలిపేశారని, విద్యార్థులు వీరేపల్లి స్కూల్‌కి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారని ఎంఈవో-2 రమణయ్య దృష్టికి తీసుకుపోగా అక్కడే ఉన్న ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. ఉలవపాడు సీహెచ్‌సీలో డాక్టర్లు, సిబ్బంది ప్రజలకు సక్రమంగా సేవలు అందించడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని సభ్యులు డాక్టర్ ఐశ్వర్యను ప్రశ్నించారు. ఉలవపాడులో నీటి ఎద్దడి ఉందని ఎన్నిసార్లు పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలియచేసినా పట్టించుకోవడం లేదని సభ్యులు నిలతీశారు.

వాట్సాప్ గుడ్ గవర్నెన్స్ సేవలు పొందండి


స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ ఉమామహేశ్వరరావు

అల్లూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ మనమిత్ర గుడ్ గవర్నెన్స్ సేవలను సులభతరంగా పొందవచ్చని నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు అన్నారు. అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని పట్టణంలోని నాలుగు సచివాలయాలు, నార్తుమోపూరు, సింగపేట ప్రాంతాల్లో మంగళవారం స్థానిక నాయకులు, సచివాలయాల సిబ్బందితో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించి వాట్సాప్ గుడ్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాట్సాప్ మనమిత్ర ద్వారా అన్ని శాఖల్లో 539 సేవలను పొందే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ప్రజలతో మమేకమై ఈ సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ డీడీవో వరప్రసాద్, నాయకులు కృష్ణచైతన్య, బండి శ్రీనివాసులురెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, జగన్, పాశం దయాకర్, నజీర్‌బాషా, ఖదీర్, బిట్రగుంట చైతన్యరెడ్డి, జగదీష్‌రెడ్డి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు కరేడు విద్యార్థుల ఎంపిక

ఉలవపాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ క్రీడలకు కరేడు విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల్‌బాడ్మింటన్ జూనియర్, సబ్ జూనియర్ బాలబాలికల ఎంపికలు గుడ్లూరు మండలం చేవూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగాయి. ఈ ఎంపికల్లో కరేడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రతిభచాటి రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. కంబోతు గాయత్రి, హృదయ సందేశ్ జూనియర్ టీమ్‌కు, దొడ్ల యోషితారెడ్డి, నిహాల్, ఉపదేశ్ సబ్ జూనియర్స్ టీమ్‌కు ఎంపికైనట్లు తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

కొండాపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని వింజమూరు సీడీపీవో పద్మజ పేర్కొన్నారు. మంగళవారం కొమ్మి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఐసీడీఎస్ ద్వారా గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందచేసే పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం ద్వారా తల్లికి, శిశువులకు ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందచేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుహాసిని, ఎంఎస్‌కే కైటాన్, స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మాధవి, అంగన్‌వాడీలు కేవీ.అరుణ, దొరసాని, రమాదేవి, ఆదిలక్ష్మి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


పగిలిన పైపును తొలగించి కొత్త పైపు వేస్తున్న సిబ్బంది

లింగసముద్రం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని మీసేవా కేంద్ర పగిలిన అంతర్గత మంచినీటి పైపులైన్‌ను తొలగించి, కొత్త పైపు వేశారు. ఈ నెల 1వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ‘మంచినీటి పైపులైన్ పగిలి నిలిచిన నీటి సరఫరా’ వార్తకు మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ స్పందించారు. మంగళవారం ఆయన మంచినీటి పథకం సిబ్బందితో ఎక్స్‌కవేటర్ ద్వారా పగిలిన మంచినీటి పైపును తొలగించి, కొత్త పైపు వేయించి నీటి సరఫరా చేయించారు.

బ్యాటరీ ట్రైసైకిల్ పంపిణీ


దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న సబ్ కలెక్టరు శ్రీపూజ

కందుకూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లెలమూడికి చెందిన దివ్యాంగుడు మణిభూషణాచారికి సక్షమ్ ద్వారా మంజూరైన బ్యాటరీ ట్రైసైకిల్‌ను కందుకూరు సబ్ కలెక్టరు తిరుమాణి శ్రీపూజ మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సక్షమ్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చెన్నా రామాంజనేయులు, మువ్వల సతీష్, చక్కా కేశవ, గుర్రం అల్లూరయ్య, కోట నరసింహం, బొగ్గవరపు ప్రసాద్, ఇస్కాల సురేంద్ర, రంగనాయకులు, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు, అధ్యాపకుల రక్తదానం


రక్తదానం చేస్తున్న నర్సింగ్, ఫిజియోథెరపీ విద్యార్థులు, అధ్యాపకులు

కావలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కావలి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నర్సింగ్, ఫిజియోథెరపీ విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. పట్టణంలోని పాతూరులోని శ్రీలక్ష్మి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో జరిగిన ఈ రక్తదాన శిబిరంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కే.మాధవరెడ్డి 47వ సారి రక్తదానం చేశారు. కళాశాల నిర్వహకులు డాక్టర్ ఆనందకుమార్, డాక్టర్ గోపీ కన్నన్ శిబిరాన్ని పర్యవేక్షించారు. ప్రముఖ సివిల్ ఇంజనీర్ రక్తదాతలకు పండ్లరసాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి రమేష్‌రెడ్డి, సభ్యులు కొండలరావు, గోపీకృష్ణ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు హరినారపరెడ్డి, ప్రసన్నకుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అజిత్‌రెడ్డికి వైసీపీతో సంబంధం లేదు

కందుకూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో అరెస్టు అయిన నల్లపురెడ్డి అజిత్‌రెడ్డికి వైసీపీ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని ఆపార్టీ నాయకులు నన్నం పోతురాజు, ముప్పవరపు కిషోర్, వెలిచర్ల ధనకోటి, పాలవల్లి అమరనాథరెడ్డి, మద్దసాని నవీన్‌కృష్ణ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో అజిత్‌రెడ్డి టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి, ఆపార్టీ అభ్యర్థులకు మద్దతుగా శక్తివంచన లేకుండా పనిచేశారన్నది బహిరంగ రహస్యమని తెలిపారు. అజిత్‌రెడ్డి ఎన్నికల తర్వా త కూడా నేటి వరకు ఎన్నడూ వైసీపీ కార్యక్రమాలలో పాల్గొనలేదని, నియోజకవర్గ వైసీపీ ఇంఛార్జిగా ఉన్న బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను కూడా ఇప్పటివరకు కలవలేదన్నారు.

ఇనుప ఖనిజాన్ని జిందాల్ కంపెనీకి ఇవ్వద్దు


యర్రాఎడ్డిపాలెం కొండప్రాంతంలో ఇనుప ఖనిజంను పరిశీలిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

లింగసముద్రం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లో లభ్యమయ్యే ఇనుప ఖనిజాన్ని జిందాల్ కంపెనీకి ఇవ్వద్ద ని సీపీఎం, సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం గుడ్లూరు ప్రాంతీయ కమిటీ కన్వీనర్ జీ.వెంకటేశ్వర్లు, సీపీఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు ఆ పార్టీల నాయకులు మండలంలోని యర్రారెడ్డిపాలెం గ్రామ సమీపంలో జరుగుతున్న ఇనుప ఖనిజ తవ్వకాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వమే ఇనుప ఖనిజ నిక్షేపాలను వెలికితీసి, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి తరలించాలని డిమాండ్ చేశారు. అనంతరం యర్రారెడ్డిపాలెం గ్రామంలోని కొందరు రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు దువ్వూరు జాన్, నత్తా రామారావు, రైతులు వి.రామకృష్ణారెడ్డి, హనుమంతరావు, ఉట్లపల్లి లక్ష్మీనారాయణ, వింజమూరి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

13న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

కావలి(టౌన్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : బీజేపీ పటిష్ఠత కోసమే రాష్ట్ర అధ్యక్షుడు పీసీఎన్ మాధవ్ జిల్లాకు రానున్నారని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నేతలు మాట్లాడుతూ ఈనెల 13న నెల్లూరులో జరిగే సారధ్యం సభను, రాష్ట్ర అధ్యక్షుడు పర్యటనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ప్రతినెలా చివరి ఆదివారం పట్టణంలోని ప్రతి బూత్‌లో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బ్రహ్మానందం, వీవీ రంగారెడ్డి, పరుసు వెంకటేశ్వర్లు, పూనూరు మాధవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోవూరులో ఎడారి ఓడ..!

ఒంటెను చూస్తే.. పిల్లలకు భలే సరదా! నాలుగైదేళ్ల చిన్నారులైతే ఒంటె ఊళ్లోకి వచ్చిందంటే.. చూపించమని ఒకటే గోల చేస్తారు. తీరా..అక్కడికి తీసుకెళితే.. 'ఆ...య్.. భలే భలే ఒంటె..' అంటూ సంతోషంతో కేరింతలు కొడతారు. అంతేకాదు.. తీరా దగ్గరికెళితే.. ఆ భారీ పర్సనాలిటీని చూసి.. 'వామ్మో.. వీపు ఎంత ఎత్తుంది.. మెడ బారెడు పొడ వుంది..' అని ఆశ్చర్యపోతారు. అయినా ఒక్కసారైనా ఒంటెపైకెక్కి అలా..అలా.. ఊరంతా షికారు కెళ్లాలని ముచ్చటపడి పోతారు. అలా.. నాలుగు రౌండ్లు వేసి ఆకాశమంత సంబరాన్ని సొంతం చేసుకుంటారు. ఇప్పుడు మన కోవూరుకు 'ఎడారి ఓడ' వచ్చేసింది.. వాడ వాడలో సందడి చేస్తోంది. మరెందుకిక ఆలస్యం..? పిల్లలూ.. పదండి.. పదండి.. ఒంటెపై అలా.. ఊరంతా ఓసారి చుట్టేద్దాం!

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)



పేదూడి బతుకు పోరు

ఈ చిత్రం చూశారా..? ఉదయగిరి కోళ్లవీధిలో మంగళవారం ఓ వ్యక్తి మురుగు కాలువలోకి దిగి అక్కడున్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్నాడు. చెత్తకుప్పలు, మురుగు కాలువల్లో ఉన్న ప్లాస్టిక్, ఇతరత్రా వ్యర్థాలను సేకరించి, వాటిని విక్రయించగా వచ్చిన నగదుతో అతను ఆకలి తీర్చుకుంటున్నాడు. ప్రజలకు వ్యర్థమైన వస్తువులు కడుపు నింపేవిగా భావించి పట్టణంలో కొందరు ఈ వృత్తిని కొనసాగిస్తున్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

సీబీఎస్‌ఈ క్లస్టర్ అథ్లెటిక్ పోటీల ప్రారంభం

వెంకటాచలం మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతీ నగర్ వద్ద గల అక్షర విద్యాలయంలో మంగళవారం సీబీఎస్‌ఈ క్లస్టర్ - 7 అథ్లెటిక్ క్రీడా పోటీలు అట్ట హాసంగా ప్రారంభమయ్యాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి 2700 మంది విద్యా ర్థులు, 400 మంది కోచ్‌లు ఈ పోటీలలో పాల్గొనేందుకు తరలివచ్చారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభిం చారు. స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ క్రీడా పోటీలను అక్షర పాఠశాల డైరెక్టర్ కుముదా, ప్రిన్సిపాల్ ప్రియా జాకబ్ పర్యవేక్షిం చారు. ఆగస్టు 10వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని వారు తెలిపారు.

- వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు అరుదు.. నేడు అంతటా!

ఖండాంతరాలు దాటి జిల్లాకు చేరిన పంట

2010లో దేశంలోకి ప్రవేశం ● 2020కల్లా పల్లెలకు విస్తరణ

డ్రాగన్ రంగు.. రుచి.. ఆదాయం!

● జిల్లా లో 200 ఎకరాల్లో సాగు ● గిరాకీ, ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతుల ఆసక్తి



చుడటానికి చక్కటి గులాబీ రంగులో కాస్త వింతగా ఉంటుంది. కోస్తే లోపలంతా విత్తనాలు వెదజల్లినట్లు పరుచుకుని ఆసక్తిగా కనిపిస్తుంది. తింటే రుచికరంగా ఉండటమేకాక నిండా పోషకాలు కలిగి ఆరోగ్యాన్ని ఇస్తుంది... అదే డ్రాగన్ ఫ్రూట్. విదేశాల నుంచి దిగమతి అయిన ఈ పంట ఇప్పుడు జిల్లాలో చాలా చోట్ల సాగువుతోంది. ఒకప్పుడు సంపన్నులకే సొంతమైన డ్రాగన్ పండ్లు ఇప్పుడు ఇక్కడే పండుతుండటంతో సామాన్యులకూ అందుబాటులోకి వచ్చాయి. దీర్ఘకాలం సాగుచేసే అవకాశం, తగినంత ఆదాయం ఉండటంతో రైతులు ఈ విదేశీ పంటను విరివిగా సాగులోకి తెస్తున్నారు. ప్రభుత్వమూ వారికి భారీగా ప్రోత్సాహకాలు ఇస్తుండటంతో జిల్లాలో డ్రాగన్ విస్తరిస్తోంది.

నెల్లూరు రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర అమెరికా ఖండంలోని మెక్సికో దేశంలో పురు దుపోసుకున్న కాక్టస్ జాతికి చెందిన పిటాయ మొక్కకు కాసే డ్రాగన్ ఫలం ఖండాంతరాలు దాటి జిల్లాకు చేరింది. ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య పరమైన పంటగా ఖ్యాతి గడించిన ఈ పంట 2010లో మన దేశంలోకి తొలి అడుగుపెట్టింది. ఆ తర్వాత 2015లో తెలుగు రాష్ట్రాలకు పరిచమై 2020 నాటికి పల్లెలకు విస్తరించింది. నేడు వరికి ప్రత్యామ్నాయ (ఉద్యాన సాగులో) ప్రధాన పంటగా మారింది. ప్రస్తుతం జిల్లా రైతులకు ప్రియమైన పంటల్లో ఒకటిగా మారి దాదాపుగా 200 ఎకరాలకుపైగా సాగవుతోంది.

ప్రభుత్వ ప్రోత్సాహంతో పెరిగిన విస్తీర్ణం

డ్రాగన్ ఫ్రూట్ సాగు ఒకప్పుడు ఖరీదైన పంట. పెద్ద రైతులు తప్ప, చిన్న సన్నకారు రైతులు సాగు చేయలేని పరిస్థితి ఉండేది. కాల క్రమేణ ఈ పంటకు డిమాండ్ పెరగడం, ఆదాయం బాగుండటంతో రైతులు ఆసక్తి చూపడం మొదలైంది. దీనికితోడు విదేశీ జాతికి చెందిన పంట అయినప్పటికీ డ్రాగన్ ఫ్రూట్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం మంచి రాయితీలు అందిస్తుండటంతో రైతులు దీనిని సాగు చేసేందుకు సుము ఖత చూపారు. తొలి రెండేళ్లకు కలిపి హెక్టారుకు ఏకంగా రూ.2.70 లక్షల వరకు పంట పెట్టుబడిలో రాయితీని ఉద్యానశాఖ అందిస్తుం డటంతో అక్కడక్కడ 5 నుంచి 10 ఎకరాలు సాగు చేస్తు ఈ పంటకు అలవాటైన రైతాం గం ప్రస్తుతం 200 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. మొక్కలు ఏడాదికి కాపుకు రావడం, యాజమాన్య పద్ధతులు పాటిస్తే కొన్నేళ్లదాకా సాగుచేసుకునే అవకాశం ఉండటంతో మెట్ట ప్రాంత రైతులు వరికి ప్రత్యామ్నా యంగా డ్రాగన్ ఫ్రూట్‌ను పండిస్తున్నారు. ప్రధాన రహదారుల కు అనుకుని ఉన్న పొలాల్లో అత్యధిక శాతం సాగు చేస్తున్నారు. నీటి అవసరాలు తక్కువ, రాతి భూమికి అలవాటైన పంట కావడంతో మెట్ట రైతులకు కలిసొచ్చింది. నష్ట రహిత పంటగా పేరుండటం, దేశ విదేశాలతోపాటు స్థానిక మార్కెట్‌లోనూ గిరాకీ ఉండటంతో ఏడాదికేడాదికి డ్రాగన్ ఫ్రూట్ సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

వీధి దుకాణాల్లోనూ లభ్యం

కొన్నేళ్ల క్రితం వరకు అరుదైన పంటగా గుర్తింపు పొందిన డ్రాగ న్ ఫ్రూట్, నేడు అన్నీ ప్రాంతాల్లో అందుబాటులోకి వచ్చింది. మాల్స్ సూపర్ మార్కెట్లను దాటి వీధి దుకాణాల్లోనూ దర్శనమిస్తోంది. ఒక్కప్పుడు కాయ ఒక్కోటి రూ.200-250 వరకు పలికేది. కానీ స్థానికంగా సాగు పెరగడంతో నేడు కిలో రూ.100 నుంచి 120కే లభిస్తుండటం విశేషం.



పొదలకూరు-సోమశిల రహదారిపై తోట పక్కనే డ్రాగన్ ఫ్రూట్స్ అమ్మకం

రాయితీలతో రైతులకు ప్రయోజనం



డ్రాగన్ ఫ్రూట్ సాగుచేసే రైతులకు ప్రభుత్వం నుంచి మంచి ప్రోత్సాహం ఉంది. అధిక మొత్తంలో రాయితీ ఇస్తుం డటంతో ఎక్కువ మంది ఈ పంటను సాగు చేసేందుకు ఇష్ట పడుతున్నారు. పైగా కొన్నేళ్లపాటు పంట కాస్తూనే ఉంటుంది. మంచి మార్కెట్ చూసుకుంటే లాభాలు బాగా వస్తాయి.

- ప్రసన్న, ఉద్యాన శాఖ అధికారి

విదేశీ పంట కావడంతో క్రేజ్



విదేశీ సంతతికి చెందిన పంట కావడంతో మనకు బాగా క్రేజ్ పెరిగింది. చాలా మంది ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. ఈ పంటకు మార్కెటింగ్ పెద్దగా అవసరం లేదు. రహదా రుల పక్కన, కూడళ్ల వద్ద అందుబాటులో ఉంచినా కొంటు న్నారు.

- సునీల్ రెడ్డి, రైతు, కాకుపల్లి

మంచి ఆదరణే ఉంది



బయట దేశాల్లో పుట్టిందని ఈ పంటను ఒకప్పుడు అందరూ వింతగా చూసే వాళ్లు. ఏళ్లు గడిచేకొద్దీ ఆదరణ పెరిగింది. గిరాకీ ఉండటంతో తోటల దగ్గరే పంటను అమ్మేసు కోవచ్చు. మెట్ట ప్రాంతాలకు కలిసొచ్చే పంట కావడంతో నీటి వసతి పెద్దగా లేని రైతులు కూడా దీనిని సాగు చేస్తున్నారు.

- గంటా వెంకటేశ్వర్లు, రైతు, వనంతోపు



విధుల పట్ల ఇంత నిర్లక్ష్యమా?

11 గంటలైనా తెరుచుకోని గాదెలదిన్నె సచివాలయం తలుపులు

విడవలూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విడవలూరు మండలంలోని పంచాయతీ, సచివాలయ అధికారులు సకాలంలో విధులకు హాజరు కాకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.. మండలాధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో ఉదయం 10 గంటలకు విధులకు హాజరు కావాల్సిన అధికారులు, సిబ్బంది 11 గంటలైనా హాజరు కావటంలేదు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి ఓ పని నిమిత్తం సోమవారం విడవలూరు సచివాలయానికి ఉదయం 10.30 నిమిషాలకు వెళ్లారు. ఆ సమయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ మినహా ఎవ్వరూ విధులకు హజరు కాలేదు. దీంతో మండలాధికారుల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజాగా మంగళవారం గాదెలదిన్నె సచివాలయం ఉదయం 11 గంటలైనా విధులకు ఒక్కరు కూడా రాకపోవటంతో తలుపులు తెరుచుకోలేదు. వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిరిగారు. దీంతో అధికారుల పనితీరు పట్ల స్థానిక నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎంపీడీవో నగేష్‌కుమారిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దైవదర్శనం చేసుకుని తిరిగి వస్తూ అనంతలోకాలకు..

● ఆగి ఉన్న కారును ఢీకొన్న మరో కారు
● ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు
● మృతుడు ఆంధ్రజ్యోతి ఏసీవో
● నాయుడుపేటలో విషాదం



ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు



మృతుడు రాజేంద్ర (ఫైల్)

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్)/నాయుడుపేట టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : దైవ దర్శనం చేసుకున్నామన్న ఆనందం వారిలో ఎంతో సేపు నిలవలేదు. భోజనం కోసం ఓ హోటల్ వద్ద ఆగిన వారి కారును మరో కారు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం భోగ్యంవారిపల్లి బస్టాండ్ సెంటర్ సమీపం సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, బాధితు కుటుంబ సభ్యుల కథనం మేరకు..

తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన పూల రాజేంద్ర (41) ఆంధ్రజ్యోతి సర్క్యులేషన్ విభాగంలో (ఏసీవో) పని చేస్తున్నారు. తన నలుగురు స్నేహితులతో కలిసి కారులో నాయుడుపేట నుంచి శ్రీశైలంకు వెళ్లారు. అక్కడ దైవదర్శనం అనంతరం తిరిగి వస్తుండగా మార్గమధ్యలో నెల్లూరుజిల్లా వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి వద్ద ఓ హోటల్ వద్ద సోమవారం రాత్రి భోజనం కోసం ఆగారు. ఇద్దరు కారులో నుంచి కిందకు దిగగా, మరో ముగ్గురు కారులోనే ఉన్నారు. అంతలో దుత్తలూరు వైపు నుంచి వేగంగా వెళ్తున్న మరో కారు ఢీకొంది. దీంతో కారులో ఉన్న రాజేంద్రతోపాటు చెందేటి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రకాశం జిల్లా పామూరు వైద్యశాలకు తరలించగా, అప్పటికే రాజేంద్ర మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మిగిలిన ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రఘునాథ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారుతో సహ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా మంగళవారం రాజేంద్ర మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాజేంద్ర స్వస్థలం చిత్తూరు జిల్లా నింద్ర మండలం కావనూరు గ్రామం కావడంతో మృతదేహాన్ని ఆ గ్రామానికి తీసుకువెళ్లారు. ఈ ఘటనతో నాయుడుపేట, కావనూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, మృతుడు రాజేంద్రకు భార్య రాధ, కొడుకు దినేష్ ఇంటర్ చదువుతుండగా, కుమార్తె భవ్య 9వ తరగతి చదువుతోంది.

పోలీసు నిఘాలో వరికుంటపాడు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధి జంగంరెడ్డిపల్లి సమీపంలోని కొండప్రాంతంలో తెల్లరాయి తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని కొంతకాలంగా ఐదు గ్రామాల ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు వారిపై ఉక్కుపాదం మోపారు. దీంతో ఆందోళనకారులతో సహా ప్రజలు సైతం న్యాయబద్ధంగా చేస్తున్న పోరాటాలకు ఇన్ని ఆంక్షలా.. అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం కూడా పోలీసులు అదే పంథా కొనసాగించారు. ఆందోళనలో భాగంగా తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి తమ ఆవేదనను లిఖిత పూర్వకంగా నివేదిక అందించాలనే సంకల్పంతో ఆందోళనకారులు ఉన్నారనే సమాచారంతో పోలీసులు ఉదయం నుంచి బస్టాండ్ సెంటర్‌లో పహారా కాశారు. దీంతో ఆందోళనకారులు నివాసాలకే పరిమితమయ్యారు. కాగా గుండెపోటుకు గురైన పీరయ్య ఆరోగ్య పరిస్థితి కొంత మేరకు కుదుటపడడంతో వైద్యశాలకు నుంచి ఇంటికి తరలించారు.

విడవలూరు బిట్1 ఎంపీటీసీ స్థానం ఏకగ్రీవం



చలంచర్ల కామేశ్వరికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారులు

విడవలూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విడవలూరు బిట్ 1 ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ బలపరిచిన అభ్యర్థి చలంచర్ల కామేశ్వరమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్ని కల రిటర్నింగ్ అధికారి మోహన్‌రావు, సహాయ రిటర్నింగ్ అధికారి నగేష్ కుమారి తెలిపారు. ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ బలపరిచిన చలంచర్ల కామేశ్వరి, కానూ రు ప్రవల్లిక నామినేషన్లు దాఖలు చేయగా, మంగళవారం కానూరు ప్రవల్లిక తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో చలంచర్ల కామేశ్వరి ఎంపీటీసీగా ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించి, ఆమెకు ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, చెముకుల శ్రీనివాసులు, సత్యవోలు సత్యంరెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి చలంచర్ల కామేశ్వరిని అభినందించారు.

సీపీఎం, రైతు సంఘం నాయకుల అరెస్టు



పోలీస్ స్టేషన్‌లో సీపీఎం, రైతు సంఘం నాయకులు

ఉలవపాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : కరేడు పరిసర గ్రామాల్లో ఈనెల 31 వరకు పోలీస్ యాక్ట్ ఉన్నందున బయట వ్యక్తులు సమావేశాలు నిర్వహించకూడదని పోలీసులు పేర్కొన్నారు. మంగళవారం రామకృష్ణాపురంలో పర్యటించిన సీపీఎం, రైతు సంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసుల చర్యలను సీపీఎం జిల్లా కార్యదర్శి జీ.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో ఖండించారు. రామకృష్ణాపురంలో గ్రామ రెవెన్యూ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఇంటింటి సర్వే పేరుతో డాక్యుమెంట్లు అడుగుతున్నారని, ప్రజల నుంచి బలవంతంగా సేకరిస్తున్నారని ఆరోపించారు. విషయం తెలిసి అమాయక గిరిజనలను అవగాహన కల్పించేందుకు వెళ్లిన సీపీఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్యను స్థానిక ఎస్‌ఐ పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉన్నందున అరెస్టు చేసి సాయంత్రం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.



క్యాన్సర్ సర్వేపై శిక్షణను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

క్యాన్సర్ సర్వే పక్కాగా చేపట్టాలి

శిక్షణ ప్రారంభంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీడీ 4.0 ఇంటింట క్యాన్సర్ సర్వేను పక్కాగా చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వం వైద్య కళాశాలలో మంగళవారం ఇంటింట క్యాన్సర్ సర్వేపై జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్‌లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. శిక్షణ పొందిన వైద్యులు, హెల్త్ ఎడ్యుకేటర్లు, ఆరోగ్య సిబ్బంది పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ బాధితులను గుర్తించాలని సూచించారు. ఇంటివద్దే ప్రాథమిక స్ర్కీనింగ్ చేసి వివరాలు నమోదు చేయాలన్నారు. సర్వేలో ప్రజలతో ఎలా మాట్లాడాలి, డేటా నమోదుపై సూచన లిచ్చారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు మండలాల్లో క్షేత్ర స్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ యశ్వంత్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

డీసీ పల్లి కొనుగోలు కేంద్రం నుంచి పొగాకు బేళ్లను వెనక్కి తీసుకెళ్తున్న రైతులు



చూసి కొనండి సార్..!

పొగాకు రైతుల వేడుకోలు ● నాణ్యత లేదనే సాకుతో బేళ్లు వెనక్కు..

మర్రిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కూడా పొగాకు రైతులకు తిప్పలు తప్పటంలేదు. నాణ్యత లేదంటూ పొగాకు బేళ్లను తిరస్కరించడంతో వారు నానా యాతన పడుతున్నారు. గత ఏడాది మంచి ధరలు లభించటంతో రైతులు అధికంగా పొగాకును సాగు చేశారు. తీరా దిగుబడులు చేతికి రావడంతో భిన్నమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. అన్నీ రకాల బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేయక పోవటంతో ప్లీజ్.. చూసి కొనండి సార్...! అంటూ వచ్చిన బయ్యర్లను రైతులు వేడుకుంటు న్నారు. వ్యాపారులు మాత్రం ఆచీతూచీ వ్యవహరించడంతో కొనుగోళ్లు కూడా మందగమనంగా సాగుతున్నాయి.

● **రైతుల ఆవేదన**

ప్రతీరోజూ డీసీపల్లి వేలం కేంద్రంలో 150 నుంచి 200బేళ్లకు పైగా తిరస్కరణకు గురవుతున్నాయి. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. బోర్డు పరిధిలోని పది మండలాల్లో 1738 పొగాకు బ్యారన్లు ఉన్నాయి. ఈ ఏడాది పంట కాలానికి 2,069మంది రైతులు 5861.91హెక్టార్లల్లో పొగాకు సాగుచేశారు. బోర్డు 7.4మిలియన్ కేజీలకు అనుమతి ఇవ్వగా, ఇప్పటి వరకు రైతుల నుంచి 6.72 మిలియన్ కేజీలను కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. అనుమతికి మించి సాగు చేసిన పొగాకు కూడా రైతుల వద్దే ఉంది. ఈ మొత్తం కొనుగోలు చేసే సమయానికి పొగనార్లు పోసి, తిరిగి పొగ నాట్లు కూడా ప్రారంభమయ్యే అవకాశం లేకపోలేదని రైతులు చెబుతున్నారు. మంగళవారం బోర్డుకు రైతులు 358బేళ్లను తీసు కొని రాగా, 244బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 114బేళ్లను తిరస్కరించారు. కాగా గరిష్ఠ ధర రూ.280 కనిష్ఠ ధర రూ.159గా ఉంది.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 28 అంగన్‌వాడీ కార్యకర్తలు, 168 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పాస్ అయిన వారు, ఈ ఏడాది జూలై 1 నాటికి 21 నుంచి 35లోపు వయసు ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్థానిక వివాహిత మహిళలై ఉండాలని, అవివాహితులు అనర్హులని పేర్కొన్నారు. పోస్టుల ఎంపిక ప్రక్రియ రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఉంటుందని ప్రకటించారు.